డిసెంబర్
2017

140

సంపుటి : 12 సంచిక : 8 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

నయా ఉదారవాదం - పెట్టుబడిదారీ సంక్షోభం

వందేళ్ళ విప్లవం, సంస్కరణవాదం యూరప్ ఖండం

మనమందరమూ బోల్షివిక్‌లమే

వ్యవసాయ సంక్షోభాన్ని తీవ్రం చేసిన నోట్ల రద్దు నిర్ణయం

గోగూండాల దాడులు వాస్తవాలు - వక్రీకరణలు

వెనిజులా బొలివేరియన్ విప్లవం గుణపాఠాలు

పెట్టుబడిదారులకోసం గుజరాత్ భూసేకరణ చట్టం

అస్తిత్వవాదమా? విముక్తి మార్గమా?

టాటూ వీరులు

# టాటూ వీరులు

ఎడ్గార్ స్నో



శత్రువు తుపాకీ గుళ్ళ వర్షంకురిపిస్తుండగా టాటూహో నదిని దాటుతున్న రెడార్మీ యోధులు

**టా**టూ నదిని దాటటం దీర్ఘయాత్రలో అత్యంత క్లిష్టమైన సంఘటన. ఎర్రసైన్యం గనుక అక్కడ విఫలమైవుంటే అది నాశనం కాబడి వుండేది. అలా నాశనమైన వుదంతం చరిత్రలో ఇంతకుముందు వున్నది కూడా. మారుమూలన గల టాటూనది ఒడ్డుల వద్దనే "మూడు రాజ్యాల" వీరులు, అనేక మంది యుద్ధవీరులు తమ ఓటమిని పొంది వున్నారు. ఈ నది ఒడ్డుల్లోనే తాయ్‌పింగ్ తిరుగుబాటు దారుల్లో ఒక లక్షమందితో కూడిన చివరి సైన్యం రాకుమారుడు షీటా– కాయ్ నాయకత్వాన 19 వ శతాబ్ధంలో ప్రఖ్యాతి వహించిన సెంగ్‌కువో ఫాన్ నాయకత్వాన గల మంచూ సైనికుల చేత చుట్టుముట్టబడి నాశనం చేయబడింది. యుద్ధప్రభువులూ, తన మిత్రులు అయిన లియూ సియాంగ్ లియూ వెన్– హూయిలకూ, తాయ్‌పింగ్ చరిత్ర తిరిగి జరిగేటట్లుగా చూడవలసిందిగా ఎర్రసైన్యాన్ని వెంబడిస్తున్న తన సైనిక జనరల్స్‌కూ సర్వసైన్యాధిపతి చియాంగ్‌కై – షేక్ 3 టెలిగ్రాములు పంపాడు.

అయితే షీ టా కాయ్ బాగా జాప్యం చేయటం అతని ఓటమికి ప్రధాన కారణమని కమ్యూనిస్టులకు కూడా తెలుసు. టాటూ నది ఒడ్డుకు చేరుకొన్న తర్వాత రాకుమారుడు షీ తన కుమారుని జన్మదినోత్సవం కొరకు మూడురోజులు అక్కడ ఆలస్యం చేశాడు. ఈ మూడు రోజుల విశ్రాంతి కాలంలో శతృవు తనకు వ్యతిరేకంగా కేంద్రీకరించటానికి, వెనకడుగు వేయటానికి వున్న మార్గాన్ని దిగ్బంధం చేయటానికి అతివేగంగా తన సైన్యాలను తరలించాడు. తన ఈ పొరపాటును ఆలస్యంగా రాకుమారుడు షీ గుర్తించాడు. చక్రబంధాన్ని ఛేదించటానికి అతను ప్రయత్నించాడు. కానీ కొండల మధ్య గల ఇరుకైన కనుమల గుండా వెసులుబాటుతో ప్రయాణం చేయటం అసంభవమై పోయింది. అతను దేశపటం నుండి తుడిచివేయబడ్డాడు. అతను చేసిన తప్పును తిరిగి చేయరాదని కమ్యూనిస్టులు కృతనిశ్చయంతో వున్నారు. "బంగారపు ఇసుక నది" (యాంగ్సీనది ఆ విధంగా పిలువబడుతుంది) నుండి ఉత్తరం వైపుగా సెచువాన్‌లోకి వేగంగా కదలిపోతూ, యుద్ధ స్వభావులైన అటవీ తెగలు నివసించే "లోలో ల్యాండ్" రాజ్యాన్ని ఎర్ర సైన్యం చేరుకొన్నది:. అదొక స్వతంత్ర రాజ్యం: అక్కడ 'తెల్ల' "నల్ల" లోలోలు నివసిస్తారు. లోలో జాతి ఎన్నడూ తన చుట్టూ వుండే చైనీయుల చేత జయింపబడలేదు. ఆ ప్రాంతం మిగిలిన చైనాలో కలుపుకొనబడలేదు. సెచువాన్ రాష్ట్రంలో దట్టమైన అడవులూ, పర్వతాలతో కూడిన ప్రదేశాన్ని లోలో జాతి ప్రజలు శతాబ్దాల తరబడి తమ నివాస ప్రాంతంగా చేసుకొని వున్నారు. టిబెట్టుకు కొద్దిగా తూర్పున యాంగ్సీనదికి దక్షిణ ప్రాంతపు అర్ధచంద్రాకార ప్రాంతానికి అనుకొని ఈ లోలో రాజ్యపు సరిహద్దులున్నాయి. కమ్యూనిస్టులిక్కడ బాగా ఆలస్యం చేసి బలహీనపడిపోతారనీ, తద్వారా తాను టాటూనదికి ఉత్తరాన సైన్యాలను కేంద్రీకరించవచ్చుననీ చియాంగ్‌కై – షేక్ మంచి నమ్మకంతో వుండి వుంటాడు. చైనీయులంటే లోలో ప్రజలకు వున్న ద్వేషం సాంప్రదాయ సిద్ధంగా వస్తూ వున్నది. తీవ్రమైన నష్టాలు పొందకుండానూ, లేదా పూర్తిగా నాశనం కాకుండానూ చైనీయుల సైన్యమేది లోలో జాతుల ప్రజల సరిహద్దులను దాటి అరుదుగానే వెళ్లగలిగింది.

అయితే కొండజాతి ప్రజలైన మి యావో, షాన్ ప్రజలు నివసించే జిల్లాల గుండా కమ్యూనిష్టులు ఇప్పటికే సురక్షితంగా ప్రయాణం చేసి వున్నారు. వారు క్వీచౌ, యునాన్, రాష్ట్రాల్లోని కొండజాతి ప్రజలు. కమ్యూనిస్టులు వారితో స్నేహాన్ని సంపాదించారు. తమ సైన్యంలోకి కొందరు కొండజాతి ప్రజల్ని చేర్చుకోగలిగారు కూడా. లోలో ప్రజలతో సంప్రదింపులు జరపడానికి తమ ప్రతినిధులలను ఇప్పటికే పంపారు. మార్గమధ్యలో స్వతంత్ర లోలో రాజ్యానికి సరిహద్దులో వున్న అనేక పట్టణాలను వారు పట్టుకొన్నారు. అక్కడ చైనా రాష్ట్రాల యుద్ధ ప్రభువుల చేత బందీలుగా నిర్భందంలో పెట్టుబడి వున్న అనేకమంది లోలో సైనిక నాయకులను వారు కలుసుకున్నారు. వారిని విడుదల చేసి తమ ప్రజల వద్దకు పంపారు. వీరు కమ్యూనిస్టులను సహజంగానే ప్రశంసించారు.

ఎర్రసైన్యం యొక్క అగ్రగామి దళంలో కమాండరు లియూ పో –చెంగ్ వున్నాడు. సెచువాన్ యుద్ధప్రభువు సైన్యంలో ఈయన ఒకప్పుడు ఆఫీసరుగా పనిచేసి వున్నాడు. ఈ కొండజాతి ప్రజలు లియూకు తెలుసు. వాళ్ల మధ్య ఉండే అంతరంగిక అంత:కలహాలు, వాళ్లకుగల అసంతృప్తి లియూకు తెలుసు: ప్రత్యేకించి చైనీయులంటే వాళ్లకుగల ద్వేషాన్ని ఆయన బాగా ఎరుగును. లోలో జాతి భాషకూడా ఆయన కొద్దిగా మాట్లాడగలడు. వారితో మైత్రీ ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమం మీద బయలుదేరి వారి భూభాగంలో ప్రవేశించాడు.

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **టాటూ వీరులు**
   ఎడ్గార్ స్నో ............. 2
2. **నయా ఉదారవాదం - పెట్టుబడిదారీ సంక్షోభం**
   ప్రభాత్ పట్నాయక్ ...... 4
3. **వందేళ్ళ విప్లవం, సంస్కరణవాదం యూరప్ ఖండం**
   ప్రకాష్ కరత్ ............ 8
4. **మనమందరమూ బోల్షివిక్‌లమే...**
   విజయప్రసాద్ ........... 11
5. **వ్యవసాయం సంక్షోభాన్ని తీవ్రం చేసిన నోట్ల రద్దు నిర్ణయం**
   విజూ కృష్ణన్............ 14
6. **గోగూండాల దాడులు.. వాస్తవాలు - వక్రీకరణలు**
   జె. జగదీష్.............. 18
7. **వెనిజులా బొలివేరియన్ విప్లవం గుణపాఠాలు**
   స్టీవ్ ఎల్‌నర్............. 21
8. **పెట్టుబడిదారులకోసం గుజరాత్ భూసేకరణ చట్టం**
   రిషిత్ నియోగి ........... 27
9. **అస్తిత్వవాదమా? విముక్తి మార్గమా?**
   ఎస్.వీరయ్య ............ 30



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:
**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ) గుంటూరు(జి)
**ఫోన్:** ఎడిటోరియల్ **9490099333**
**మేనేజర్: 9490099275**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# కార్పొరేట్ మీడియా

**ఈ** మధ్య తెలుగు రాష్ట్రాల్లో, ఆమాట కొస్తే మొత్తం దేశంలోనే పెట్టుబడిదారుల సంబరాలు ఎక్కువైపోయాయి. అంతర్జాతీయ పెట్టుబడి ముందు మంత్రులు, ముఖ్యమంత్రులు, చివరికి ప్రధాన మంత్రి కూడా ప్రోటోకాల్‌నూ, దేశ ఆత్మాభిమానాన్ని పక్కన పెట్టి మోకరిల్లుతున్న తీరుకు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జిఇఎస్) అద్దం పట్టింది. పెట్టుబడిని ప్రభుత్వాలు శాసించే రోజులు పోయాయి. పెట్టుబడి ప్రభుత్వాల జుట్టుపట్టుకుని ఆడించే పాడు కాలంలో మనమున్నాం. ఇటీవలి కాలంలో హైదరాబాద్‌లో పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ లెక్కకు మిక్కిలిగా జరిగిన సదస్సుల్లో జిఇఎస్ ఒకటి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీలు పడి మరీ సదస్సులు నిర్వహిస్తున్నాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు.... ఎప్పుడూ ఏదో నగరంలో పెట్టుబడి సదస్సులు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి సదస్సునూ కార్పొరేట్ పత్రికలు సంబరాలుగా జరుపుతున్నాయి. ఆ పెట్టుబడిదారులే, ఆ సంస్థలే అన్ని సదస్సుల్లోనూ ప్రత్యక్షమవుతున్నారు. ఏ రాష్ట్రం ఎక్కువ రాయితీలిస్తే అక్కడకు వచ్చి వాలిపోతామంటున్నారు. ఒక రాష్ట్రానికీ మరో రాష్ట్రానికీ మధ్య, ఒక దేశానికీ మరో దేశానికీ మధ్య పోటీలు పెట్టి రాయితీల మీద రాయితీలు సంపాదిస్తున్న కార్పొరేట్ కంపెనీలు ప్రజల సంపదను పీల్చి ఏటేటా తెగబలిసి పోతున్నాయి. ప్రజల ఆదాయాలు మాత్రం నానాటికీ తీసికట్టు నాగంభట్టు అన్నట్లు క్షీణించి... క్షీణించి.. చివరికి వారు ప్రభుత్వాలు పడేసే తాయిలాలకోసం చేతులు చాచే పరిస్థితికి వస్తున్నారు.

పెట్టుబడిదారలకు కష్టం వస్తే కార్పొరేట్ మీడియాలో పతాక శీర్షికల కెక్కుతుంది. వారు సంబరాలు జరుపుకుంటే పేజీలకు పేజీలు నిండిపోతున్నాయి. కానీ కార్మికులు, శ్రామిక ప్రజల కష్టాలు, కడగండ్లకు అక్కడ స్థానమే ఉండదు. ఒక వేళ ఇవ్వాల్సి వస్తే చివరి పేజీల్లో సింగిల్ కాలమ్ వార్తల్లోకి నెట్టివేయబతాయి. మన మీడియా వర్గస్వభావం ఇలాంటి సందర్భాల్లో మరింత నగ్నంగా బయటపడుతుంది. పెట్టుబడిదారీ మీడియా పాలక వర్గాల దోపిడీ స్వభావాన్ని, వారికి ప్రజల సొమ్మును ప్రభుత్వాలు నైవేద్యం పెడుతున్న తీరును అందమైన మాటల వెనుక కప్పి పుచ్చుతుంది. పెట్టుబడిదారుల దోపిడీకి ప్రభుత్వాలు స్వేచ్ఛనిస్తే మీడియా దానికి 'సంస్కరణలు' అనే ముద్దు పేరు పెడుతుంది. అభివృద్ధికి సంస్కరణలు సోపానాలని చెబుతుంది. బడ్జెట్‌లో వారికిచ్చే తాయిలాలకు 'పన్ను రాయితీలు' అంటుంది. పరిశ్రమలు రావడానికీ, ఉద్యోగాల కల్పనకు ఇది ఉపయోగపడుతుందని వాదిస్తుంది. బ్యాంకులకు కార్పొరేట్ కంపెనీలు లక్షల కోట్ల రూపాయలు ఎగ్గొడితే దాన్ని 'నిరర్థక ఆస్తులు' అనే మోసకారి మాటలతో పిలుస్తుంది. అదే సమయంలో కార్మికులకు, వ్యవసాయ దారులకు ఇచ్చే కనీస రాయితీలను సబ్సిడీలంటుంది, తాయిలాలంటుంది. ఇలా ఇవ్వడం వల్ల దేశం ఆర్థికంగా గుల్లయిపోతోందని నిత్యం గగ్గోలు పెడుతుంది.


ఏ మాటల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో తెలుసుకోనంత కాలం ప్రజలు మళ్లీమళ్లీ మోసపోతుంటారు... అని లెనిన్ చెప్పిన మాటలు ఎంతటి సత్యాలో నేటి కార్పొరేట్ మీడియాను చూస్తే స్పష్టమవుతుంది. అందుకే శ్రామిక వర్గం తన స్వంత మీడియాను అభివృద్ధి చేసుకోవాలి. ప్రత్యామ్నాయ మీడియాను ప్రోత్సహించాలి, విస్తరించాలి. అప్పుడే తల కిందికీ, కాళ్లు పైకీ పెట్టి కార్పొరేట్ మీడియా చూపిస్తున్న ప్రపంచాన్ని శ్రామిక వర్గం సరైన రీతిలో చూడగలుగుతుంది. ప్రత్యామ్నాయ విధానాల కోసం శ్రామిక వర్గం జరుపుతున్న పోరాటంలో ప్రత్యామ్నాయ మీడియా కోసం జరిపే పోరాటం అంతర్భాగం కావాలి.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-4, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# నయా ఉదారవాదం - పెట్టుబడిదారీ సంక్షోభం



రచయిత ప్రముఖ ఆర్థికవేత్త

**ప్రభాత్ పట్నాయక్**

"నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం" అంటే ఏమిటి? ఇది పెట్టుబడిదారీ విధాన పరిణామంలో ఒకదశ. వివిధదేశాల మధ్య సరుకుల రాకపోకలపైన, పెట్టుబడుల రాకపోకలపైన ఉండే ఆంక్షలు దాదాపు ఎత్తి వేస్తారు. ద్రవ్యపెట్టుబడి రాకపోకలపై ఆంక్షలు కూడా పూర్తిగా సడలించబడతాయి. అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి వత్తిడి వలన ఈ సడలింపులన్నీ అమలు జరుగుతాయి. అంటే ఈ దశలో పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనం కింద నడుస్తుందన్నమాట. వివిధ దేశాలలోని బడా పెట్టుబడిదారులంతా ఈ అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో మమేకం అవుతారు. దాంతో అన్నిదేశాలలోనూ ఒకేరకమైన నయా ఉదారవాద విధానాలు అమలులోకి వస్తాయి.

ఈ అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ఎలా వచ్చింది? ఇది పెట్టుబడి కేంద్రీకరణ అంతకంతకు జరిగే క్రమంలో వచ్చిన పరిణామం. ఫైనాన్సు పెట్టుబడి గురించి లెనిన్ గతంలో విశ్లేషించారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి విడివిడిగా ఉండేవి కాస్తా ఒకే శక్తిగా కలగలిసిపోయి ఆదేశపు ఆర్థికవ్యవస్థ మీద ఆధిపత్యం సాధిస్తాయని లెనిన్ వివరించాడు. అలా లెనిన్ కాలంలో ఏ దేశానికా దేశంలో ఆధిపత్యం చెలాయించిన ద్రవ్యపెట్టుబడి తర్వాత కాలంలో మరింత కేంద్రీకృతం అవుతూ ఈనాటికి అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడిగా రూపొంది ఆధిపత్యం చలాయించగలిగే స్థాయికి చేరింది.

ఒకదేశపు ఆర్థిక వ్యవస్థ గనుక ఒకసారి ఈ అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రవాహానికి చేరువైతే ఆదేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి అమాంతం లోబర్చుకుంటుంది. అటుపైన ఆ దేశపు ప్రభుత్వానికి ఇష్టంఉన్నా, లేకపోయినా అది అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి యొక్క దురాశాపూరితమైన కోర్కెలకు తల వొగ్గాల్సిందే. అది ఆదేశించిన విధానాలను అమలు జరిపి తీరాల్సిందే. ఈ వాస్తవం మనం గుర్తించాలి. నయా ఉదారవాద పెట్టుబడిదారీ దశ ముఖ్య లక్షణాలు, ఆ విధానాలు అమలు జరిగితే కలిగే పర్యవసానాలు ఈ వాస్తవం నుండే పుట్టుకొస్తాయి.

మొదటిది: గతంలో పెట్టుబడిదారీ విధానంలో వెనకబడిన దేశాల నుండి ముడి సరుకులు, కార్మికులు అభివృద్ధి చెందిన దేశాలకు తరలించబడ్డారు. ఆసియా, ఆఫ్రికా దేశాల నుండి ముడిసరుకులు, మనుషులు పశ్చిమ యూరప్, అమెరికా ఖండాలకు తరలించబడినందు వల్లనే అక్కడ అభివృద్ధి వేగం కొనసాగింది. కాని నేటి నయా ఉదారవాద కాలంలో పెట్టుబడి అభివృద్ధి చెందిన దేశాల నుండి వెనకబడ్డ దేశాలలోకి వస్తోంది. ఎందుకు? వెనకబడిన దేశాలలో వేతనాలు తక్కువ స్థాయిలో ఉన్నందున ఇక్కడ సరుకుల తయారీ చౌకగా ఉంటుంది. అలా చౌకగా తయారయ్యే ఉత్పత్తులతో అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడి, పై చేయి సాధించడం సాధ్యపడుతుంది.

రెండవది: నయా ఉదారవాద విధానం ఏ దేశంలో అమలు జరుగుతుందో అక్కడ రాజ్యం యొక్క పాత్ర మారిపోతుంది. మామూలుగా అయితే ఏదైనా పెట్టుబడిదారీ దేశంలో (మనదేశంలో సైతం) రాజ్యం అనుసరించేది, సమర్థించేది పెట్టుబడిదారీ విధానాన్నే. అయినప్పటికీ, పైకి మాత్రం రాజ్యం అన్ని వర్గాల ప్రజల కోసమూ పనిచేస్తున్నట్టు, అణచివేయబడే వర్గాలతో సహా అన్ని వర్గాల ప్రయోజనాలనూ కాపాడు తున్నట్టు కనపబడుతుంది. అదే నయా ఉదారవాద విధానాల అమలు మొదలయ్యాక అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి – కార్పొరేట్ల ప్రయోజనాలతో రాజ్యం నేరుగా, బాహాటంగా పెనవేసుకుపోతుంది. వారి ప్రయోజనాల కోసమే పనిచేస్తుంది. పర్యవసానంగా చిన్న చిన్న ఉత్పత్తి దారులకు, రైతాంగానికి అంతవరకు అందించిన తోడ్పాటు, ఊరట అందించకుండా రాజ్యం వారి ప్రయోజనాల రక్షణ విషయంలో వెనక్కి తగ్గు తుంది. దీనివలన "ఆదిమ సంచయం" క్రమం మళ్లీ మొదలవుతుంది. పెట్టుబడిదారీ విధానపు తొలిదశలో రైతుల నుండి భూములను లాక్కొనడం, చిన్న చిన్న వృత్తులను నాశనం చేయడం, ప్రకృతి వనరులను బలవంతంగా స్వంతం చేసుకోవడం వంటి పద్ధతులకు పాల్పడిన తీరునే "ఆదిమ సంచయం"గా మార్క్స్ అభివర్ణించాడు. నయా ఉదారవాదం అమలు జరుగుతున్న ప్రస్తుత కాలంలో అవే పద్ధతులు మళ్లీ ముందుకొచ్చాయి.

మూడవది: "డిమాండ్ మేనేజిమెంట్" నిర్వహణలో రాజ్యం యొక్క జోక్యం లేకుండా అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి తన వత్తిడిని తీవ్రం చేస్తుంది. (డిమాండ్ మేనేజిమెంట్ అంటే ఏమిటి? పెట్టుబడిదారీ విధానంలో సరుకుల ఉత్పత్తి పెరుగుతూ పోతుంది. అదే మోతాదులో ప్రజల కొనుగోలు శక్తి పెరగదు. పెట్టుబడిదారుడు అంతకంతకు కార్మికులకు తక్కువ వేతనాలు ఇవ్వడం, కార్మికుల సంఖ్య తగ్గించడం, వారి పని భారం పెంచడం వంటి చర్యల ద్వారా తన లాభాన్ని పెంచుకోజూస్తాడు. ఇదంతా మొత్తం మీద ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఇంకోపక్క మార్కెట్‌లోకి వచ్చే సరుకులు పెరుగుతాయి. దీనివలన కొంతసరుకు అమ్ముడు పోకుండా మిగిలిపోతుంది. పెట్టుబడిదారీ సంక్షోభానికి ఇదే మూలం.

దీనిని నివారించడానికి రాజ్యం జోక్యం చేసుకోవాలని కీన్స్ ప్రతిపాదించాడు. రాజ్యం జోక్యంతో, ప్రభుత్వ ఖర్చుతో మార్కెట్‌లోకి అదనపు సొమ్ము పంపి, కొత్త ఉద్యోగాలు కల్పించి, కొనుగోలు శక్తిని డిమాండ్‌కు అనుగుణంగా సవరించడమే డిమాండ్ మేనేజిమెంట్.) రెండో ప్రపంచ యుద్ధానంతర కాలం

లో పెట్టుబడిదారీ దేశాలలో రాజ్యం జోక్యం పెద్ద ఎత్తున జరిగింది. అయితే దీనిని ద్రవ్య పెట్టుబడి ఏనాడూ అంగీకరించలేదు. రాజ్యమే అభివృద్ధి పనులు చేబట్టి, రాజ్యమే ఉపాధికల్పన చేస్తే అది తమ స్వేచ్ఛకు ఆటంకం, అవరోధం అని ఆ వర్గం భావిస్తూ వచ్చింది. రాజ్యమే అన్నీ చేస్తే ఇక పెట్టుబడిదారీ వర్గం ఉనికికే అర్థం లేకుండా పోతుందని ఆందోళన పడుతూ వచ్చింది.

ఇప్పుడీ నయా ఉదారవాద విధానం అమలు వచ్చాక అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి వత్తిడితో ప్రతిదేశంలోనూ "ద్రవ్య బాధ్యత" చట్టాలు జారీ అవుతూ పోయాయి. (దీనినే మనదేశంలో ఫిస్కల్ రెస్పాన్సిబులిటీ అండ్ బడ్జెటరీ మేనేజిమెంట్ చట్టం – ఎఫ్‌ఆర్.బి.ఎం. గా పిలుస్తున్నారు) దీనివలన రాజ్యం నేరుగా ఉపాధి కల్పనకో, అభివృద్ధి పనులకో ఖర్చు చేయరాదు. దానికి బదులు పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు పెంచుతూ పోవాలి.

ఇందువలన దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధిని ప్రేరేపించేశక్తి రాజ్యానికి లేకుండా పోతోంది. ప్రోత్సాహకాల పేరుతో పెట్టుబడిదారులు రాజ్యం నుండి పొందేదంతా వారు వేరే దిశగా మళ్లించుకుపోతున్నారే తప్ప, దానిని తిరిగి పెట్టుబడిగా మార్కెట్‌లో పెట్టడం లేదు. మరి మార్కెట్‌లో డిమాండ్‌ను ఎలా సర్దుబాటు చేస్తున్నారు? భూములు, ఆస్తుల విలువలు పెంచుకుంటూ పోతున్నందున తాత్కాలికంగా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెరుగుదల కనబడుతుంది. ఇది కొద్దికాలం పాటు మార్కెట్‌లో డిమాండ్‌ను నిలబెట్టవచ్చు. కాని ఇది తాత్కాలికమైన బుడగ లాంటిదే. ఎప్పుడైనా పేలిపోవచ్చు. అలా 2008లో పేలిపోయింది గనుకనే అమెరికాలో అంత పెద్ద సంక్షోభం వచ్చికూచుంది. నేటీకి కోలుకోలేదు. అప్పులిచ్చి విరివిగా వినియోగదారులచేత ఖర్చు పెట్టించడం ద్వారా కూడా మార్కెట్‌లో డిమాండ్‌ను కొద్దికాలం పాటు నిలబెట్టవచ్చు. ఇదీ తాత్కాలికమైన బుడగే. ఆ అప్పులు తిరిగి తీర్చాల్సిన సమయం వచ్చేసరికి ఎగవేతదారులు పెరిగిపోయి బ్యాంకులు దివాలా తీస్తాయి. అప్పులపందేరం నిలిచిపోతుంది. ఈ తాత్కాలిక బుడగలతో దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి క్రమాన్ని ఎంతో కాలం నిలబెట్టడం అసాధ్యం.

నయా ఉదారవాద విధానం అమలు జరిగే క్రమంలో మొత్తం మీద చూసుకున్నప్పుడు కొంతకాలం పాటు దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందుతున్నట్టు అనిపిస్తుంది. స్థూల జాతీయోత్పత్తి, తలసరి ఆదాయం వంటి గణాంకాలు అటువంటి అభిప్రాయం కలిగిస్తాయి. కాని ఈ నయా ఉదారవాద విధానం అమలు క్రమంలో ఆదాయాల మధ్య వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోతుంది. దేశాలకు, దేశాలకు మధ్యఒకవైపు, ఒకదేశంలోనే సంపన్నులకు పేదలకు మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతాయి. అభివృద్ధి చెందిన దేశాల్లోని కార్మికులు కూడా తమ వేతనాలను పెంచుకొనే, లేదా నిలబెట్టుకొనే శక్తి కోల్పోతారు. ఎందుకంటే, గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు వారు వెనకబడిన దేశాలలోని కార్మికులతో పోటీ పడాలి. ఇక వెనకబడిన దేశాలలోని కార్మికుల వేతనాలైనా పెరుగుతాయా అంటే అదీ ఉండదు. పెట్టుబడుల ప్రవాహదిశ వెనుకబడ్డ దేశాలవైపు మరలడం వాస్తవమే అయినా, అదే సమయంలో, ఆ వెనకబడ్డ దేశాలలోని చిన్న చిన్న ఉత్పత్తిదారులు, సాంప్రదాయ వృత్తులవారు, రైతులు చితికిపోతారు. (పెట్టుబడి 'ఆదిమసంచయం' పర్యవసానంగా). వీరంతా లేబర్ మార్కెట్‌లోకి ఉపాధి వేట కోసం ప్రవేశిస్తారు. దాంతో వెనకబడ్డ దేశాలలో కూడా వేతనాలు పెంచుకోవడం జరగదు సరికదా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ తదితర పేర్లతో వేతనాలు కుదించబడతాయి. ఒకపక్క కార్మికుల 'ఉత్పాదకత' పెరుగుతుంది. కాని వేతనాలు తగ్గుతాయి. వృత్తులు, వ్యవసాయం దెబ్బతినడం వలనగాని, అసంఘటిత రంగం పెరిగి వేతనాలు కుదించుకుపోవడం వలనగానిమొత్తం మీద వెనుకబడ్డ దేశాలలో పౌష్టికాహారం లభ్యత తగ్గిపోతుంది. జీవన ప్రమాణాలు దెబ్బతింటాయి. దారిద్ర్యం పెరిగిపోతుంది.

ఈ పర్యవసానాలన్నీ నిజానికి నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి దిశలో ఉన్నప్పుడే జరుగుతాయి. అయితే ఈ అభివృద్ధిని కూడా నిలకడగా కొనసాగించడం సాధ్యపడదు. కారణం ఏమిటి? తక్కువ వేతనాలతో ఎక్కువ ఉత్పాదకత సాధించడం అనేది ప్రపంచ ఆర్థికవ్యవస్థ మొత్తంగా చూసుకున్నప్పుడు మరింత ఎక్కువ మిగులు ఏర్పడడానికి దారితీస్తుంది. ఈ మిగులు ఎంత పెరిగినా అది వినిమయాన్ని పెంచదు. జీతాలు పెరిగితేనే వినిమయం పెరుగుతుంది. ఆ జీతాల భాగం కుదించుకుపోతూ ఉంటుంది గనుక ఉత్పత్తి వినిమయం కాకుండా మిగిలిపోతుంది. ఒక్కపక్క ప్రజల అవసరాలు పెరుగుతూనే వుంటాయి. ఇంకోవైపు ఉత్పత్తి కూడా పెరుగుతూనే ఉంటుంది. కాని ఆ ఉత్పత్తి అయినది వినియోగం కాదు. రియల్ ఏస్టేట్ బుడగ వంటిదో, అప్పులిచ్చి వినిమయాన్ని ప్రోత్సహించడం వలన ఏర్పడిన బుడగవంటిదో తాత్కాలికంగా వినిమయాన్ని పెంచవచ్చు. కాని ఆ బుడగలు పేలిపోగానే మళ్లీ సమస్య మొదటికే వస్తుంది.

"ఈ పర్యవసానాలన్నీ నిజానికి నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి దిశలో ఉన్నప్పడే జరుగుతాయి. అయితే ఈ అభివృద్ధిని కూడా నిలకడగా కొనసాగించడం సాధ్యపడదు. కారణం ఏమిటి? తక్కువ వేతనాలతో ఎక్కువ ఉత్పాదకత సాధించడం అనేది ప్రపంచ ఆర్థికవ్యవస్థ మొత్తంగా చూసుకున్నప్పడు మరింత ఎక్కువ మిగులు ఏర్పడడానికి దారితీస్తుంది. ఈ మిగులు ఎంత పెరిగినా అది వినిమయాన్ని పెంచదు."

సమస్య వచ్చినప్పుడల్లా ఓ కొత్త బుడగను సృష్టించడం సాధ్యపడేది కాదు. అందువల్ల ఈ ఆర్థిక సంక్షోభం దీర్ఘకాలం కొనసాగుతుంది. ఆర్థిక అభివృద్ధి జరిగిన కాలంలో సైతం కార్మికుల వేతనాలు, జీవన పరిస్థితులు దిగజారతాయని, చేతివృత్తులు, సాంప్రదాయ వ్యవసాయం వంటివి దెబ్బతింటాయని ముందే చెప్పుకున్నాం. అటువంటిది ఇక ఆ అభివృద్ధి ఆగిపోయి సంక్షోభం మొదలైతే కార్మికవర్గం పరిస్థితి ఎలా తయారవుతుందో వేరే చెప్పాలా?

ఒకవేళ ఏదైనా అవకాశం వచ్చి ఓ కొత్త బుడగ ఏర్పడితేనో? ఆర్థికాభివృద్ధి పుంజుకునే వీలుంటుంది. కాని 'బుడగ' అంటేనే తాత్కాలికం అని, ఎప్పుడైనా పేలిపోవచ్చునని అర్థం. కనుక ఈ కొత్త బుడగ పేలిపోగానే కార్మికుల పరిస్థితి మరింత హీనంగా దిగజారుతూ వుంటుంది. దీర్ఘకాలం కొనసాగే ఇటువంటి పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభమే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతున్న ఫాసిజానికి మూలకారణం అయింది. పెట్టుబడి ప్రపంచీ

> **"కార్పొరేట్, ద్రవ్యపెట్టుబడి కూటమి ఇటువంటి ఫాసిస్టు శక్తులను ఎంచుకొని వారికి అన్ని రకాల ఊతాన్ని ఇచ్చి ప్రోత్సహిస్తుంది. కార్మికవర్గం నుండి తమ పాలనకు, పెత్తనానికి ఎటువంటి సవాలు ఎదురవకుండా ముందుగానే దానిని తుంచెయ్యడానికి, వారిని పక్కదోవ పట్టించడానికి ఈ ఫాసిస్టు శక్తులను వాడుకుంటారు."**

కరణతో బాటే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ముడిపడి వుంది. ఈ ప్రైవేటీకరణ క్రమం కార్మికోద్యమాన్ని మొత్తంగానూ, వారు సమ్మెచేసే శక్తిని ప్రత్యేకంగానూ దెబ్బతీస్తున్నది. ప్రపంచీకరణ క్రమాన్ని ప్రతిఘటించి నిలువరించేదెవరు? డేరింగ్, డాషింగ్ హీరోలు సినిమాల్లో అన్యాయాన్ని ప్రతిఘటించినట్టు చూపిస్తారు. వాస్తవజీవితంలో అలాంటి వ్యక్తులు మనకెక్కడా తారసపడరు. కాని అలాంటి హడావుడిచేసే రూపంలోనే ఫాసిస్టు శక్తులు ప్రజలముందు ప్రత్యక్షం అవుతాయి. ఈ డేరింగ్, డాషింగ్ రూపంలో కనపడే ఫాసిస్టు శక్తులకు ఆర్థిక సంక్షోభాన్ని నివారించే ఎజండా ఏమీ ఉండదు. హేతుబద్ధమైన, శాస్త్రీయమైన, వాస్తవాల ప్రాతిపదికపైన నిలబడగలిగిన విశ్లేషణగాని, పరిష్కార మార్గం గాని ఏదీ ఉండదు. ఎదుటివారిని సంక్షోభానికి కారకులుగా నిందించడమూ, ఒక తరగతి ప్రజానీకానికి ఇంకో తరగతి ప్రజానీకంపై ద్వేషం కలిగించి వారిని శిక్షించడమే సమస్యకు పరిష్కారమార్గం అన్నట్టు చిత్రీకరించడమూ ఫాసిస్టులు చేస్తారు. సమస్య నుండి ఉద్ధరించే వారుగా తమని తామే చిత్రీకరించుకుంటారు. సమాజాన్ని పట్టి పీడించే సమస్యలన్నింటినీ పరిష్కరించగల అద్భుతశక్తులన్నీ తమకు ఉన్నట్టు వీరు ప్రకటించుకుంటారు.

ఈ ఫాసిస్టు శక్తులు చేసే హడావుడి ఆకర్షించేది అందరికన్నా ముందు మధ్యతరగతివర్గాన్నే. (పెటీబూర్జువా వర్గాన్ని) అయితే కార్మికోద్యమం బాగా బలహీనపడివున్నచోట ఆ కార్మిక వర్గంలోని కొన్ని సెక్షన్లు కూడా ఈ ఫాసిస్టుల ఆకర్షణకు లోనవుతారు.

కార్పొరేట్, ద్రవ్యపెట్టుబడి కూటమి ఇటువంటి ఫాసిస్టు శక్తులను ఎంచుకొని వారికి అన్ని రకాల ఊతాన్ని ఇచ్చి ప్రోత్సహిస్తుంది. కార్మికవర్గం నుండి తమ పాలనకు, పెత్తనానికి ఎటువంటి సవాలు ఎదురవకుండా ముందుగానే దానిని తుంచెయ్యడానికి, వారిని పక్కదోవ



డోనాల్డ్ ట్రంప్

పట్టించడానికి ఈ ఫాసిస్టు శక్తులను వాడుకుంటారు. నిజానికి కార్పొరేట్ ద్రవ్యపెట్టుబడి కూటమి యొక్క పూర్తి మద్దత్తు పొందగలిగిన తర్వాత మాత్రమే ఈ ఫాసిస్టు శక్తులు బలంపుంజుకుని పురోగమించగలుగుతాయి.

కార్పొరేట్ ద్రవ్యపెట్టుబడి కూటమికి, ఫాసిస్టు శక్తులకి మధ్య సయోధ్య కుదరడం అనేది వివిధ దేశాల్లో వివిధ దశల్లో ఉంది. మొత్తం ప్రపంచంలోనే ఈ ఫాసిస్టు శక్తుల నుంచి ముప్పు ముంచుకొస్తుంది. ఫాసిస్టు శక్తులు కొన్నిదేశాల్లో ఇంకా అధికారంలోకి రాలేకపోయి వుండవచ్చు. కాని అక్కడి ప్రజాస్వామిక వాతావరణాన్ని మాత్రం వారి విషపూరిత ఎజండాతో చెడగొడుతున్నారు.

ఐతే వర్తమాన కాలంలోని ఫాసిజానికి, 1930 దశకంలోని ఫాసిజానికి ఒక మౌలికమైన తేడా వుంది. 1930 దశకంలో ఫాసిజాన్ని ప్రోత్సహించిన ద్రవ్యపెట్టుబడి ప్రధానంగా ఒక్కోదేశం / జాతి ప్రాతిపదికన వ్యవహరించింది. (జర్మని, ఇటలీ, జపాన్ ఇలా) పైగా ఈ ద్రవ్యపెట్టుబడి తీవ్రమైన స్థాయిలో ఆనాడు సామ్రాజ్యవాద శక్తుల మధ్య అంతర్గత వైరుధ్యాలలో ఇరుక్కుపోయింది. ఆక్రమంలో జాతి దురహంకారాన్ని తన ప్రధానమైన సైద్ధాంతిక ఆయుధంగా అది అప్పుడు వినియోగించింది. ప్రస్తుతకాలపు ఫాసిజం అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి నాయకత్వం క్రింద తలెత్తింది.

సామ్రాజ్యవాద శక్తుల మధ్య అంతర్గత వైరుధ్యాలు ఇప్పుడు చప్పబడివున్నాయి. ఇలా ఆ వైరుధ్యాలు చప్పబడి వుండడానికి కారణం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనమే. ఎందుచేత? సామ్రాజ్యవాద దేశాలమధ్య అంతర్గత వైరుధ్యాలు తీవ్రమైతే ద్రవ్యపెట్టుబడుల ప్రవాహం నిరంతరాయంగా కొనసాగడానికి ఆటంకం కలుగుతుంది. అందుకే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి అంతర్గత వైరుధ్యాలను ముదరనివ్వకుండా నియంత్రించే ప్రయత్నం చేస్తున్నది. అందువల్ల 'జాతి' ప్రాతిపదికన దురభిమానాన్ని రెచ్చగొట్టి ఇతర దేశాలపై శత్రుభావాన్ని పెంపొందించే పాత సైద్ధాంతిక ప్రాతిపదిక ఇప్పటి కాలపు ఫాసిజానికి అక్కరకురాదు. ఏ దేశంలోనైనా ఫాసిస్టు శక్తులు అటువంటి జాతీయ దురంహకార విద్వేషాన్ని ఉపయోగించే ప్రయత్నం చేసినా అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి దానికి అనుమతించదు. అనుమతించలేదు.

అందువల్లనే ఫాసిస్టు శక్తులు ఏ దేశంలోనైనా అధికారంలోకి వచ్చినప్పటికీ అక్కడి సంక్షోభాన్ని నివారించే చర్యలేవీ చేపట్టలేవు. ఈ సంక్షోభం నయాఉదారవాద విధానాల పర్యవసానం. అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ఆ దేశాల పర్యవసానం. ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని కాదని ఫాసిస్టు శక్తులు ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించగలిగే ప్రసక్తే లేదు. 1933లో జర్మనీ లోగాని, 1931లో జపాన్‌లో గాని అధికారంలోకి వచ్చిన ఫాసిస్టు శక్తులు అక్కడి సంక్షోభాన్ని తమదైన పద్ధతుల్లో పరిష్కరించగలిగాయి. పునరాయుధీకరణ విధానాన్ని చేపట్టిన కారణంగా ఆదేశాల్లో మాంద్యం నుండి బైటపడ్డారు. కొంతకాలం వరకే అయినా సంక్షోభం నుండి బైటపడగలిగారు. (ఆ వెనువెంటనే వారు తలపెట్టిన యుద్ధానికి భారీ మూల్యం చెల్లించారు. అది వేరే సంగతి) ఈ కాలంలో తాత్కాలికంగా మాంద్యం నుండి కోలుకుని ఆర్థికాభివృద్ధి సాధించినందువలన ఆ దేశాల్లో ఫాసిస్టులు తమ ప్రజాబలాన్ని పెంచుకోగలిగారు. అయితే ప్రస్తుత కాలంలో ఫాసిస్టు శక్తులు సంక్షోభం నుంచి బైటపడడానికి చేయగలిగింది శూన్యం.

ఒకవేళ మిలిటరీ వ్యయాన్ని బాగా పెంచి తద్వారా డిమాండ్‌ను పెంచాలని ప్రయత్నించారే

అనుకుందాం. అందుకవసరమయ్యే సొమ్మును ఎక్కడి నుండి సమీకరించాలి? కార్మికులపైన, సామాన్య ప్రజానీకంపైన పన్నుల భారాన్ని పెంచారే అనుకుందాం. దానివలన 'అదనపు' సొమ్ము ఏమీ రాబట్టలేరు. పన్ను రూపంలో భారం పెరిగితే కార్మికులు, ప్రజలు చేసే ఇతర వ్యయం కాస్తా తగ్గిపోతుంది. మిలిటరీ వ్యయానికి సమీకరించబోతే ఇతరరంగాలలో ప్రజలు చేసే వ్యయం తగ్గిపోతోంది. మొత్తం మీద డిమాండ్ పెరగదు. ఇక మిగిలింది పెట్టుబడిదారుల మీద పన్నులు వేయడం. దీనికి అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి అనుమతించదు. పెట్టుబడి దారులకు అంతకంతకూ రాయితీలు ఇవ్వాలనేదే దాని విధానం అయినప్పుడు వారిపైన పన్నులు విధించడానికి అనుమతిస్తుందా? ప్రశ్నేలేదు. ఇంక వేరేదారి ఏది? బడ్జెట్‌లో ద్రవ్యలోటు పెంచి చూపడం. ఇదికూడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అంగీకారం కాదు. అందుచేత ఫాసిస్టు పద్ధతులను అనుసరించైనా సంక్షోభం నుంచి బైటపడడం వారి వల్ల కానేకాదు.

నేడు నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో పీకలమొయ్యి కూరుకుపోయివుంది. సాంప్రదాయంగా పెట్టుబడిదారీ విధానాన్ని బలపరుస్తూ వచ్చిన రాజకీయ పార్టీలేవీ నేడు నయాఉదారవాద విధానాల పరిధిని దాటి ఆలోచించగలిగే స్థితిలో లేవు. ఈ విధానాలను రూపొందించి, సమర్థించి, అమలు జరిపే పనిని ఇంతవరకూ అవి చేస్తూ వచ్చాయి. వాస్తవానికి ఈ పార్టీలలో కొన్ని, అమెరికాలోని హిల్లరీ క్లింటన్ మాదిరిగా అసలు సంక్షోభం అంటూ ఒకటున్నదని గుర్తించడానికే సుముఖంగా లేవు. నయా ఉదారవాద విధానాల చట్రం లోపలే ఆర్థికవ్యవస్థలు ముందుకు పురోగమించవచ్చునని, ప్రస్తుతం ఉన్న సమస్యలు ఏవో చిన్నపాటి వేనని ఈ పార్టీలు భావిస్తున్నాయి. ఇటువైపు కార్యక్రమం ఏదీలేదు. మిలిటరీ వ్యయాన్ని పెంచి ఫాసిస్టు విధానాన్ని కూడా అవి అమలు చెయ్యగలిగే స్థితి లేదు. ట్రంప్‌గాని, మెరైన్ లిపెన్ (ఫ్రాన్స్) కాని, మరో ఫాసిస్టు పార్టీగాని అధికారంలో ఉన్నప్పటికీ, ఆర్థిక సంక్షోభం నుంచి బైటపడడానికి వారి వద్ద ప్రత్యామ్నాయ కార్యక్రమం ఏదీలేదు.

అమెరికా సంక్షోభం నుంచి బైటపడాలంటే 'రక్షణ" విధానం అనుసరించాలని ట్రంప్ ప్రతిపాదించాడు. అమెరికాలోని ఉద్యోగాలన్నీ అమెరికన్లకే అని నినాదం ఇచ్చాడు. నినాదం సరే. అమెరికన్లకే అయినా అదనంగా ఉద్యోగాలెక్కడి నుండి వస్తాయి? ప్రభుత్వవ్యయం పెంచకపోతే అది సాధ్యం కాదు. ప్రభుత్వ వ్యయం పెంచాలంటే పెట్టుబడిదారులపై పన్నైనా పెంచాలి. బడ్జెట్‌లో లోటునైనా పెంచాలి. ఈ రెండింటిలో ఏది చేసినా పొరుగుదేశాల ప్రభుత్వాలు తమ తమ దేశాలలో అదే విధానాన్ని అమలు చేయడం మొదలుపెడతారు. ఇది మొత్తం మీద ఈ అభివృద్ధి చెందిన దేశాల మధ్య వైరుధ్యాల్ని తీవ్రతరం చేస్తుంది. దాంతోపాటు ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా తీవ్రతరం చేస్తుంది. అందువల్ల ట్రంప్ "రక్షణ" విధానం ముందడుగు వేయాలంటే ప్రభుత్వ వ్యయాన్ని పెంచేవిధానం చేపట్టవలసిందే.

"ట్రంప్ మాత్రం దానికి పూర్తి వ్యతిరేకదిశలో చర్యలు ప్రకటిస్తున్నారు. కార్పొరేట్లకు మరింత పన్ను రాయితీలు ప్రకటించారు. దానివల్ల ఏర్పడే లోటు పూడ్చుకోవడానికి ప్రభుత్వ వ్యయంలో మరిన్ని కోతలు ప్రకటించాడు. ఈ కోతల వలన పేదల సంక్షేమం కోసం పెట్టే ఖర్చు తగ్గిపోతుంది. పర్యవసానంగా కొనుగోలు శక్తి మరింతగా దిగజారుతుంది."

అయితే ట్రంప్‌మాత్రం దానికి పూర్తి వ్యతిరేకదిశలో చర్యలు ప్రకటిస్తున్నారు. కార్పొరేట్లకు మరింత పన్ను రాయితీలు ప్రకటించారు. దానివల్ల ఏర్పడే లోటు పూడ్చుకోవడానికి ప్రభుత్వ వ్యయంలో మరిన్ని కోతలు ప్రకటించాడు. ఈ కోతల వలన పేదల సంక్షేమం కోసం పెట్టే ఖర్చు తగ్గిపోతుంది. పర్యవసానంగా కొనుగోలు శక్తి మరింతగా దిగజారుతుంది. అంటే సంక్షోభం మరింత తీవ్రమౌతుంది.!

అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి పెత్తనం క్రింద నడుస్తున్నంత కాలం ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం లేదన్నది స్పష్టం. ఏదైనా ఒకదేశం తనకు తానుగా ఈ సంక్షోభం నుంచి బైటపడాలంటే ఉన్నదొక్కటి మార్గం. ఆ దేశంలో ప్రభుత్వం నయాఉదారవాద విధానాల చట్రం నుండి బైటపడడటమే ఆ మార్గం.

అలా బైట పడాలంటే ప్రపంచ ద్రవ్య పెట్టుబడుల ప్రవాహపు వల నుండి ఆ దేశం బైటకు రావాలి. ప్రపంచీకరణ క్రమం నుండి తనను తాను విడగొట్టుకోవాలి. కార్పొరేట్ ద్రవ్య పెట్టుబడి సంయుక్త నాయకత్వంలోని పాలక వర్గాలు అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో పెనవేసుకుపోయి వున్నాయి గనుక ఆ వర్గాల నాయకత్వంలో విడగొట్టుకొని బైటపడడం సాధ్యం కాదు. ఆ పని జరగాలంటే వేరే వర్గాల నాయకత్వంలో నడిచే రాజ్యం రావాలి. అటువంటి ప్రత్యామ్నాయ వర్గాల నాయకత్వం రావాలంటే కార్మికవర్గపు మద్దత్తు, ప్రత్యక్ష పాత్ర లేకుండా అది సాధ్యం కాదు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను రూపొందించటంలో శ్రామిక వర్గం పాత్ర కీలకం అయినప్పుడు, ఆ వర్గం ఈ ప్రత్యామ్నాయ విధానాలను క్రమంగా సోషలిస్టు విధానంగా పరివర్తన చెందేటట్టు చేయడం సాధ్యం అవుతుంది. అందుచేత పీకలమొయ్యా సంక్షోభంలో కూరుకుపోయిన నయా ఉదారవాద పెట్టుబడి దారీ సంక్షోభం నుండి బైటపడడం అంటే ఆ క్రమంలో పెట్టుబడిదారీ విధానం నుంచీ మొత్తంగా బైటపడడం అని అర్థం.

మనకి ఓ విషయం స్పష్టం కావాలి. పెట్టుబడిదారీ విధానానికి గత్యంతరం లేని పరిస్థితి అంటూ ఎన్నడూ ఉండదని లెనిన్ చెప్పాడు. ప్రస్తుత సంక్షోభం నుండి బైటపడే మార్గం ఏదీ పెట్టుబడిదారీ వర్గానికి తోచకపోవచ్చు. కానీ ప్రత్యామ్నాయం కోసం కార్మికవర్గం ప్రయత్నం చేయకుండా అడ్డుపడేపనిని పాలకవర్గం తప్పకుండా చేస్తుంది. ఫాసిజం అన్ని రకాల కుయుక్తులనూ, విషప్రచారాలనూ వినియోగిస్తుంది. సోషలిజం వైపుగాకుండా అనాగరికత, పశుత్వంవైపు ప్రజానీకాన్ని మళ్లించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుంది. అంతిమ ఫలితం మన ఆచరణపైనే ఆధారపడి వుంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితి శ్రామికవర్గానికి ఒక అవకాశం ఇస్తున్నది. దానిని అందిపుచ్చుకుని సంక్షోభం నుంచి బైటపడే ప్రయత్నం చేయాలి. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ, విస్తరణ ఈ ప్రయత్నంలో అంతర్భాగమే. రష్యన్ అక్టోబరు విప్లవంతో మొదలైన ప్రక్రియను కొనసాగించడమే మన కర్తవ్యం.

**స్వేచ్ఛానుసరణ - ఎంవిఎస్ శర్మ**

# వందేళ్ళ విప్లవం, సంస్కరణవాదం యూరప్ ఖండం

ప్రకాష్ కరత్



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

వందేళ్ళ క్రితం యూరప్ లో సోషల్ డెమోక్రటిక్ సంస్కరణవాదం బలంగా ప్రభావం కలిగివుండేది. ఆటువంటి పరిస్థితినుండి చరిత్రను బలంగా మలుపు తిప్పింది రష్యన్ విప్లవం. ఆనాడు లెనిన్ రష్యన్ విప్లవం వెనువెంటనే జర్మనీలో విప్లవం విజయవంతం ఔతుందని ఆశించాడు. 1919లో జర్మనీలో తలెత్తిన విప్లవం అణచివేతకు గురవడంతో ఆ ఆశ నెరవేరలేదు.

యూరప్‌లోని కార్మికవర్గంపై పట్టు సాధించాలని మూడవ ఇంటర్నేషనల్‌కు అనుబంధంగా పనిచేస్తూవుండే కమ్యూనిస్టు పార్టీలు, యూరప్‌లోని సోషల్‌డెమోక్రటిక్ సంస్కరణ వాదపార్టీలు తీవ్రంగా పోటీపడుతూండేవి. ఇది రెండోప్రపంచయుద్ధానికి ముందుండిన పరిస్థితి. 1929-33 కాలంలో మహామాంద్యం, పెట్టుబడిదారీసంక్షోభం తలెత్తాయి. ఆ పరిస్థితుల్లో వచ్చింది ఫాసిజం. జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చాడు. నాజీలు అధికారంలోకి వచ్చాక జర్మన్ కమ్యూనిస్ట్ పార్టీని క్రూరంగా అణచివేశారు. ఐతే, ఫాసిజాన్ని ఓడించిన మహాయుద్ధంలో సోవియట్ యూనియన్, రెడార్మీ నిర్వహించిన అమోఘమైన, నిర్ణయాత్మకమైన పాత్ర ప్రభావం యావత్తు యూరప్ పైనా పడింది. ఫ్రాన్స్, ఇటలీ, గ్రీస్, బాల్కన్ దేశాలలోని కమ్యూనిస్ట్‌పార్టీలు నాజీల దురాక్రమణను ప్రతిఘటించడంలో, ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రముఖమైనపాత్రను పోషించాయి. దీనిఫలితంగా యుద్ధానంతర కాలంలో ఇటలీ, ఫ్రాన్స్ దేశాలలో కమ్యూనిస్ట్ పార్టీల ప్రభావం పెరగడం, విస్తరించిన ప్రజాపునాది ఎన్నికలలో పెరిగిన ఓట్లరూపంలో వ్యక్తం కావడమూ మనం చూస్తాం.

స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో ఫాసిస్టు పాలన 1970 దశకం వరకు కొనసాగింది. అక్కడ కమ్యూనిస్టు పార్టీలు అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తూ తమ ప్రతిఘటనను కొనసాగించాయి. ముఖ్యంగా పోర్చుగల్‌లో కమ్యూనిస్ట్ పార్టీ సాలాజర్ నిరంకుశపాలనకు వ్యతిరేకంగా ముందు పీఠిన నిలిచి పోరాడింది. గ్రీస్‌లో నాజీలపై సాగిన పాక్షికసాయుధపోరాటంలో కమ్యూనిస్ట్‌పార్టీ కీలకపాత్రను పోషించింది. ఆ అంతర్యుద్ధంలో కమ్యూనిస్టులను అణచివేయడానికి నాజీలకు పశ్చిమదేశాలు సహకారం అందించాయి. అయినప్పటికీ, అక్కడి కమ్యూనిస్టులు ఆ ప్రయత్నాలను తిప్పికొట్టి అక్కడి కార్మికవర్గంలో బలమైన శక్తిగా ఎదిగారు. తూర్పుయూరప్ దేశాలలోని నాజీల పెత్తనాన్ని రెడార్మీ రూపుమాపాక, ఆ విముక్తి పోరాటానికి సహకరించిన స్థానిక ప్రజా ఉద్యమాల బలంతో జనతా ప్రజాతంత్ర రాజ్యాలు ఏర్పడ్డాయి.

యూరప్ దేశాలు రెండు వ్యవస్థల మధ్య విడిపోయిన అనంతరం ప్రచ్ఛన్నయుద్ధకాలం మొదలైంది. ఒక పథకం ప్రకారం కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని దెబ్బతీయడానికి అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాదుల ఎదురుదాడి ప్రారంభమైంది. కమ్యూనిస్టుపార్టీల ప్రాబల్యాన్ని తగ్గించడానికి రాజకీయపరంగానే గాకుండా ఆర్థికపరంగా కూడా వ్యూహం రంగం మీదికొచ్చింది. సోవియట్ నాయకత్వంలోని సోషలిస్టు కూటమిపై దాడితోబాటు పశ్చిమ యూరప్‌లోని కమ్యూనిస్ట్‌పార్టీలపైన కూడా ఈ వ్యూహం ఎక్కుపెట్టబడింది. ఎన్ని కుట్రలకు ప్రయత్నించినా 1970 దశకం వరకూ ఇటాలియన్, ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీలు బలంగానే నిలదొక్కుకోగలిగాయి. ఐతే ఈ కుట్ర కాలంలో అవి పెద్దగా పురోగమించలేకపోయాయి.

కమ్యూనిజానికి, అక్టోబర్ విప్లవానికి వ్యతిరేకంగా సాగిన ఈ కుట్రలో కమ్యూనిస్టులకు ప్రత్యామ్నాయంగా సోషల్ డెమోకటిక్ పార్టీలు పెట్టుబడిదారీ యంత్రాంగానికి, మితవాద పార్టీలకు, అభివృద్ధినిరోధకశక్తులకు ఉపయోగపడ్డాయి. అవి ప్రభుత్వాలను నడుపుతున్నచోట్ల సాంఘిక సంక్షేమ విధానాల నమూనా చేపట్టాయి. తద్వారా కార్మికవర్గంలోను, శ్రామిక ప్రజలలోను కమ్యూనిస్టులకున్న ప్రభావాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించాయి. యూరప్ ఖండంలోని జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, పోర్చుగల్,స్పెయిన్, తదితర దేశాల్లో ప్రభుత్వాధికారం అటు మితవాద, అభివృద్ధినిరోధక పార్టీలకు, ఇటు సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు మధ్య చేతులు మారుతూ వచ్చింది. వర్గ రాజకీయాలను విడిచిపెట్టిన సోషల్‌డెమోక్రటిక్ పార్టీలను గాని, లేదా మితవాద అభివృద్ధినిరోధక పార్టీలను గాని- ఈ రెంటిలో ఏదో ఒకదానిని మాత్రమే ఎంచుకొనే అవకాశం ప్రజలకు ఉండేవిధంగా చూడటంలో ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ కృతకృత్యమైంది. ఈ ఇరుపక్షాలూ పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకే కంకణం కట్టుకుని వ్యవహరించాయి.

ఈ విధంగా 1970 దశకంలో పశ్చిమ యూరప్‌లో పెట్టుబడిదారీ దేశాలలో ఏర్పడిన రాజకీయ సుస్థిరత నేపథ్యంలో పశ్చిమయూరప్ కమ్యూనిస్ట్‌పార్టీలలో యూరోకమ్యూనిజం అనే ధోరణి తలెత్తింది. ఈ యూరో కమ్యూనిజపు సిద్ధాంతం గాని, రాజకీయాలు గాని చూస్తే అక్టోబరు విప్లవసూత్రాలను, లక్ష్యాలను పూర్తిగా గాలికి వదిలేయడమే దాని సారాంశంగా మనకు కనపడుతుంది. వర్గప్రాతిపదికన నడపవలసిన రాజకీయవిధానాలను విడిచిపెట్టి సోషల్‌డెమొక్రటిక్ రాజకీయాల వర్గసంకర స్వభావాన్ని యూరో కమ్యూనిజం వాటేసుకుంది. ఈ వర్గసంకర దృక్పథం మూలానే స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల కమ్యూనిస్టు పార్టీలు బల హీనపడ్డాయి, ఇతర దేశాలలోని కార్మికోద్య మాలను బలహీనపరిచాయి.

ఇటాలియన్ కమ్యూనిస్ట్ పార్టీ యూరప్‌లో కెల్లా అతి పెద్దకమ్యూనిస్ట్ పార్టీ. అంతటిపార్టీ కాస్తా సోవియట్‌యూనియన్ ముక్కలుకాగానే నాటకీయంగా తనని తాను రద్దుపరచుకుంది.

1980 దశకంలో నయాఉదారవాద

విధానాలు ముందుకువచ్చాయి. దానితోబాటు సోషల్‌డెమోక్రటిక్ పార్టీలలో ఒక గుణాత్మకమైన మార్పు వచ్చింది. ఈ పార్టీలన్నీ నయాఉదారవాద విధానాన్ని స్వీకరించి, మితవాదంవైపు మొగ్గాయి. ఐతే వీటిలో చాలా పార్టీలను సెంటర్-లెఫ్ట్ పార్టీలుగానే అభివర్ణిస్తారు. అంతవరకూ పాటించిన సాంఘికసంక్షేమ నమూనాను విడిచిపెట్టి ఈ పార్టీలన్నీ ప్రైవేటీకరణ తరఫున, ఫైనాన్స్‌పెట్టుబడితరఫున వకాల్తా పుచ్చుకున్నాయి. 1990 దశకం నడుమ టోనీ బ్లెయిర్ నాయకత్వంలో బ్రిటిష్ లేబర్ పార్టీ నడక ఇందుకొక ఉదాహరణ. సాంప్రదాయంగా తమకు పునాదిగా ఉంటూ వస్తున్న కార్మికవర్గ ఓటర్ల పునాదినుండి, ఆ పాత వరవడినుండి సోషల్ డెమోక్రటిక్ పార్టీలు తెగతెంపులు చేసుకున్నాయి.

2007–08 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో యూరప్‌దేశాలలోని పాలకవర్గాలు కార్మికవర్గంపైన తీవ్ర ఆర్థికకోతలు విధించాయి. ద్రవ్యనియంత్రణ, పొదుపు చర్యలు పెద్దఎత్తున అమలు జరిగాయి. యూరోపియన్ యూనియన్, యూరపియన్ కమిషన్, సెంట్రల్‌బ్యాంక్– ఈ త్రిమూర్తుల ఆధ్వర్యంలో ఇదంతా జరిగింది. పరిశ్రమల మూసివేత, కార్మికవర్గంపైన దాడులు వేగంగా పెరిగాయి. నయాఉదారవాద సంక్షోభం తీవ్రమైంది. దీనినుంచి బైటపడేదారిని కనుక్కోవడం పాలకవర్గాలకు చేతకావడంలేదు. ఫాసిజం గురించి వివరిస్తూ ఆంటోనియో గ్రామ్‌సీ ఇలా అన్నాడు:' ఈ సంక్షోభం రావడానికి కారణంపాతది నశిస్తున్నది, కాని దాని స్థానంలో కొత్తది రూపొందడం లేదు. ఈ నడుమ ఏర్పడిన ఖాళీలో అన్నిరకాల కాలంచెల్లిన దిగజారుడు ధోరణులూ పుట్టుకొస్తాయి.' సంక్షేమం పై తీవ్రంగా కోతలు, పెరుగుతున్న అసమానతలు, ప్రమాదకరస్థాయికి చేరిన ఉపాధిసమస్య, వీటన్నింటి పర్యవసానంగా రగులుతున్న అసంతృప్తి–ఇవన్నీ కలిసి అత్యంత మితవాద, దిగజారుడు ధోరణులుతలెత్తడానికి భూమికను కల్పించాయి. అలా తలెత్తినవే నయా ఫాసిస్టు శక్తులు. జాతి దురహంకారం, మైనారిటీ ప్రజలను అంతం చేయాలనే విద్వేషాన్ని కల్పించడం, బైటినుండి వలస వచ్చేవారిపై వ్యతిరేకత– ఇటువంటి ధోరణులన్నీ రెచ్చగొట్టబడుతున్నాయి.

ఇటీవల వచ్చి మితవాద పార్టీలు– ఫ్రాన్స్‌లో నేషనల్ ఫ్రంట్, ఆస్ట్రియాలో ఫ్రీడం పార్టీ,గ్రీస్‌లో గోల్డెన్ డాన్, జర్మనీలో ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ–వంటివి పెరుగుతున్నాయి. వీటిలో ఆస్ట్రియాలోని పార్టీ తప్ప తక్కినవి అధికారం

> **“2007-08 ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో యూరప్‌దేశాలలోని పాలకవర్గాలు కార్మికవర్గంపైన తీవ్ర ఆర్థికకోతలు విధించాయి. ద్రవ్యనియంత్రణ, పొదుపు చర్యలు పెద్దఎత్తున అమలు జరిగాయి. యూరోపియన్ యూనియన్, యూరపియన్ కమిషన్, సెంట్రల్‌బ్యాంక్- ఈ త్రిమూర్తుల ఆధ్వర్యంలో ఇదంతా జరిగింది.”**



జెరెమి కార్బిన్

లోకి వచ్చే అవకాశం ఇప్పుడే లేదు. కాని ఇవి బలపడుతున్న ప్రభావం వలనబూర్జువా పార్టీలు మరింత మితవాదంవైపు మళ్ళుతున్నాయి.

యూరప్ దేశాలలో జరిగే రాజకీయ పరిణామాలలో ఇంకొక ధోరణి కూడా కనపడుతోంది. దీర్ఘకాలంపాటు కొనసాగుతున్న నయాఉదారవాద ఆర్థికసంక్షోభకాలంలో సోషల్ డెమోకటిక్ పార్టీలు బలహీనపడటం, కొన్ని చోట్లనైతే ఏకంగా విచ్ఛిన్నంకావడం జరుగుతోంది. నయా ఉదారవాద విధానాలను నోరెత్తకుండా ఇవి బలపరచడమే దీనికి ప్రధానకారణం.

గ్రీస్‌లోని పాసోక్ (పి.ఎ.ఎస్.ఒ.కె) పూర్తిగా కుప్పకూలినట్టే.ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికలలో సోషలిస్టుపార్టీకి తొలిరౌండ్ వోటింగ్‌లో కేవలం 6శాతం మాత్రమే వోట్లు వచ్చాయి. ఇటలీలోని సోషలిస్టుపార్టీ దాదాపు అంతరించింది. జర్మన్ సోషల్‌డెమోక్రటిక్‌పార్టీ వోట్లు, స్కాండి నేవియన్ దేశాల లోని ఇటువంటి పార్టీలవోట్లు తగ్గుతూ వస్తున్నాయి.

సాంప్రదాయంగా ఈ సోషల్‌డెమాక్రటిక్ పార్టీలకు మద్దతుదారులుగా ఉన్న కార్మికులను మితవాద అభివృద్ధినిరోధక (ఫాసిస్టు)పార్టీలు పాపులర్ నినాదాలతోతమవైపుకు ఆకర్షిస్తున్నాయి. ఐతే, అభివృద్ధినిరోధకరాజకీయాలదే పైచేయిగా ఉండిన రాజకీయవాతావరణంలో సైతం నయాఉదారవాదవిధానాలతో రాజీపడకుండా ఖచ్చితంగా నిలబడ్డ వామపక్ష రాజకీయ వేదికలకు క్రమంగా మద్దతు పెరుగుతున్నది. పోర్చుగీస్ కమ్యూనిస్ట్ పార్టీ, గ్రీస్ కమ్యూనిస్ట్ పార్టీ–ఈ రెండూ మార్క్సిస్టు–లెనినిస్టు విధానానికి కట్టుబడ్డపార్టీలు. ఈ రెండూ తమ తమ ప్రజాపునాదిని నిలబెట్టుకోగలుగుతున్నాయి. పోర్చుగీస్ కమ్యూనిస్ట్ పార్టీ ఇతర వామపక్ష పార్టీలతో కలిసి 2015 ఎన్నికలలో 20 శాతానికి పైగా వోట్లు సాధించింది. ఈ కూటమి సోషలిస్టు పార్టీకి ప్రభుత్వ ఏర్పాటులో వెలుపలనుంచి మద్దతు ఇస్తున్నది. ప్రజాసంక్షేమపద్దులో కోత పడకుండా ఉండే షరతు మీద, కార్మికహక్కులను కాపాడే షరతుమీద ఈ మద్దతును ఇస్తున్నాయి. జర్మనీ లోని డైలింక్ పార్టీ, నెదర్లాండ్స్‌లోని సోషలిస్టుపార్టీ మితవాద పార్టీలను ఎదుర్కొని తమ వోటుపునాదిని నిలబెట్టుకున్నాయి. ఈ రెండూ వామపక్ష పార్టీలు.

తూర్పుయూరప్‌లోని మాజీ సోషలిస్టు దేశాలలో మార్క్సిస్టు దృక్పధాన్ని విడిచి పెట్టకుండా ఇప్పటికీ కట్టుబడివున్నది బొహిమియా అండ్ మొరేవియా కమ్యూనిస్ట్ పార్టీ. జెక్ రిపబ్లిక్‌లో కమ్యూనిస్టువ్యతిరేకదాడిని తట్టుకుని అది నిలవగలిగింది. 2013 ఎన్నికలలో ఆ పార్టీ 14.9 శాతం వోట్లతో 3వ స్థానంలో నిలిచింది.

సోషల్ డెమోక్రటిక్ పార్టీలు దారి తప్పడంతో కొన్ని నయా వామపక్ష పార్టీలు పుట్టుకొచ్చాయి. గ్రీస్‌లోని సిరిజా పార్టీ, స్పెయిన్ లోని పొడెమోస్ ఇలాంటివే.గ్రీస్‌లో 2014లో జరిగిన ఎన్నికలలో సిరిజా పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మొదట్లో ఆ పార్టీ నయా ఉదారవాద విధానాలపై పోరాడతానని, సంక్షేమపద్దులలో కోతలకు తాను వ్యతిరేకమని ప్రకటించినా, ఆ తర్వాత ద్రవ్య పెట్టుబడి వత్తిడికి లొంగిపోయింది. వ్యవస్థీకృత సర్దుబాట్లకు పూనుకుని సంక్షేమపద్దులకు కోతలు పెట్టింది. సిరిజా పార్టీ మూలాలు పరిశీలిస్తే పాత యూరోకమ్యూనిస్టు గ్రూపులు కొన్ని సంఘటనగా ఈ పార్టీలో కలిసినట్టు కనపడుతోంది. నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా అది నికరంగా

> **"ఒక నికరమైన వామపక్ష ప్రత్యామ్నాయాన్ని గనుక ప్రజల ముందుంచగలిగితే దానికి మద్దత్తు ఉంటుందని, మితవాద శక్తులకు అది ప్రత్యామ్నాయం కాగలదని ఈ రెండు దేశాల ఎన్నికల అనుభవాలు మనకి తెలియ జేస్తున్నాయి. ఇందుకోసం నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానంపై రాజీలేని పోరాటాలు, ఉద్యమాలు చేపట్టి కార్మికవర్గఐక్యతను నిర్మించాలి."**

నిలవలేకపోవడానికి అదే కారణం. ప్రత్యామ్నాయంగా వామపక్షశక్తులు బలపడటానికి అవకాశాలు కనపడుతున్నాయి. 2017లో సంభవించిన రెండు పరిణామాలు దీనిని సూచిస్తున్నాయి. ఇందులో మొదటిది బ్రిటన్‌లోది. ఇక్కడ లెబర్ పార్టీ జెరెమీ కార్బిన్ నాయకత్వంలో ఒక వామపక్ష కార్యక్రమాన్ని ముందుకు తెచ్చింది. మూడు దశాబ్దాల తర్వాత లేబర్‌పార్టీ ఓ నికార్సైన వామపక్షవాదిని నాయకుడిగా ఎన్నుకుంది. ఆ ఎన్నికలో కార్బిన్‌కు ఎక్కువగా కార్మికసంఘాల వోట్లు, లేబర్‌పార్టీలో పెద్ద సంఖ్యలో చేరిన యువజనుల వోట్లు పడ్డాయి.

జూన్8న జరిగిన పార్లమెంట్ ఎన్నికలు బ్రిటన్ రాజకీయాలను ఒక మలుపు తిప్పాయి. ఎన్నికల ఫలితాలు కన్సర్వేటివ్‌పార్టీని, ఆ పార్టీ నాయకురాలు థెరిస్సా మేని, బూర్జువా మీడియాని కంగు తినిపించాయి. 318 సీట్లు మాత్రమే గెల్చుకున్న కన్సర్వేటివ్ పార్టీకి మెజారిటీకి 8 సీట్లు తక్కువగా వచ్చాయి. అంతకు మునుపు ఆ పార్టీకి 330 సీట్లు ఉండేవి. లేబర్‌పార్టీకి 262 సీట్లు వచ్చాయి. గతంకన్నా ఇవి 30 అదనం. ఆ పార్టీకి వోటింగ్ 10 శాతం పెరిగింది. కోర్బిన్ ఒక సూత్రబద్ధవైఖరితో నయా ఉదారవాద విధానాలను, సంక్షేమానికి కోతలను వ్యతిరేకించాడు. ఇరాక్, లిబియా, సిరియా యుద్ధాలలో బ్రిటన్ జోక్యాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. ఈ వైఖరికి ప్రజల మద్దతు లభించింది. లేబర్‌పార్టీకి,దాని ఎన్నికల ప్రణాళికకు గట్టి మద్దతునిచ్చినవారిలో యువజనులది ఎక్కువ శాతం.

లేబర్‌పార్టీ ఎన్నికల ప్రణాళిక వామపక్ష విధానాలకు ఒక నమూనా. రైల్వే, పోస్టల్, విద్యుత్, నీటిసరఫరా వంటి రంగాలను జాతీయం చేయాలని అందులో పేర్కొన్నారు. అవన్నీ గతంలో ప్రైవేటీకరించబడ్డాయి. ప్రజల మౌలికసేవలన్నింటినీ ప్రభుత్వమే నిర్వహించాలన్న వాదనను ప్రణాళిక బలంగా ముందుకు తెచ్చింది. కార్పొరేట్లమీద, సంపన్నవర్గాలమీద, ద్రవ్యపెట్టుబడుల లావాదేవీలమీద పన్నులను పెంచి సంక్షేమ కార్యక్రమాలకు కేటాయింపులు పెంచాలని అది సూచించింది.

కార్బిన్ లేబర్‌పార్టీనాయకుడైన తర్వాత పార్టీసభ్యత్వం బాగా పెరిగింది. కార్బిన్‌ను ఒక నిజాయితీపరుడైన, సూత్రబద్ధుడైన నాయకుడిగా భావించిన యువజనులు పెద్దసంఖ్యలో పార్టీలో చేరారు. 80 లక్షలకు చేరిన పార్టీ సభ్యత్వంతో లేబర్‌పార్టీ యూరప్‌లో అతిపెద్ద రాజకీయపార్టీగా ఎదిగింది. బ్రిటన్ ఎన్నికలు వర్గ రాజకీయాలకు తిరిగి పెద్దపీట వేశాయి. ప్రైవేటీకరణకు, పొదుపుచర్యలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాలతో పార్లమెంటరీయేతర ప్రజాపోరాటాల ఊపు పెరిగింది.

ఫ్రెంచి అధ్యక్ష ఎన్నికలు ఏప్రిల్-మే నెలల్లో జరిగాయి. వీటి ఫలితాలు అక్కడి రాజకీయ పరిస్థితులలో గణనీయమైనమార్పులు వచ్చాయని సూచిస్తున్నాయి. మితవాద రిపబ్లికన్ పార్టీ, సోషల్‌డెమోక్రటిక్ సోషలిస్టుపార్టీ-ఈ రెండూ అక్కడ సాంప్రదాయంగా ప్రధాన పార్టీలుగా ఇంతవరకూ ఉంటున్నాయి. ఈ ఎన్నికల్లో ఈ రెండూ పక్కకి నెట్టబడ్డాయి. ఇప్పటివరకూ అధ్యక్షుడుగా ఉన్న ఫ్రాంకోయిస్ హాలండే సోషలిస్టుపార్టీకి చెందినవాడు. ఈమారు ఎన్నికలలో తొలిరౌండ్‌లో కేవలం 6.4 శాతం వోట్లు తెచ్చుకున్న ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. ఫైనల్ రౌండ్‌కు చేరుకున్న అభ్యర్ధులు ఇద్దరు-ఎన్ మార్చ్ అనే పేరుతో కొత్తపార్టీ పెట్టిన ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ ఒకరు, పచ్చిమితవాద నేషనల్ ఫ్రంట్ పార్టీ అభ్యర్ధి మెరైన్ లిపెన్ ఇంకొకరు. మాకాన్ తనను ఒక మధ్యేవాదిగా చెప్పుకుంటాడు. ఐతే నయా ఉదారవాదానికి పూర్తిగా కట్టుబడ్డవాడు. కార్మిక చట్టాలను తిరగరాసి కార్మికహక్కులను కుదిస్తానని ఎన్నికలలో హామీ ఇచ్చాడు. ఈ మాక్రాన్ ఎన్నికలలో పెద్ద మెజారిటీతో గెలిచాడు. ఒక పచ్చి మితవాదిని ఓడించాలనే పేరుతో ఇంకొక నయాఉదారవాద, మితవాది చేతికి అధికారం వచ్చింది.

ఫ్రాన్స్‌లో చాలాకాలంగా బలహీనపడుతూ వస్తున్న వామపక్షాలు ఈమారు పుంజుకున్నాయి. మూడు వామపక్షపార్టీల తరఫున ఉమ్మడి అభ్యర్ధిగా జీన్ లూక్ మెలెంకాన్ పోటీ చేశాడు. మెలెంకాన్ చాలా శక్తివంతంగా ప్రచారం నిర్వహించాడు. వామపక్షవేదికకు కార్మికుల నుండి, దిగువ మధ్యతరగతి నుండి, యువజనుల నుండి మంచి ఆదరణ లభించింది. మొదటి రౌండ్‌లో మెలెంకాన్‌కు 20శాతం ఓట్లు వచ్చాయి. 2012 ఎన్నికలలో అతడికి వచ్చిన ఓట్లకన్న ఇది 9 శాతం ఎక్కువ. రెండోరౌండ్ ఎన్నికలలో చాలా ఇతర బూర్జువాపార్టీలు మాక్రాన్‌కు తమ మద్దతు తెలిపాయి. ఇందుకు మెలెంకాన్ నిరాకరించాడు. ఒకవైపు నయాఉదారవాది అయిన బ్యాంకరు, ఇంకోవైపు ఒక ఫాసిస్టు- వీరిద్దరిలో ఎవరినో ఒకరిని ఎన్నుకోవాల్సివచ్చేసరికి అందుకు చాలామంది నిరాకరించారు. 4.75 కోట్లమంది ఓటర్లలో 1.62 కోట్లమంది ఓటు చేయలేదు. వీరిలో కొందరు ఖాళీ బాలెట్ పత్రాలను వేశారు. గత 50 ఏళ్ళలో ఓటు చేయనివారి సంఖ్య ఇదే అత్యధికం.

ఒక నికరమైన వామపక్ష ప్రత్యామ్నాయాన్ని గనుక ప్రజలముందుంచగలిగితే దానికి మద్దత్తు ఉంటుందని, మితవాద శక్తులకు అది ప్రత్యామ్నాయం కాగలదని ఈ రెండు దేశాల ఎన్నికల అనుభవాలు మనకి తెలియజేస్తున్నాయి. ఇందుకోసం నయా ఉదారవాద పెట్టుబడిదారీవిధానంపై రాజీలేని పోరాటాలు, ఉద్యమాలు చేపట్టి కార్మికవర్గఐక్యతను నిర్మించాలి. ప్రైవేటీకరణకు, పొదుపు చర్యలకు, నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా పశ్చిమ యూరప్‌లో ఏళ్ళతరబడి పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులతో, వామపక్షశక్తులతో బాటు సోషల్‌డెమోక్రాట్లలోని వామపక్షవాదులు కలిసివచ్చారు. మెలెంకాన్ గతంలో సోషలిస్టు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశాడు. ఇటువంటి పునరేకీకరణ వామపక్ష శక్తులపురోగమనానికి దారితీసింది.

నయా ఉదారవాదవ్యవస్థలో నెలకొన్న సంక్షోభం వామపక్షాలకు, నికరమైన వర్గ రాజకీయాలకు ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తున్నది. వందేళ్ళక్రితం జరిగిన అక్టోబర్ విప్లవం సంస్కరణవాదాన్ని, వర్గసంకర రాజకీయాలను తృణీకరించింది. ఆ అక్టోబర్ విప్లవస్ఫూర్తితో వర్తమాన పరిస్తితులకనుగుణంగా సిద్ధాంతాన్ని తిరిగి ఆవిష్కరించాలి. అప్పుడే వామపక్ష, అభ్యుదయ శక్తులు పురోగమించగలవు.

**స్వేచ్ఛానుసరణ- ఎం.వి.ఎస్.శర్మ**

# మనమందరమూ బోల్షివిక్‌లమే...

విజయప్రసాద్



విజయప్రసాద్
రచయిత ప్రముఖజర్నలిస్ట్

**2017** అక్టోబర్ 15న వెనిజులాలో రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. నికొలాస్ మదురో నాయకత్వంలో వెనిజులాలో అమలుజరుగుతున్న బొలివేరియన్ ప్రాజెక్టు భవిష్యత్తు ఏమికానుందోనన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తింది. చావెజ్ హయాంలో ఈ బొలివేరియన్ ప్రాజెక్టు అమెరికన్ ఆధిపత్యాన్ని సవాలుచేస్తూ నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయంగా మొదలైంది. మదురో హయాంలో అది కొనసాగింది. అమెరికా ప్రభుత్వం మొదటినుంచీ దీనిని దెబ్బతీయాలనే కుట్రలు పన్నుతూనేవుంది. 2018 అక్టోబర్‌లో దేశాధ్యక్షపదవికి ఎన్నికలు జరుగుతాయి. అంతకు ఒక ఏడాదిముందు రాష్ట్రాలకు జరుగుతున్న ఇప్పటి ఎన్నికల్లో గనుక మదురో బలపరచిన అభ్యర్థులు ఓడిపోతే అప్పుడు మదురోను ఓడించడం అమెరికాకు తేలిక ఔతుంది. ఇదీ ట్రంప్ వ్యూహం. మదురో నాయకత్వంలోని యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా (పి.ఎస్.యు.వి) అభ్యర్థులను ఓడించమని పిలుపునిచ్చి ట్రంప్ బాహాటంగానే వెనిజులా ఎన్నికలలో తలదూర్చాడు. ఐతే ఈ ప్రయత్నం లో ట్రంప్ విఫలమయ్యాడు. పి.ఎస్.యు.వి. అభ్యర్థులు 23 రాష్ట్రాలకుగాను 18 చోట్ల గెలిచారు.

"మా ప్రజలు డొనాల్డ్ ట్రంప్‌కు, అతడి ప్రాంతీయ మిత్రులకు, ఈ దేశంలోని మితవాదు లకు స్పష్టమైన సమాధానం ఇచ్చారు" అని ఎన్నికల ఫలితాలపై మదురో వ్యాఖ్యానించాడు. దీనిపై స్పందిస్తూ ట్రంప్ వెనిజులాపై ఆర్థిక ఆంక్షలు విధిస్తానని బెదిరించాడు. ఐతే మదురో వెనక్కి తగ్గలేదు. ఎటువంటి ఆంక్షలుగాని, ఆర్థిక వత్తిడులుగాని మా దేశాన్ని లొంగదీయలేవు" అని జవాబు చెప్పాడు. భూగోళానికి పశ్చిమం వైపున ఉన్న లాటిన్ అమెరికా లో వెనిజులా, బొలివియా, క్యూబా, నికరాగ్వా వామపక్ష దుర్గాలు. అన్నిరకాల ప్రతి కూలతలనూ తట్టు కొని అవి సోషలిస్టువ్యవస్థ నిర్మాణానికి కట్టుబడి పనిచేస్తున్నాయి. సామ్రాజ్య వాదదేశాలనుండి, తమప్రాంతాల బూర్జువా వర్గాలనుండి వస్తున్న రకరకాల వత్తిడులనన్నింటినీ తట్టుకుంటూ అవి పని చేస్తున్నాయి. పెట్టుబడిదారీ వర్గ సంక్షేమం కన్న ముందు దేశ ప్రజల సంక్షేమమే ముఖ్యం అన్నది వారి విధానం. 1917 అక్టోబర్‌విప్లవం లాటిన్ అమెరికా ప్రజలకు ఒక పాత కాలపు జ్ఞాపకం కాదు. అది వర్తమానకాలపు సజీవ వాస్తవం.

1917 అక్టోబర్ విప్లవం గురించిన వార్త లాటిన్ అమెరికాకు ఆలస్యంగా చేరింది. ఈ సమాచారం తెలియగానే అక్కడ కార్మికులు, రైతులు, చిన్నచిన్న శక్తులుగా ఉన్న వామపక్ష పార్టీలు, అనార్కిస్టులు, సోషల్ డెమోక్రాట్లు, రకరకాల మేధావులు అంతా ఉత్సాహపడ్డారు. ఈ విప్లవప్రాధాన్యతను గుర్తించినవారిలో ఎమిలి యానో జపాటా ఒకడు. 1911లో మెక్సికోలో జరిగిన రైతాంగతిరుగుబాటుకు నాయకత్వం వహించిన రైతు నాయకులలో జపాటా ముఖ్యుడు. రష్యాలో కార్మికులు, రైతులు కలిసి నడిపిన విప్లవ అనుభవాల ప్రాధాన్యతను అతను గమనించాడు." రష్యాలో జరిగిన విప్లవమూ, మెక్సికన్ విప్లవమూ మానవజాతి ప్రయోజనం కోసమేనని, అణచివేయబడ్డ ప్రజానీకం కోసమే నని అమెరికాలో, యూరప్‌లో యావత్ ప్రజా నీకమూ గుర్తిస్తే మానవజాతికి న్యాయం జరుగు తుంది" అని జపాటా 1918లో రాశాడు. మెక్సికన్ విప్లవ సేనానాయకులలో ఒకరు "నాకు ఈ సోషలిజం అంటే ఏమిటో తెలియదు. కాని నేను మాత్రం బోల్షివిక్‌నే. నేనే కాదు, దేశభక్తిగల ప్రతీ మెక్సికన్ కూడా బోల్షివిక్కే. ఈ యాంకీలు మాకు శత్రువులు. వాళ్ళకి బోల్షివిక్‌లంటే పడదు. అంచేత బోల్షివిక్‌లు మంచివాళ్ళైవుండాలి. అందువల్లనే వాళ్ళు మాకు మిత్రులు. అందుకే మేమంతా బోల్షివిక్‌లం." అంటూ అక్టోబర్ విప్లవానికి, లాటిన్ అమెరికాలోని పీడిత ప్రజలకు గల సంబంధం ఏమిటో స్పష్టంగా చెప్పాడు. మెక్సికన్ కవులు రష్యన్ విప్లవాన్ని స్వాగతిస్తూ పాటలు అల్లారు. సోషలిస్టు సూర్యుడు చీకట్లను చీల్చుకుంటూ వెలుగులు చిమ్ముతున్నాడని వర్ణించారు.

లాటిన్‌అమెరికన్ విప్లవం దానిసొంత ప్రత్యేకత కలిగివుంటుందని పెరు దేశపు మార్క్సిస్టు మేధావి జోస్ కార్లోస్ మరియటెగుయి భావించాడు. "లాటిన్ అమెరికాలోని విప్లవం రష్యా విప్లవానికి మక్కికి మక్కి ఒక కాపీగా ఉండదు. అది సృజనాత్మకంగా, వీరోచితంగా ఉంటుంది." అన్నాడు. అమెరికా ఖండంలో ముందునుంచీ ఉంటున్న స్థానిక జాతుల సమస్యను ఆయన ప్రస్తావించాడు. విప్లవంలో కార్మికులతోబాటు, రైతులతోబాటు స్థానిక జాతుల ప్రజలకూ పాత్ర ఉంటుందని ఆయన గమనించాడు. 1929 జూన్‌లో అర్జెంటినా లోని బ్యూనస్‌ఎయిర్స్‌లో మొదటి లాటిన్‌అమెరికన్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ జరిగింది. విప్లవానంతరం ఏర్పడే వ్యవస్థలో పెత్తనం బూర్జువా వర్గం చేతుల్లోకి పోగూడదని మరియటెగుయి అక్కడ గట్టిగా వాదించాడు. "కార్మికులను, రైతులను, స్థానిక తెగల ప్రజలను అందరినీ పెట్టుబడిదారీ విధానం నుండి, జాతిదురంహంకారం ఆధిపత్యం నుండి విముక్తి చేసే లక్ష్యంతో

**“ 1973లో అమెరికా ప్రోద్బలంతో జనరల్ అగస్టో పినోచెట్ సారధ్యంలో ఈ పాపులర్ ఫ్రంట్ ప్రభుత్వం కూలదోయబడింది. కమ్యూనిస్టులను సామూహిక హత్యలతో, అరెస్టులతో కాలరాచివేశాడు పినోచెట్. పలువురు కమ్యూనిస్టులను హెలి కాప్టర్లలో తీసుకుపోయి ఆ పైనుంచి పసిఫిక్ సముద్రంలో తోయించాడు. డైనమైట్లతో చాలా మందిని ముక్కలుముక్కలు చేశాడు. ”**



కాస్ట్రో నాయకత్వంలో క్యూబా విప్లవాన్ని జయప్రదం చేసిన గెరిల్లా బృందం

విప్లవకార్యక్రమం ఉండాలి” అని ఆయన అన్నాడు. “ మమ్మల్ని విముక్తి చేయగల లెనిన్ ఏడి?” అని స్థానిక తెగలు ఎదురు చూస్తున్నారని అన్నాడు.

అయితే ఈ ఎదురు చూడడం చాలా కాలమే పట్టింది. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని సవాలు చేయడానికి అవసరమైన ఐక్యత వామపక్షశక్తులమధ్య ఏర్పడలేదు. స్టాలినిజానికి ట్రాట్‌స్కీయిజానికి మధ్య, కమ్యూనిజానికి అనార్కిజానికి మధ్య విభేదాలవలన వామపక్ష ఐక్యత ఏర్పడలేదు. కార్మిక, కర్షక వర్గాలను ఏకం చేసి అమెరికన్ సామ్రాజ్యవాదులనీ, స్థానిక బూర్జువా, భూస్వామ్యవర్గాలనీ ఎదిరించే సంఘటన సాధ్యం కాలేదు. కమ్యూనిస్టుపార్టీలు చిన్నవిగానే ఉండిపోయాయి. ఐతే వాటి ప్రభావం సాంస్కృతిక రంగం పైన చాలా విస్తృతంగా పడింది. లాటిన్ అమెరికన్ కళాకారులు, రచయితలు సోషలిస్టు భావాల ప్రభావంతో చేసిన సృజనలు ప్రజలపై చాలా ప్రభావాన్ని కలిగించాయి. చిలీ కవి పాబ్లో నెరుడా, కొలంబియన్ రచయిత గాబ్రియల్ గార్షియా మార్క్వెజ్ అలా ప్రసిద్ధికెక్కినవారే.

కమ్యూనిస్టులు ముఖ్యమైన పాత్ర పోషించిన చిలీలో తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. చిలీలో కమ్యూనిస్టుపార్టీ 1922లో ఏర్పడింది. ప్రధానంగా చిలీలోని పట్టణ ప్రాంతాల కార్మికులపై పడిన సోషలిస్టు భావాలవలన వారినుండి ఎక్కువసంఖ్యలో పార్టీలో చేరారు. కమ్యూనిస్టులకు కార్మికులలో ఉన్న వోటింగ్ బలం వెన్నుదన్నుగా నిలిచినందున 1937-41 మధ్య పాపులర్‌ఫ్రంట్ ప్రభుత్వం, 1942-46 మధ్య ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం చిలీలో ఏర్పడ్డాయి. 1948లో కమ్యూనిస్టుపార్టీ ఒక దశాబ్దంపాటు నిషేధానికి గురైంది. ఆ నిర్బంధాన్ని తట్టుకుని రెట్టించిన బలంతో 1970లో సోషలిస్టుపార్టీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అదే పాపులర్ యూనిటీ ప్రభుత్వం. అలెండీ నాయకత్వాన నడిచింది. 1973లో అమెరికా ప్రోద్బలంతో జనరల్ అగస్టో పినోచెట్ సారధ్యంలో ఈ పాపులర్ ఫ్రంట్ ప్రభుత్వం కూలదోయబడింది. కమ్యూనిస్టులను సామూహిక హత్యలతో, అరెస్టులతో కాలరాచివేశాడు పినోచెట్. పలువురు కమ్యూనిస్టులను హెలికాప్టర్లలో తీసుకుపోయి ఆ పైనుంచి పసిఫిక్ సముద్రంలో తోయించాడు. డైనమైట్లతో చాలా మందిని ముక్కలుముక్కలు చేశాడు.

అర్జెంటినా లోని కమ్యూనిస్టులపైన, ఇతర వామపక్ష మిలిటెంట్లపైన కూడా ఇటువంటి దారుణాలే జరిగాయి. మిలిటరీ అధికారులు భాగస్వాములుగా ఏర్పడిన అర్జెంటినా కమ్యూనిస్టువ్యతిరేక కూటమి అనేక కమ్యూనిస్టు గ్రూపులను, అనార్కిస్టు గ్రూపులను కాలరాసింది. ఒక దశాబ్దకాలంలోనే 30,000 మంది వరకు చంపబడ్డారు. ఇంత తీవ్ర నిర్బంధం మధ్య ఆ దేశాలలో వామపక్షాలు బతికి బట్టగలిగాయంటే అది ఒక అద్భుతమే.

1959లో క్యూబాలో విప్లవం తర్వాత పరిస్థితులలో వేగంగా మార్పులు వచ్చాయి. అమెరికా దన్నుతోఅక్కడ పెత్తనం చేస్తున్న నియంత బాటిస్టా ప్రభుత్వాన్ని ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలో జరిగిన సాయుధ, రాజకీయ తిరుగుబాటు అంతమొందించింది. దీనితో పశ్చిమార్ధగోళంలో ఒక నూతన శకం ప్రారంభమైంది. తొలిరోజుల్లో కాస్ట్రో రష్యావైపు చూడలేదు. అతని మిత్రబృందంలో చే గువేరా వంటి కమ్యూనిస్టులు ఉన్నారు. విప్లవం జరిగినవెంటనే అమెరికా తన ఆర్థిక, రాజకీయ దాడిని ప్రారంభించింది. దాంతో క్యూబా సోవియట్‌వైపు మొగ్గింది. సోవియట్ రష్యా క్యూబాకు సైనిక సహాయం మాత్రమే గాక వ్యవసాయంలోను, రాజకీయంగాను కూడా సహాయాన్ని అందించింది. రష్యాతో జరిగిన వ్యాపార లావాదేవీలలో క్యూబా చక్కెరరూపంలో తన చెల్లింపులు చేసింది. ఐతే సోవియట్-క్యూబా సంబంధాలలో కొన్ని భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ఏదిఏమైనా అమెరికన్ ఆంక్షలను తట్టుకుని క్యూబా నిలవగలిగిందంటే అందుకు సోవియట్‌తో క్యూబాకున్న మైత్రి ప్రధానకారణం. సోవియట్ అండ గనుక లేకుంటే అమెరికా ఎప్పుడో క్యూబాను ఆక్రమించివుండేది. లాటిన్ అమెరికాకు సోవియట్ సహకారం యొక్క అవసరాన్ని కాస్ట్రో ముందే గుర్తించాడు. 1979లో జరిగిన నికరాగ్వా, గ్రెనడా విముక్తి పోరాటాలకు రష్యా కీలకతోడ్పాటునిచ్చింది. అమెరికన్ దిగ్బంధనం

నుంచి కాపాడడానికి రష్యా నికరాగ్వాకు మిలిటరీ, ఆర్థిక సహాయాన్ని అందించింది. క్యూబాద్వారా గ్రెనడాకు అందించిన సహాయం కొద్దికాలంవరకైనా గ్రెనడాలో విప్లవం మనగలగ డానికి తోడ్పడింది. 1979-1983 మధ్య స్వల్పకాలంలో గ్రెనడాలో నిరక్షరాస్యత 35 నుండి 5 శాతానికి తగ్గింది. ప్రజారోగ్య వ్యవస్థ మెరుగుపడింది. ఇదంతా అక్కడ సమాజాన్ని ప్రజాతంత్రీకరించినందువల్లనే సాధ్యపడింది. ఐతే అక్కడ విప్లవగ్రూపులు పరస్పరం కలహించుకోవడంతో 1983లో ఆ దేశాన్ని అమెరికా ఆక్రమించుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఐతే, ఇప్పటికీ ఆనాటి విప్లవ వారసత్వం గ్రెనడాలో సజీవంగానే ఉంది. అప్పటి తిరుగుబాటు నాయకుడు మారిస్ బిషప్ పేరుతో అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం ఇప్పటికీ కొనసాగుతోంది.

లాటిన్ అమెరికాదేశాలన్నింట్లోనూ విరివిగా సోవియట్ సాహిత్యం ప్రచారంలోకి వచ్చింది. మార్క్సిస్టు భావజాలం వెనిజులా నుంచి చిలీ దాకా, క్యూబా నుంచి మెక్సికో దాకా వ్యాప్తిచెందడానికి దారితీసింది. అంతే గాక, మధ్యఆసియా, రష్యా ప్రాంతాల సాహితీ వారసత్వం కూడా వారికి పరిచయం అయింది. లాటిన్ అమెరికా విద్యార్థులు చాలామంది తూర్పుయూరప్ సోషలిస్టుదేశాలకు చదువుకో డానికి వెళ్ళారు. మాస్కోలోని పాట్రిస్ లుముంబా యూనివర్సిటీలోను, అంతర్జాతీయ సంబంధాల అధ్యయన కేంద్రంలోను వీరి సంఖ్య ఎక్కువగా ఉండేది. లాటిన్ అమెరికా దేశాల్లో ఒకదానివెంట ఒకటిగా మిలిటరీ నియంతృత్వ ప్రభుత్వాలు వచ్చినపుడు చాలా మంది కమ్యూనిస్టులకు రష్యా, తూర్పు జర్మనీ ఆశ్రయం కల్పించాయి.

> **“ రష్యాలో జరిగిన పరిణామాలు చారిత్రికంగా అనివార్య మైనవని నేను భావించడంలేదు. సోషలిస్టు వ్యవస్థ కుదించుకుపోవడం, పెట్టుబడిదారీవిధానం తిరిగిరావడం సరైనదిశలో జరుగుతున్న పరిణా మాలు కావు. జరిగిన క్రమం వెనక అక్కడి నాయకత్వం తీసుకున్న పొరపాటువైఖరి కీలక పాత్ర పోషించింది.” అని 1997 లో ఒక మెక్సికన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాస్ట్రో అన్నాడు. ”**

తూర్పుయూరప్ దేశాలపైనే క్యూబా ఆర్థికవ్యవస్థ ఆధారపడివుండటంతో సోవియట్ పతనం తర్వాత క్యూబా చాలా గడ్డుపరిస్థితుల నెదుర్కొంది. రష్యన్ సైన్యాలను ఒక్కొక్కటిగా క్యూబానుంచి, నికరాగ్వానుంచి, అంగోలా నుంచి గోర్బచేవ్ ప్రభుత్వం వెనక్కి రప్పించ సాగింది. త్వరలోనే రష్యా పశ్చిమదేశాలకు దాసోహమనడం ఖాయమని కాస్ట్రో అప్పుడే అర్థం చేసుకున్నాడు. “రష్యాలో జరిగిన పరిణామాలు చారిత్రికంగా అనివార్యమైనవని నేను భావించడంలేదు. సోషలిస్టు వ్యవస్థ కుదించుకుపోవడం, పెట్టుబడిదారీవిధానం తిరిగిరావడం సరైనదిశలో జరుగుతున్న పరిణా మాలు కావు. జరిగిన క్రమం వెనక అక్కడి నాయకత్వం తీసుకున్న పొరపాటువైఖరి కీలక పాత్ర పోషించింది.” అని 1997 లో ఒక మెక్సికన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాస్ట్రో అన్నాడు. “అక్కడ చాలా పొరపాట్లు జరిగాయి. ప్రజలనుండి వేరుపడి పోవడం అనేది వాటిలో ఒకటి. లోతుగా పరిశీలిస్తే సైద్ధాంతిక బలహీ నతలు చాలా కనపడతాయి. ప్రజానీకం సోషలి స్టు ఆదర్శాలనుంచి పక్కకు పోయారు. ఇతర ప్రాంతాల ప్రజానీకం పట్ల అంతర్జాతీయ సంఘీ భావం ప్రదర్శించడం సోషలిస్టు ఆదర్శాలలో ఒక ముఖ్యమైనది. ఇటువంటి నిజమైన సోషలిస్టు విలువలను విస్మరించి పాదార్థిక అవసరాలపై అవసరమైనదానికన్నా వాళ్ళు ఎక్కువ దృష్టి సారించారు. దీని సైద్ధాంతిక ప్రభావం ఎలా ఉండబోతున్నదో వారు పట్టించు కోలేదు. ప్రతీ సంవత్సరమూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే సోషలిజం యొక్క ఏకైక లక్ష్యం అన్నట్లు వాళ్ళు వ్యవహరించ చడం మొదలెట్టారు. మరికాస్త మంచి దుస్తులు, మరింత మాంసం, మరింత వెన్న, మరిన్ని విని మయ వస్తువులు-ఇదే సర్వస్వం ఐపోయింది. నా దృష్టిలో సోషలిజం అంటే ప్రజల జీవితంలో సమూలమైన మార్పు రావడం. కొత్త వ్యవస్థ, కొత్త విలువలు, కొత్త సంస్కృతి. ఇది స్వార్థం, వ్యక్తివాదం మీద గాకుండా ప్రజలందరిమధ్య వెల్లివిరిసే సంఘీభావం మీద, సౌహార్ద్రత మీద నిర్మించబడాలి.” అన్నాడు.

అనంతర పరిస్థితుల్లో క్యూబా చాలా గడ్డు సవాళ్ళనెదుర్కొంది. పట్టుదలతో, సృజన శీలతతో ఆ స్థితి నుండి బైటపడింది. 1917 విప్లవం అనంతరం లాటిన్ అమెరికాలో రగిలిన విప్లవజ్వాలలకు క్యూబా ఒక సజీవ చిహ్నాం. అది చిలీ నుండి మెక్సికో దాకా ప్రజల్ని ఉ త్తేజపరుస్తూనే ఉంటుంది.

**- స్వేచ్ఛానుసరణ : ఎం.వి.ఎస్.శర్మ**

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్,** ‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తిప్రెస్, గవర్నరుపేట, విజయవాడ.

**వ్యవసాయరంగం**

# వ్యవసాయ సంక్షోభాన్ని తీవ్రం చేసిన నోట్ల రద్దు నిర్ణయం

**విజూ కృష్ణన్**



రచయిత ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు

నవంబర్ 8, 2016 నాడు మోడీ చేసిన ప్రసంగం పేద ప్రజల జీవితాలపై విపత్కర ప్రభావం చూపింది. గతంలో ఏ ప్రధాని ప్రసంగం అటువంటి ప్రభావాన్ని చూపలేదు. ప్రపంచం అంతా నిద్రిస్తున్న సమయాన అర్ధరాత్రి పెద్దనోట్ల (రూ.500, రూ.1000) చెల్లుబాటు నిలిచిపోయింది.

తీవ్రమైన ప్రభావం చూపించిన ఆ రోజున 'కిసాన్ సంఘర్ష్ జాతా' ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతుల ఆత్మహత్యలకు కేంద్రమైన అనంతపురం జిల్లాకు చేరుకున్నది. ఆ మరుసటి రోజున జిల్లాకు దగ్గర్లో వున్న వివిధ ప్రాంతాల నుండి రైతులు కూరగాయలు, పూలు తీసుకొని మార్కెట్‌కు చేరుకున్నారు. కానీ వాటిని కొనటానికి కొనుగోలుదారులు లేకుండా పోయారు. అనేకమంది ప్రజలు బ్యాంక్‌లు, ఎటిఎం కేంద్రాల ముందు బారుతీరి ఉన్నారు. మల్బరీగోల్డ్ పూలు 50 కేజీల సంచికి రూ.100 కూడా పొందలేక పోతున్నామని కర్ణాటక రాష్ట్రానికి చెందిన కోలార్ నుండి వచ్చిన రైతులు తెలిపారు. రవాణా చేయడానికి అయ్యే ఖర్చులు కూడా పొందలేక పోవడంతో రైతులు తప్పని పరిస్థితులలో తమ ఉత్పత్తులను బలవంతంగా పారబోయవలసిన స్థితి ఏర్పడింది. ఢిల్లీకి చేరుకున్న నవబర్ 24వ తేదీ నాటికి జాతా పయనించిన దారి పొడవున రైతుల పరిస్థితి ఈ విధంగానే వున్నది.

**డబ్బు బాధలు**

ప్రధాని ప్రసంగం చేసిన రెండు రోజుల అనంతరం నవంబర్ 11న మేము తెలంగాణ రాష్ట్రానికి చేరుకున్నాం. పెద్దనోట్ల రద్దు పుణ్యమా అని ఆ రోజున మొదటి చావు వార్త విన్నాం. మహబూబాబాద్ జిల్లాకు చెందిన కందుకూరి వినోద (55) అనే మహిళ పక్షవాతంతో బాధపడుతున్న తన భర్తకు వైద్యం కొరకు, తన కూతురు పెళ్ళి ఖర్చుల నిమిత్తం మొత్తం 12 ఎకరాల సాగు భూమిని రూ.56.40 లక్షలకు విక్రయించింది. కానీ బ్యాంక్‌లో రూ.2.5 లక్షల కన్నా ఎక్కువ డిపాజిట్ చేస్తే, నల్లధనంగా పరిగణించబడుతుందన్న భయంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నది. నవంబర్ 13, 2016న కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్ళాపూర్ జిల్లాలోని గుడిబండ తాలూకాకు చెందిన మరొక రైతు ఆత్మహత్య చేసుకున్నది. ఈశ్వరమ్మ (40) అనే వ్యవసాయ కూలీ తన వద్ద వున్న రూ.15,000 లు బ్యాంక్‌లో డిపాజిట్ చేయడానికి వెళ్తుండగా ఆ డబ్బు పోగొట్టుకున్నది. కష్టపడి సంపాదించిన డబ్బును పోగొట్టుకున్నానన్న బాధతో ఆత్మహత్యకు పాల్పడింది. నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, జగిత్యాల మార్కెట్ దృశ్యాలు గుండెలు పగిలిపోయే విధంగా వున్నాయి. త్వరగా పాడైపోయే కూరగాయలు, పూలు బలవంతంగా పారబోయవలసిన దారుణమైన పరిస్థితులను రైతులు ఎదుర్కొన్నారు.

నవంబర్ 16, 2016న జాతా తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా నుండి కొత్తగా ఏర్పడిన నిర్మల్ జిల్లాకు చేరింది. ఒక ఆంధ్రాబ్యాంక్ శాఖ ముందు పొడవైన లైనులో ప్రజలు నిలబడి వుండడాన్ని జాతా గమనించింది. ఆ వరుసలో నిల్చున్న వారిలో ఎక్కువ మంది మహిళలే. భూమమ్మ, లక్ష్మి అనే యిద్దరు మహిళలు వారు అమ్మిన వరి పంటకు వచ్చిన డబ్బును మార్చుకోవడానికి వారం రోజులుగా ప్రతిరోజూ బ్యాంక్‌కు వస్తున్నట్లు చెప్పినారు. వారు అమ్మిన పంటకు వారిద్దరికి ఒక్కొక్కరికి 28,000 రూ.లు, 42,000 రూ.లు (500, 1000 నోట్లలో) చెల్లించినారు. కొన్ని రోజులుగా వారు ఉదయం నుండి సాయంత్రం వరకు ఎదురుచూసినా గాని వారి వద్దవున్న పాత నోట్లను కొత్త నోట్లుగా మార్చుకోలేకపోయినారు. ప్రతిరోజు చెప్పినట్లుగానే బ్యాంకు అధికారులు వారివద్ద ఎక్కువ డబ్బు నిల్వ లేదు అని చెప్పడంతో వారు నిరాశతో వెనుతిరిగిపోతున్నారు. ఆశన్న అనే రైతు, తన బాధల గురించి కెమెరా ముందుకు వచ్చి మాట్లాడే ధైర్యం చేసినాడు. నల్లధనంపై దాడి పేరుతో ప్రజలపై మోడీ చేసిన మెరుపు దాడికి వ్యతిరేకంగా మాట్లాడడం దైవ దూషణగా పరిగణించే సమయం అది. ఆయన కూడా వరి పంట అమ్మగా వచ్చిన 50,000 రూ.లను మార్చుకోవడానికి విఫల ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నాడు. నోట్ల రద్దు నిర్ణయం వారియొక్క రోజువారీ జీవితాలను అస్తవ్యస్తం చేసి, వ్యవసాయ పనులను నిలిపివేసిందని అక్కడున్న రైతులందరూ చెప్పారు. వారు పండించిన కూరగాయలు కొనడానికి కొనుగోలుదారులు లేకపోవడంతో అవి పాడైపోవడానికి నోట్లరద్దు నిర్ణయం ఉపకరించింది. ఫలితంగా వారు నిత్యావసర సరుకులు మరియు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు కొనుక్కోలేకపోయినారు. కొన్నిచోట్ల మాత్రం కొనుగోలుదారులు పంట విలువకు తక్కువరేటు నిర్ణయించి కొనుగోలు చేసినట్లు రైతులు చెప్పినారు. మోడీ రైతులకు చేదు పంటలను బహుమతిగా యిచ్చినాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**పనిలేదు, వేతనం లేదు**

ప్రధాని ప్రసంగం చేసిన నాటి నుండి వ్యవసాయ కార్మికులకు పనిలేదు, వేతనాలు లేవు. ప్రజలు నిత్యావసర సరుకులను, కూరగాయలను, మందులను కొనుగోలు చేయలేకపోయినారు. చిన్న వ్యాపారస్తులకు కొనుగోలుదారులు లేకుండాపోయినారు. చేతిలో డబ్బులు లేక పేద ప్రజలు ప్రయాణాలు కూడ చేయలేకపోయినారు. పెద్ద సంఖ్యలో వున్న పేద రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు సంస్థాగతమైన ఋణాలు అందుబాటులో లేకుండాపోయినాయి. వీరంతా సామాజికంగా అణగదొక్కబడిన వర్గాలకు చెందినవారు. వీరు నగదు అప్పులపై ఆధార పడి జీవించేవారు. సంక్షోభంలో వున్న రైతాంగం పెద్దనోట్ల రద్దు నిర్ణయంతో మరింత కష్టాలలోకి నెట్టివేయబడింది. దాని పర్యవసానంగా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోయి

నష్టాల పాలయ్యారు. విత్తనాలు, నాట్లు వేసే పనులు ఆలస్యం అవడంతో గోధుమ, యితర పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం మాత్రమే ప్రజల జీవనాధార వనరుగా మిగిలిపోయింది. పెద్దనోట్ల రద్దు నిర్ణయం తరువాత, వ్యవసాయంలో పెట్టుబడులకు మరియు యింటి ఖర్చులకు డబ్బు తయారుగా లేకపోవడంతో ప్రజల జీవితాలు అస్తవ్యస్తమైనాయి. పంటలు చేతికందే సమయంలోనే ఈ సమస్య రావడంతో, అప్పటికే సంక్షోభంలో వున్న రైతులు మరింత సంక్షోభంలోనికి నెట్టివేయబడినారు.

**“గ్రామీణ సహకార బ్యాంకింగ్ రంగంపై క్రమ పద్ధతిలో దాడి ఆ రంగాన్ని తీవ్రంగా బలహీనపరిచే చర్యలలో ఒకటి. తమ ఖాతాదారులను రద్దైన నోట్లను మార్చుకోవడానికి లేదా డిపాజిట్ చేసుకోవడానికి అనుమతించ కూడదని ఆర్.బి.ఐ. ఒక నోటిఫికేషన్ ద్వారా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లకు తెలియ పరచింది.”**

దీనితోపాటుగా, అసంఘటితరంగంలో మూకుమ్మడిగా ఉద్యోగాలు తొలగించడంతో, ఉద్యోగ అవకాశాలు లేని స్థితి రెట్టింపు అయ్యింది. దీని ఫలితంగా తిరోగమన బాటలో పట్టణాల నుండి గ్రామాలకు వలసలు పెరిగినాయి. వేల సంఖ్యలో ప్రజలు అప్పటిదాకా సరిపడా డబ్బులేని వారి కుటుంబాలకు క్రమం తప్పకుండా డబ్బు పంపినవారు నగరాలలో జీవించడం భారం కావడంతో గ్రామాలకు తిరిగి వచ్చినారు. సహజంగానే ఇది గ్రామీణ ప్రాంతాలలో కష్టాలను రెట్టింపు చేసింది. అదే సమయంలో పెద్ద సంఖ్యలో వున్న నిరుద్యోగ యువ సైన్యం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనికొరకు ఎదురు చూస్తున్నారు. ఈ పథకానికి కేటాయింపులు కత్తిరింపులకు గురికావడంతో, యిది నిరుపయోగమైన, విఫల చర్యగా మిగిలిపోయింది.

ఋణాలు తేలికగా పొందడానికి జన్‌ధన్ ఖాతాలు ఏ మాత్రం ఉపయోగపడలేదు. గ్రామీణ ప్రజలు యిప్పటికీ నగదుతోనే వారియొక్క వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. పంట పండించిన రైతు అమ్మడానికి సిద్దంగా వున్నాడు, కానీ, కొనేవాడు సిద్దంగాలేని విషయం మనకు తెలుసు. దీనికి కారణం కొనడానికి వారి వద్ద నగదు లేదు. 'రైతు బజార్లలో' తమ ఉత్పత్తులను అమ్మాలనుకున్న రైతులకు కొనేవారు దొరకడం లేదు. ఆహారం, రోజువారీ ఖర్చుల కొరకు నోట్లను మార్చుకోలేకపోవడం కూడ సమస్యలకు దారితీసింది.

### సహకార బ్యాంకింగ్ రంగంపై దాడి

గ్రామీణ సహకార బ్యాంకింగ్ రంగంపై క్రమ పద్దతిలో దాడి ఆ రంగాన్ని తీవ్రంగా బలహీనపరిచే చర్యలలో ఒకటి. తమ ఖాతాదారులను రద్దైన నోట్లను మార్చుకోవడానికి లేదా డిపాజిట్ చేసుకోవడానికి అనుమతించ కూడదని ఆర్.బి.ఐ. ఒక నోటిఫికేషన్ ద్వారా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లకు తెలియ పరచింది. సహకార బ్యాంక్‌లు వినియోగదారుల కొరకు కె.వై.సి. నియమాలను పాటించలేదన్న సాకును చూపించడం జరిగింది. ఒక నివేదిక ప్రకారం, 33 రాష్ట్ర సహకార బ్యాంక్‌లు మరియు 367 జిల్లా సహకార బ్యాంక్‌లు 12 కోట్లకు పైగా వున్న వాటి వినియోగదారుల అవసరాలను సమకూర్చినాయి. వారిలో ఎక్కువ సంఖ్యలో వున్నవారు కిసాన్ క్రెడిట్‌కార్డు ద్వారా ఋణాలను తీసుకొని, తిరిగి వారి ఋణాలను చెల్లించలేకపోతున్న వారంతా రైతులే. సమర్థవంతమైన సహకార బ్యాంకింగ్ రంగానికి చెప్పుకోదగిన కేరళ మాత్రమే, రైతులు, గ్రామీణ పేదల అవసరాలను తీర్చింది. సహకార బ్యాంక్‌లు 1.25 లక్షల కోట్ల రూపాయలను నిలిపివేసినాయి. పెద్దనోట్ల రద్దు వలన రైతు సహకార సంఘాలు కూడ పూడ్చలేని నష్టాలను చవిచూసినాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో బ్యాంక్‌లు, ఎటిఎంల ముందు పెద్ద వరుసలలో ప్రజలు నిలబడి వుండడం గమనించడం జరిగింది. సంఘ్ పరివార్‌కు బలమైన కేంద్రంగా వున్న నాగపూర్‌లో అనేక మీటింగులలో ఎక్కువ మంది ప్రజానీకం గుమిగూడడం జాతా గమనించింది. బీండ్‌లో నవంబర్ 17న ఒక ఎస్.బి.ఐ.శాఖ ముందు ఒక నిరసన ప్రదర్శన జరిగింది. నోట్లరద్దు నిర్ణయం వల్ల వేధింపులతో, పొడవైన క్యూలతో విసుగుచెందిన ప్రజానీకం పెద్ద సంఖ్యలో గుమిగూడినారు. గ్రామీణ పేద ప్రజల విషయంలో ఏదో పెద్ద తప్పిదం జరిగిందని ఇది సూచిస్తున్నది. జాతా మొరేనా చేరేనాటికి నిరసనలు పెల్లుబికినాయి. యిదే సమయంలో రద్దైన నోట్లతో మందులు కొనలేక ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్న వార్త జిల్లా కేంద్రానికి చేరింది. నోట్ల రద్దు నిర్ణయం కారణంగా సంభవించిన మరణాల సంఖ్య పెరిగింది. అయినా కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని ప్రదర్శించింది.

రైతాంగం, పేద ప్రజల బాధల పట్ల ప్రభుత్వానికి ఏ విధమైన సానుభూతి లేదు. ప్రధాని ప్రజలను ఆకర్షించే ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చాడు కానీ వారికి ఏ విధమైన లాభం చేకూర్చలేదు. ప్రశ్నావళి ఆధారంగా వున్న గణాంకాల ఆధారంగా 9 శాతం ఎరువుల వాడకం పెరిగిందని, 6 శాతం రబీ సాగు పెరిగిందని పేర్కొన్నాడు. గోధుమ నాటు ఆలస్యం కావడం, సాగు వైశాల్యం తగ్గిపోవడం అనేది పెద్ద నోట్లరద్దు ఫలితంగానే జరిగింది. గడచిన రెండు సంవత్సరాలలో కరువు బాగా దెబ్బతీసిందన్న వాస్తవాన్ని ఆయన కావాలనే మరుగు పరిచినాడు. అనుకూల వాతావరణ పరిస్థితులు, పప్పుధాన్యాల సాగు పెరుగుదల కారణంగా సాగు చేయబడే భూమి వైశాల్యం పెరిగింది. దాని వలన ఎరువుల వాడకం పెరిగింది. ఈ పెరుగుదల పెద్దనోట్ల రద్దు నిర్ణయానికి మద్దతుకు సూచిక కాదు. రబీసాగు కొరకు జిల్లా సహకార బ్యాంక్‌లు, సొసైటీల నుండి తీసుకున్న ఋణాలపై 60 రోజుల వడ్డీని మాత్రమే మాఫీ చేస్తున్నట్లు ప్రకటించినాడు. ముఖ్యంగా, పెద్దనోట్ల రద్దు ప్రభుత్వ సహకార రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. మూడుకోట్ల కిసాన్‌కార్డులు రూపే డెబిట్ కార్డులుగా మార్చబడతాయన్న ప్రకటన, 2012 తరువాత ఉనికిలో వున్న పథకమే. 2013-14 నాటికే కొన్ని లక్షల కార్డులు యివ్వబడినాయి.

### కుప్పకూలిన ధరలు మరియు జీవనోపాధి

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో మందసౌర్‌కు చెందిన 6గురు రైతులు మరణించిన అనంతరం ఎ.ఐ.కె.ఎస్. బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించింది. గత సం. పంటకు వున్న ధరలో కేవలం 60 శాతం ధర మాత్రమే ఈ సంవత్సరపు పంటకు వుండడంతో ఆ ప్రాంతం అంతా నిరాశా నిస్పృహలతో వున్నట్టు బృందం గమనించింది. పెద్దనోట్ల రద్దు

> **❝ కానీ రాజస్థాన్‌లో అన్ని జిల్లాలలో పెసలు మరియు వేరుశనగ కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను తెరిచే క్రమంలో, ఒక రైతు నుండి కేవలం 25 క్వింటాళ్ళు మాత్ర మే మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్న నిబంధన నిరసనలకు దారితీసింది. ఫలితంగా అది 50 క్వింటాళ్ళ వరకు పెంచడం జరిగింది.❞**

నిర్ణయం మరియు గోధుమలు, పప్పు ధాన్యాల దిగుబడి బాగా వున్నప్పటికీ కూడ వాటిని దిగుమతి చేసుకోవాలన్న తప్పుడు విధానాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. గత సంవత్సరం 5000 నుండి 6000 ధర పలికిన క్వింటా సోయా చిక్కుళ్ళు ఈ సంవత్సరం రూ.2200–2400కు పడిపోయింది. కింటాల్ మంచి శనగలు గత సం. రూ.9000 నుండి 10000 ధర పలికితే ఈ సంవత్సరం అది రూ.4000కు పడిపోయింది. గత సంవత్సరం నుండి ఈ రెండు పంటల ధరలలో 60 శాతం తగ్గుదలను గమనించవచ్చు. అదేవిధంగా, మంచి రకం గోధుమలు క్వింటా రు.1200/– కాగా, దాని వాస్తవ మద్దతు ధర రూ.1625/–. గత సం. క్వింటా రూ.1900/– నుండి 2000/–ల ధర పలికింది. కాబట్టి మొత్తంగా గత సంవత్సరపు ధరలతో పోల్చితే ధరలో 40 శాతం తగ్గుదల ఏర్పడింది. అంతే కాకుండా, ప్రభుత్వం కనీస మద్ధతు ధరతో సం. మొత్తం కాకుండా, కేవలం మూడు నెలలు మాత్రమే కొనుగోళ్ళు జరిపింది. ఏ విధమైన పన్నులు విధించకుండా గోధుమలను దిగుమతి చేసుకోవడంతో రైతుల కష్టాలు మరింత రెట్టింపు అయ్యాయి. ఉల్లిపాయలు క్వింటా రూ.13,000/– నుండి రూ.1,000/–కి పడిపోయింది. అంటే 92 శాతం పడిపోయింది. మెంతులు క్వింటా ధర రు.10,000 నుండి రూ.2,200 – రూ.3000 కు దిగజారింది. అంటే ధరలో 70 శాతం తగ్గుదల. పెద్దనోట్ల రద్దు అనంతరం వ్యాపారస్తులు నగదు వ్యాపార లావాదేవీలకు నూటికి 2 శాతం తక్కువ చెల్లిస్తున్నారు. ఈ కాలంలో పెట్టుబడి ఖర్చులు వివిధ రకాలుగా పెరిగినాయి. కుప్పకూలిన ధరల కారణంగానే ఋణ భారం పెరిగి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

నిరంతరం పంట ధరలు కుప్పకూలడం, ప్రభుత్వం వద్ద కొనుగోలు కేంద్రాలు



మధ్యప్రదేశ్‌లో రైతుల ఆందోళన

లేకపోవడంతో ప్రభుత్వం రైతాంగం యొక్క విశ్వాసాన్ని పొందలేకపోతున్నది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో పెద్ద ఎత్తున రైతాంగం యొక్క నిరసనలకు యిదే ప్రధానమైన కారణం. ఈ నిరసనల ఫలితంగా రైతులలో గతంలో ఎన్నడూ లేనంత ఐక్యత ఏర్పడింది. ఈ మూడు రాష్ట్రాలలో వున్న బిజెపి ప్రభుత్వాలు బహిరంగ కొనుగోలు కేంద్రాలు, గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్న నిర్ణయంలో జోక్యం కల్గించుకోవడానికి అంగీకరించవలసి వచ్చింది. కానీ రాజస్థాన్‌లో అన్ని జిల్లాలలో పెసలు మరియు వేరుశనగ కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను తెరిచే క్రమంలో, ఒక రైతు నుండి కేవలం 25 క్వింటాళ్ళు మాత్ర మే మద్దతు ధరకు కొనుగోలు చేయా లన్న నిబంధన నిరసనలకు దారితీసింది, ఫలి తంగా అది 50 క్వింటాళ్ళ వరకు పెంచడం జరిగింది. యిప్పటికీ ఆ పోరాటం కొనసాగు తుంది.

మధ్యప్రదేశ్‌లో 6గురు రైతుల మరణం తరువాత శివరాజ్‌సింగ్ చౌహాన్ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వం దిగజారుతున్న ధరల సమస్యలను పట్టించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ కనీస మద్దతు ధరకు పంటలను కొంటామన్న వాగ్దానానికి బదులుగా, ప్రభుత్వం 'భావాంతర్ భుక్తాన్ యోజనా' పథకాన్ని యివ్వజూపింది. అంటే దాని ప్రకారం ఒక పంట కనీస మద్దతు ధర కన్నా తక్కువగా అమ్మబడితే, కనీస మద్దతు ధరకన్నా ఎంత తక్కువగా అమ్మబడిందో ఆ తేడా మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందట. మొత్తం 64,00,000 మంది రైతులలో 1/4వ వంతుకన్నా ఎక్కువ మంది రైతులు ఆ పథకం క్రింద వారి పేర్లు నమోదు చేయించుకున్నారని, దానికి ప్రభుత్వానికి అయ్యే ఖర్చు (ప్రస్తుత ఖరీఫ్ పంటకు) రు.4000 కోట్లపైనే వుంటుందని ప్రభుత్వం తెలిపింది. ఈ పథకంపై ప్రకటన అనంతరం, పెద్ద వ్యాపారస్తులు అంతకు ముందు క్వింటా రు.2800, 2900 వున్న పంటను రు.1500, రు.2000 మధ్యలో కొనడానికి ముందుకొస్తున్నారు. పెద్దనోట్ల రద్దు నిర్ణయానికి పూర్వం రైతు క్వింటాకు 5000 నుండి 6000 కు పంటను అమ్మినాడు. 2017–18 సం.కి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్ధతు ధర క్వింటాకు రు.2850తో పాటు బోనస్ రు.200 మాత్రమే. దీని ఫలితంగానే రాష్ట్రంలోని అగర్ మల్వామండిలో నిరసనలు ప్రజ్వరిల్లినాయి. దీని పర్యవసానమే 2017 అక్టోబర్ 30న రైతులపై పోలీస్ లాఠీఛార్జ్ జరిగింది.

**ఆలుగడ్డ రైతులు**

బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఆలుగడ్డ పండించే రైతులు వారి పంటను అత్యంత తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. గత సం. బీహార్‌లో ఆలుగడ్డకు పలికిన ధర క్వింటా రు.300. ఈ ధర కోల్డ్‌స్టోరేజి అద్దెకు కూడసరిపోదు. అద్దె రు.400 నుండి 450 వుంటుంది. పెద్దనోట్ల రద్దుకుముందు, క్వింటా ఆలు ధర రు.500. కోల్డ్‌స్టోరేజి యజమానులు కావాలనే కోల్డ్ స్టోరేజి అద్దెలను పెంచినారు. కాబట్టి సహజంగా రైతులు వారి పంటను తక్కువ ధరకైనా అమ్మివేయడానికి సిద్దపడతారు అని రైతులు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక చిల్లర వ్యాపారి బీహార్‌లో పండించిన ఆలుగడ్డలను ఒక కిలో 10 రూ.లు విక్రయిస్తే, ఉత్తరప్రదేశ్‌లో పండించిన ఆలు ఒక కిలో రూ.30 ధర పలికింది.

పశ్చిమబెంగాల్‌లో 60 కిలోల ఆలుగడ్డ బస్తా రు.400 అంటే ఒక క్వింటా ధర రు.666. పెద్దనోట్ల రద్దు నిర్ణయం అనంతరం ఆ ధర రు.200 నుండి 250 కి పడిపోయింది. అంటే ఒక క్వింటా రు.416. దామోదర్‌నదీ తీరంలోని సారవంతమైన నేలలో ఒక రైతు ఒక బిఘాలో (1/3 ఎకరం) 60 క్వింటాళ్ళ

ఆలు పండించగలడు. అంటే ఒక బిఘాకు ఈ ధర ప్రకారం ఆ రైతుకు రు.15,000 నష్టం వాటిల్లుతుంది. పండిన ఆలుగడ్డ పంటలో 50 శాతం పైగా పంట శీతల గిడ్డంగులలో నిల్వచేయబడింది. ఇదే పరిస్థితి కొనసాగితే డిశంబర్ నెలలో కనీసం 20 శాతం ఆలుగడ్డ పంట శీతల గిడ్డంగులలోనే నిల్వ వుంటుంది. వాటిని రవాణా చేసుకోవడానికి అయ్యే ఖర్చును కూడ భరించలేక రైతులు ఆ నిల్వలను వదిలి వేసే మార్గం తప్ప వేరే గత్యంతరం వుండని పరిస్థితి ఏర్పడుతుంది. ఉత్తరప్రదేశ్‌లో కూడ యింకా 36 శాతం పంట అమ్ముడుపోకుండా నిల్వ వుంచబడింది. మళ్ళీ రానున్న కాలానికి పంట పండించే ప్రయత్నాలు కొనసాగుతునే వున్నాయి. పెద్దనోట్ల రద్దుకు పూర్వం క్వింటా ఆలుగడ్డ రు.1000 నుండి 1400 ధర పలికింది, యిప్పుడు అది క్వింటా రు.350 నుండి 450కి పడిపోయిందని రైతులు వాపోతున్నారు. ధరలు ఏ రాష్ట్రంలో కూడ యింకా పుంజుకోలేదు. బీహార్‌లో ప్రస్తుతం క్వింటా కందులకు రైతులు రు.2800 నుండి 3500 పొందుతున్నారు. పెద్దనోట్ల రద్దుకు పూర్వం వారికి క్వింటాకు రు.9000 నుండి 9500లకు ధర లభించింది. యింతకు ముందు, రైతులు పెసలు పండించి, వాటిని అమ్మివేసి వచ్చిన డబ్బుతో వచ్చే సీజన్‌లో పండించే వరి పంటకు పెట్టుబడిగా ఉపయోగించేవారు. కానీ ఈసారి వాటి ధర రు.7000 రు.9000 నుండి గణనీయంగా రు.2600 – 2800 లకు తగ్గిపోయింది. పంటకాలం గడచిపోయిన తరువాత యిప్పుడు మళ్ళీ ధర పెరిగింది. క్వింటా కందులకు కనీస మద్ధతు ధర రు.5050 వుండగా, పెద్దనోట్ల రద్దు అనంతరం అది 4200 – 4700కి పడిపోయింది. ఆ తరువాత రు.3800 – 4000 కు పడిపోయినట్లు కర్ణాటక రాష్ట్రంలోని కాలాబురిగికి చెందిన రైతులు పేర్కొన్నారు.

**మిర్చి రైతులు**

ఆంధ్రప్రదేశ్‌లో 2016–17లో 4.65 లక్షల ఎకరాలలో మిర్చి సాగు చేయబడింది. అంతకు ముందు సం. 3.9 లక్షల ఎకరాలలో మిర్చి పంట పండించినారు. మిర్చి పంట అంతకు ముందు సం. 80 లక్షల క్వింటాళ్ళు పండిస్తే, ఈ సం. 93 లక్షల క్వింటాళ్ళ పంట పండింది. తెలంగాణలో మిర్చి ఉత్పత్తి 40 లక్షల క్వింటాళ్ళు, బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రచారార్భాటంతో, మంచి రకం మిర్చి కొనుగోలు కొరకు మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీంను కేవలం 8.83 లక్షల క్వింటాళ్ళకు ఆంధ్ర ప్రదేశ్‌లో, 3.37 లక్షల క్వింటాళ్ళకు తెలంగాణలో వర్తింపచేసినారు. ఈ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం పండించిన పంటలో ఎం.ఐ.ఎస్. పథకం క్రింద కేవలం 10 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుంది. ఎఫ్.ఎ.క్యూ. 610 మిర్చికి రైతులు పొందే ధర కన్నా తక్కువ ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. రైతులు అమ్ముకునే మిర్చికి బయట రు.7000 ధర వస్తుంటే ప్రభుత్వం మాత్రం క్వింటాకు రు.5000 ధరను ప్రకటించింది. క్వింటాకు రు.10,000 ధర పలికితేనే రైతులు వారు పెట్టిన పెట్టుబడులను తిరిగి రాబట్టుకోగలుగుతారు. క్వింటా మిర్చి పండించడానికి రు.7500 నుండి 10,000 వరకు ఖర్చు అవుతుంది. మోత కూలీ, రవాణ ఖర్చులు రు.1250 వాస్తవంగా అయ్యే ఖర్చుకు సరిపోవు. 20 క్వింటాళ్ళ వరకు, ప్రతి క్వింటాకు అదనంగా రు.1500 చెల్లిస్తా మన్న తెలుగుదేశం ప్రభుత్వ వాగ్దానం అమలు కు నోచుకోలేదు. గత సం. ఎగుమతి రకం మిర్చి తేజాకు క్వింటాకు రు.13,000 పైన ధర పలికింది. 334 రకం మిర్చి ధర క్వింటా రు.1500కు పడిపోయింది. దానిని పండించ డానికి క్వింటాకు అయ్యే ఖర్చు మాత్రం రు.10,000 అవుతుంది. గడచినది కరువు కాలం. సాగు ఖర్చు బాగా పెరిగిపోయింది. కానీ ఉత్పాదకత ఎకరాకు 25 క్వింటాళ్ళ నుండి 15 క్వింటాళ్ళకు తగ్గింది. క్వింటా ధర రు.3000కు, క్వింటాకిచ్చే బోనస్ రు.1500 కలిపినా గాని సాగుకైన ఖర్చులో 50 శాతం ఖర్చులకు కూడ సరిపోవు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ధర గురించి వ్యాపారస్తులు రైతులకు చేరవేయలేదు. ఆ రకంగా వ్యాపార స్తులు తక్కువ ధరకు కొని, ఆసియాలోనే పెద్ద మిర్చి మార్కెట్ అయిన గుంటూరు మిర్చి యార్డుకు బస్తాలను తరలిస్తున్నారు. రైతులకు తక్కువ ధరలు చెల్లిస్తున్నారంటే అర్థం, పెద్ద వ్యాపారస్తులు, కార్పొరేట్ కంపెనీలు పెద్ద మొత్తంలో లాభాలు గడిస్తున్నారని అర్థం.

> **“ పంట పండించడానికి అయ్యే ఖర్చుకు కనీ సం 50 శాతం అదనంగా చేర్చి ధర నిర్ణయించాలని, రైతులందరికి పంటల బీమా వర్తింప చేయాలని, వడ్డీలేని ఋణాలు అందజేయాలని, ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని మరియు సాగుకు అవసరమయ్యే ఎరువులను సబ్సిడీకి అందజేయాలని ఎం.ఎస్. స్వామి నాథన్ కమీషన్ సిఫారసు చేసింది. ”**

పంట పండించడానికి అయ్యే ఖర్చుకు కనీసం 50 శాతం అదనంగా చేర్చి ధర నిర్ణయించాలని, రైతులందరికి పంటల భీమా వర్తింప చేయాలని, వడ్డీలేని ఋణాలు అందజేయాలని, ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలని మరియు సాగుకు అవసరమయ్యే ఎరువులను సబ్సిడీకి అందజేయాలని ఎం.ఎస్. స్వామి నాథన్ కమీషన్ సిఫారసు చేసింది. ఈ సిఫారసులను అమలు చేయడానికి బదులుగా బిజెపి ప్రభుత్వం తప్పుడు విధానాలను అవలంభించి ప్రజలను కష్టాలపాలు చేస్తుంది. ధరలను స్థిరీకరించడంలో, పంటల బీమాను కల్పించడంలో ప్రభుత్వం విఫలం చెందింది. ఈ చర్యల ఫలితంగా కర్ణాటక రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో రైతులు కూరగాయలను చేలలోనే మురిగిపోయే విధంగా వదిలివేస్తున్నారు. పూలు, టమాటా, పాలు బజారులలోనే పారబోయడం జరిగింది. రైతుల బాధలకు వస్తు సేవల పన్నులు (జి.ఎస్.టి.) తోడైనాయి. పెద్దనోట్ల రద్దు నిర్ణయం అనంతరం ఎగిసిపడిన నిరసన జ్వాలలు, నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు మరియు రైతులు పడుతున్న బాధల పట్ల బిజెపి ప్రభుత్వం యొక్క ఉదాసీన వైఖరికి వ్యతిరేకంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఏర్పడిన రైతాంగం యొక్క ఐక్యతవారి యొక్క డిమాండ్లకు తలవంచే స్థితిని మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, పంజాబ్ ప్రభుత్వాలకు కల్పించినాయి. పెద్దనోట్ల రద్దు నిర్ణయం జరిగి సంవత్సరం గడచిన సందర్భంగా ప్రజలు తమ నిరసన గళం వినిపించినారు. కార్మిక సంఘాలు, నవంబర్ 9,10,11 తేదీలలో మహాపడావ్‌కు పిలుపునిచ్చాయి. 184కు పైగా రైతు సంఘా లు, గ్రామీణ పేదలు, నవంబర్ 20 నుండి జరిగిన మూకుమ్మడి నిరసన ప్రదర్శనలకు ఐక్యం అయినారు. పెద్దనోట్ల రద్దు పేదలపైదాడి ప్రారంభం అనుకుంటే, ఆ దాడిలోని క్షతగాత్రు లందరూ ఐక్యం అయి జరుపుతున్న యుద్ధం అసాధారణమైనది.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

మతోన్మాదం

# గోగూండాల దాడులు.. వాస్తవాలు - వక్రీకరణలు



రచయిత
ప్రజాశక్తి న్యూఢిల్లీ విలేకరి

**జె. జగదీష్**

మోడీ సర్కార్ గద్దెనెక్కిన తరువాత దేశంలో గో రక్షకుల పేరిట గూండాల దాడులు పెరిగాయి. మరీ ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో గో గూండాలు ఆగడాలకు హద్దు లేకుండా పోతున్నది. గోవులను దొంగిలిస్తున్నారనే పేరుతో పాడి రైతులను అతికిరాతకంగా, అమానుషంగా హతమారుస్తున్నారు. హంతకులపై చర్యలు తీసుకోవడం లేదు. బిజెపి పాలిత రాజస్థాన్‌లోని అళ్వార్‌లో ఇటీవలే ఉమర్ ఖాన్ అనే పాడి రైతును గో గూండాలు కాల్చి, తలను నరికి, స్థానిక రైల్వే ట్రాక్‌పై పడేసిన ఘటన దేశంలో సంచలనం అయ్యింది. వివిధ జాతీయ పత్రికల్లోనూ, జాతీయ టీవీ ఛానల్స్‌లోనూ ఈ ఘటనపై నామమాత్రంగానే చర్చ జరిగింది. ప్రాంతీయ పత్రికలైతే చెప్పనవసరం లేదు. ఏదో కొన్ని పత్రికలు మాత్రం ఈ ఘటనకు సంబంధించిన వార్తను ప్రచురించాయి. మరికొన్ని వక్రీకరణలు రాశాయి. చివరికి ఎంతకీ దిగజారారంటే ఉమర్ ఖాన్ వయస్సు పేరుతో మీడియాలో ఒక వర్గం అసంబద్ధ చర్చకు తెరలేపింది. ప్రధాన భూమిక పోషించే మీడియా దీని గురించి కనీసం వార్తగా కూడా ప్రచురించలేదు. సరిగ్గా ఆరు నెలల క్రితం పెహ్లూఖాన్ అనే పాడిరైతును కూడా అళ్వార్‌లో గో గూండాలు దాడి చేసి హతమార్చారు. అసలు ఈ ఘటనలు ఏ విధంగా జరిగాయి? దానికి గల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక కారణాలేంటీ? ఆరు నెలల వ్యవధిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు పాడి రైతులను హత్య చేయడమేంటీ? ఈ రెండు ఘటనలు బిజెపి పాలిత రాజస్థాన్‌లోని అళ్వార్‌లోనే ఎందుకు జరిగాయి? అనే అంశాలకు సంబంధించి వాస్తవాలను వివరించే ప్రయత్నం చేస్తున్నాను. నవంబర్ 17న అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ దావలే, సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్, కోశాధికారి కృష్ణ ప్రసాద్, రాజస్థాన్ కిసాన్ సభ కార్యదర్శి చహగన్ లాల్ చౌదరి, ఉపాధ్యక్షుడు గుర్‌చరన్ సింగ్ మౌర్, భరత్‌పూర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌బో హవల్దార్, నాతిలాల్ శర్మ, భరత్‌పూర్ కిసాన్ సభ నాయకులు ఇమాన్ అసమొహమొద్దిలతో కూడిన బృందం అళ్వార్‌లోనూ, ఉమర్‌ఖాన్ స్వగ్రామం ఘట్‌మికా లోనూ పర్యటించింది. కిసాన్ సభ బృందంతో పాటు మీడియా బృందం కూడా ఈ పర్యటనలో ఉంది. ఈ సంఘటనలకు సంబంధించిన వాస్తవాలు ఈ పర్యటనలో వెల్లడైనాయి.

**ఘటన వాస్తవాలు - పోలీసుల వక్రీకరణ**

రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా, పహాడి మండలం, బివాన్ ప్రాంతంలోని ఘట్‌మికా గ్రామానికి చెందిన ఉమర్‌ఖాన్(42), జావిద్, తాయిర్ అనే ముగ్గురు పాడిరైతులు నవంబర్ 10న ఆవులను కొనుగోలు చేసేందుకు అళ్వార్ వెళ్లారు. ముగ్గురు మూడు ఆవులను కొనుగోలు చేశారు. ఉదయం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో ఘట్‌మికాకు తిరిగి ప్రయాణమయ్యారు. ఆవులను తీసుకెళ్తున్న వ్యాన్ మార్కెట్ నుంచి బయటకు రాగానే సుమారు పదినుంచి పదిహేను మంది గో గూండాల గుంపు వెంబడించింది. దాదాపు కిలోమీటర్ వరకు వారు మోటర్ సైకిళ్లపైన వెంబడించి, గోవింద్ ఘాట్ ప్రాంతంలో ఆవుల వ్యాన్‌ను అడ్డుకున్నారు. దీంతో వ్యాన్ ఆపి దిగేలోపే మోటార్ సైకిళ్లను పక్కకు పడేసి వెళ్లి దాడికి పాల్పడ్డారు. గుంపులో ఒకడు ఏకంగా తుపాకీ (రివాల్వర్) తీసి కాల్పులు జరిపారు. దీంతో ఉమర్‌ఖాన్ అక్కడిక్కడే నేలకొరిగాడు. వ్యాన్‌లో ఉన్న జావిద్, తాయిర్ ప్రాణాలను కాపాడుకొనేందుకు అక్కడ నుంచి పారిపోయారు. ఒకరు హర్యానా వైపు పారిపోగా, మరొకరు రాజస్థాన్‌లోని జైపూర్ వైపు పారిపోయారు. ఇందులో రాజస్థాన్‌లోని జైపూర్ వైపు పారిపోయిన జావిద్ తీవ్ర గాయాలతో గ్రామానికి చేరుకున్నాడు. హర్యానా వైపు పారిపోయిన తాయిర్ ఇంకా గ్రామానికి చేరుకోలేదు. కాగా హర్యానాలో ఉన్నానని, తీవ్ర గాయాలైయ్యాయని సమాచారమిచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

అయితే తుపాకీ కాల్పులకు గురై అక్కడిక్కడే మృతి చెందిన ఉమర్‌ఖాన్‌ను అక్కడ నుంచి స్థానిక రైల్వే ట్రాక్ వద్దకు తీసుకెళ్లి కత్తితో అతి కిరాతకంగా తల నరికి రైల్వే ట్రాక్‌పై పడేశారు. బాధితుల వద్ద ఆవులు కొనుగోలు చేయగా మిగిలి ఉన్న డబ్బులను గోగూండాలు తీసుకొని, ఆవులను తోలికెళ్లిపోయారు. ఈ మొత్తం ఘటన గో గూండాలు ఉదయం ఏడు గంటల లోపే పూర్తి చేశారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు ఘట్‌మికాలో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. కానీ మృత దేహం ఎక్కడుందో తెలియదు. వెనువెంటనే కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, అళ్వార్ బయలుదేరారు. స్థానిక పోలీసులు అళ్వార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, కుటుంబ సభ్యులు కొన్ని గంటల పాటు గాలింపు అనంతరం స్థానిక రైల్వే ట్రాక్ వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు చేరుకున్న కొంత సమయానికే కుటుంబ సభ్యులు కూడా అక్కడికి చేరుకున్నారు. అయితే ఈ ఘటనను పోలీసులు చాలా తెలివిగా మిస్టరీగా మార్చేశారు. దాడి చేసి హతమార్చిన గో గూండాలపై కేసు నమోదు చేయకుండా, హత్య కాబడిన ఉమర్ ఖాన్, తీవ్రగాయాలపాలైన జావిద్, తాయిర్‌లపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని అళ్వార్ పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ధృవీకరించారని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ ప్రకాశ్ వారిని ఆవుల దొంగలుగా చిత్రీకరించారు. అందుకు వారి వద్ద మార్కెట్‌కు పన్ను చెల్లించే రసీదు లేదని తప్పుదోవపట్టించారు. వాస్తవానికి రాజస్థాన్‌లో ఆవులు అమ్మకం, కొనుగోలుపై

చట్టపరమైన నిషేధం లేదు. రాజస్థాన్ గ్రామీణ వ్యవస్థలో ఆవుల కొనుగోలు, అమ్మకంపై ఎటువంటి రసీదులిచ్చే వ్యవస్థ కూడా లేదు. ఏ రకమైన ఫిర్యాదు లేకుండా బాధితులపై అల్వార్ పోలీసులు ఆవుల స్మగ్లింగ్ పేరుతో కేసు ఎలా నమోదు చేశారనేది ప్రశ్నగా ఉంది. అల్వార్ పోలీస్, పరిపాలన వ్యవస్థ ఆలోచనా విధానం పూర్తిగా మతతత్వంతో మిళితమై ఉందనేందుకు ఇదొక చక్కటి ఉదాహరణ.

సరిగ్గా ఆరు నెలల క్రితం జరిగిన పెహ్లూ ఖాన్ హత్య సందర్భంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది. పెహ్లూఖాన్ హర్యానాకు చెందిన వాడు కాబట్టి ఇతర రాష్ట్రాలకు ఆవులు తరలించేటప్పుడు రుసుము చెల్లించాలి. అందులో భాగంగానే పెహ్లూఖాన్ ప్రభుత్వానికి రుసుము చెల్లించినట్లు రసీదు కూడా చూపించారు. కానీ పోలీసులు దాడికి పాల్పడి, హత్య చేసిన దుండగుల పై కాకుండా పెహ్లూఖాన్, ఇతర బాధితులపైనే కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఎలాగైతే బాధితుల్ని కొట్టి వారి వద్దనున్న డబ్బును తీసుకున్నారో, లక్షల రూపాయలు పోసి కొనుగోలు చేసిన ఆవులను తోలికెళ్లి పోయారో పెహ్లూఖాన్ ఘటన సమయంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది.



ఉమర్‌ఖాన్ కుటుంబ సభ్యులతో ఎఐకెఎస్ నాయకులు

ఉమర్‌ఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తొలుత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద ఉమర్‌ఖాన్ కుటుంబ సభ్యులు, సిపిఎం, ఇతర వామపక్షాలు, మానవ హక్కులు సంఘాలు, ప్రజాసంఘాలు ఆందోళన చేశాయి. ఉమర్‌ఖాన్ కుటుంబ సభ్యులు పోస్టు మార్టంను అడ్డుకున్నారు. మూడు ప్రధానమైన డిమాండ్లు జిల్లా అధికార యంత్రాంగానికి తెలిపారు. 1.ఉమర్ ఖాన్ కుంటుంబానికి రూ.50 లక్షల పరిహారం, తీవ్రగాయాలు పాలైన జావిద్, తాయర్‌కు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి. 2. ఉమర్ పిల్లలకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. 3. హంతకులను అరెస్టు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలి. ఒకవైపు బాధితులు ఆందోళన చేస్తుంటే, మరోవైపు గో గూండాలు ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను బెదిరించి పోస్టుమార్టం చేయకుండా నిలిపివేయించారు. గోగూండాల బెదిరింపులకు లొంగిపోయిన వైద్యు డు మృతదేహాన్ని జైపూర్ తీసుకెళ్లిపోవాలని సూచించాడు. దీంతో గతిలేని పరిస్థితుల్లో మృత దేహాన్ని జైపూర్‌కు తరలించారు. కానీ బాధితుల డిమాండ్లకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ససేమీరా అంది. కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. స్థానిక ప్రజాసంఘాలు ఐదు లక్షలు ఇచ్చేందుకు హామీ ఇచ్చాయి. అప్పటికప్పుడే సేకరించి రూ. 50వేలు అందజేశాయి. మిగతా రూ.4.50 లక్షలు వారంలో ఇస్తామని ప్రజా సంఘాల ప్రతినిధులు తెలిపారు. అధికార యంత్రాంగం కనీస భరోసా కల్పించే హామీ కూడా ఇవ్వలేదు. వామపక్షాలు, ప్రజా సంఘాలు ఆందోళన చేయటంతో జిల్లా యంత్రాంగం రెండు రోజులు హడావుడి చేసి, అప్పటికే అరెస్టు చేసిన ఇద్దరిని చూపించి నిందితుల్ని పట్టుకొన్నామని ప్రకటించింది. దీంతో ఆగిపోకుండా బాధితులు ఆవులను దొంగిలించారని, రెండువైపుల కాల్పులు జరిపారని ప్రకటించారు. బాధితుల స్వంత ప్రాంతం భరత్‌పూర్ జిల్లా, బివాన్ పోలీస్ స్టేషన్‌లో ఆవుల దొంగతనం పేరుతో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. అలాంటప్పుడు ఆవులు దొంగతనం అని ఎస్పీ ఎలా ప్రకటించాడు? అసలు ఆవులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన ఉమర్‌ఖాన్, మిగతా ఇద్దరి వద్దకు తుపాకీ ఎలా వచ్చింది? మిగతా ఇద్దరు అక్కడ నుంచి పారిపోతే కాల్పులు ఎవరు జరిపారు? అసలు వారి వద్ద తుపాకే లేదు. అలాంటప్పుడు రెండు వైపులా కాల్పులు జరిగాయని ఎలా పోలీస్ యంత్రాంగం ధృవీకిస్తుందని మీడియా ప్రశ్నిస్తే, దానికి పోలీస్ శాఖ నుంచి వక్రీకరణలతో కూడిన సమాధానం వచ్చింది. గోరక్షక దళం ఆవులు స్మగ్లింగ్ చేసేవారిని నిలువరించేందుకు వచ్చిం దని, వారివద్ద ఉన్న తుపాకీ ఉమర్‌ఖాన్ తీసుకొని కాల్పులు జరిపాడని కథ అల్లారు. అంటే పోలీసుల కథనం ప్రకారమే గోరక్షక్ సభ్యుల నుంచి ఉమర్‌ఖాన్ తుపాకీ తీసుకున్నారని, దాంతో కాల్పులు జరిపారని ఉంది. కాబట్టి తుపాకీ తెచ్చింది గోరక్షక్ సభ్యులని స్పష్టంగా తెలుస్తుంది. కిసాన్ సభ ప్రతినిధి బృందం ఎస్పీ రాహుల్ ప్రకాశ్‌ను కలిసి ఇదే అంశాన్ని లేవనెత్తి నప్పుడు, అతని కథ బట్టబయలైంది. "ఉమర్ ఖాన్‌కు రెండు బుల్లెట్లు తగిలాయి. ఒక ఆవుకు కూడా రెండు బుల్లెట్లు తగిలాయి. మీ వద్ద ఉన్న ఆదారాలివ్వండి. కేసు విచారిస్తాం" అని యస్పి కిసాన్ సభ బృందానికి తెలిపారు. ఆవులు కొనుగోలు చేసేందుకు అల్వారే ఎందుకు వెళ్లారంటే.. అక్కడ పెద్ద పశుమార్కెట్(సంత) ఉంది. అక్కడకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చి ఆవులు కొనుగోలు చేస్తారు. ఆ సంతలో ఒక రోజులోనే కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. దాదాపు నాలుగైదు రాష్ట్రాల పాడి రైతులు ఆ సంతలోనే ఆవులు కొనుగోలు, అమ్మకాలు నిర్వహిస్తారు. గతంలో అల్వార్‌లో హత్యకు గురైన హర్యానాకు చెందిన పాడిరైతు పెహ్లూ ఖాన్ తన కుమారుడు, మరో బంధువుతో కలసి ఆవులు కొనుగోలు చేసేందుకు అల్వార్ మార్కెట్‌కు వెళ్లారు. మూడు ఆవులను కొనుగోలు చేసి తిరిగి హర్యానా వెళ్తున్న వారిని అల్వార్‌లోని రాజస్థాన్, ఢిల్లీ రహదారిపై గో గూండాలు అడ్డుకొని దాడి చేశారు. ఈదాడిలో పెహ్లూఖాన్ మృతి చెందాడు. అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) దేశవ్యాప్తంగా నిధులు సేకరించి బాధిత కుటుంబానికి రూ.15 లక్షలను అందజేసింది. ప్రభుత్వం చేయలేని పనిని కిసాన్ సభ చేసింది. గతంలోనూ, ప్రస్తుతం జరిగిన ఘటనలు ఒకే

"ఒకవైపు బాధితులు ఆందోళన చేస్తుంటే, మరోవైపు గో గూండాలు ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను బెదిరించి పోస్టు మార్టమ్ చేయకుండా నిలిపివేయించారు. గోగూండాల బెదిరింపులకు లొంగిపోయిన వైద్యుడు మృతదేహాన్ని జైపూర్ తీసుకెళ్లిపోవాలని సూచించాడు. దీంతో గతి లేని పరిస్థితుల్లో మృత దేహాన్ని జైపూర్‌కు తరలించారు."

"దాదాపు రెండు గంటల సేపు సాగిన పరామర్శలో ఉమర్ ఖాన్ తల్లి చందర్ బీ కన్నీరు మున్నీరయింది. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తమ ఆర్థిక, సామాజిక స్థితిగతులను చెప్పుకుంటూ ఆవేదనకు గురయ్యారు. ఆ గ్రామంలో ఎక్కడ చూసిన ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లే దర్శనమిస్తాయి. అదే వారి సంపద. ఉమర్ ఖాన్ కుటుంబం చాలా పేదరికంలో ఉంది."

విధంగా ఉన్నాయి. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిని మతోన్మాద సంఘాలు ప్రణాళిక బద్ధంగానే హత మారుస్తున్నాయి. ఆయా సంఘాలకు ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండ కూడా ఉంది.

**దుర్భర జీవనం**

ఘట్‌మికా గ్రామంలో ఉమర్‌ఖాన్ తల్లి చందర్ బీ(70), తండ్రి సహవుద్దీన్, కుమారుడు మక్షుదిఖాన్, చిన్నాన్నలు రిజియాఖ్, ఇలియాస్ తదితర కుటుంబ సభ్యులను కిసాన్ సభ ప్రతినిధి బృందం పరామర్శించింది. దాదాపు రెండు గంటల సేపు సాగిన పరామర్శలో ఉమర్ ఖాన్ తల్లి చందర్ బీ కన్నీరు మున్నీరయింది. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు తమ ఆర్థిక, సామాజిక స్థితిగతులను చెప్పుకుంటూ ఆవేదనకు గురయ్యారు. ఆ గ్రామంలో ఎక్కడ చూసిన ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లే దర్శనమిస్తాయి. అదే వారి సంపద. ఉమర్‌ఖాన్ కుటుంబం చాలా పేదరికంలో ఉంది. వారు నివశించే ప్రాంతం కూడా చాలా వెనుకబడి ఉంది. ఆ గ్రామ ప్రజలంతా కేవలం పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ గ్రామంలో పాల ఉత్పత్తి ఒక్కటే వారి రోజువారి పని. చిన్న కమతాల్లో భూమి ఉన్నప్పటికి పాల ఉత్పత్తిపైనే ఆధారపడతారు. తమ భూములలో పశుగ్రాసం పెంచుతారు. ఆ ప్రాంతంలో అడుగుపెట్టినప్పటి నుంచి తిరిగి వచ్చే దాక అడుగడుగునా వెనుకబాటు తనం దర్శనమిచ్చింది. భరత్‌పూర్ జిల్లా ఘట్‌మికాకు చేరుకోవాలంటే జాతీయ రహదారి నుంచి దాదాపు 70 కిలోమీటర్లు లోపలకి వెళ్లాలి. 70 కిలో మీటర్ల పొడువున ఉన్న గతుకుల రోడ్డుకు ఇరువైపుల చిన్న చిన్న ఇళ్ళున్నాయి. పాతకాలాన్ని సూచించే చిన్న టీ షాపుల్లో పది మంది కూర్చొని టీవి చూసే దృశ్యాలు కనిపించాయి. ఈ ప్రాంతంలో ముస్లీం నివాసాలు అధికంగా ఉన్నాయి. స్థానిక బిజెపి ప్రభుత్వ అభివృద్ధి ఏంటో అక్కడ స్పష్టంగా కనబడుతున్నది. దేశ రాజధాని, రాష్ట్ర రాజధాని అతి దగ్గరగా ఉన్న ఈ ప్రాంతం వెనుకబడి ఉండటం, అభివృద్ధికి నోచుకోకపోవడం విస్మయానికి గురిచేసింది. సామాజిక, ఆర్థిక వివక్ష స్పష్టంగా కనబడుతుంది. సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లుతున్న ఈ రోజుల్లో సోకాల్డ్ బిజెపి ప్రభుత్వ హయంలో పాలన సాగుతున్న రాజస్థాన్‌లో దుర్భరమైన పరిస్థితులు, రోడ్లు దర్శనమిచ్చాయి. డ్రైనేజీ వ్యవస్థ కంటికైనా కనిపించదు. చిన్నపిల్లల బాల్యం బురదలోనే ముగుస్తున్నది. చదువుకు ఆమడ దూరంలో పిల్లలున్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి మచ్చుకైన కనబడదు. శ్మశానాల పక్కనే నివాసాలున్నాయి. ఒక రకంగా శ్మశానాల్లోనే వారి జీవనం సాగుతుందని చెప్పాలి. ఆగ్రామంలో పక్కా గృహాలు ఒకటి రెండు మినహా కనిపించవు. గ్యాస్ కనెక్షన్లు మచ్చుకైన లేవు. కేవలం పశువుల పేడతో తయారు చేసే పిడకల ను వంటకు ఉపయోగిస్తారు. వీధిలైట్లు ఉండవు. చూద్దామన్నా విద్యుత్ స్తంభాలు కనిపించవు. ఇలాంటి దుర్భర జీవితాన్ని రాజస్థాన్‌లోని ఘట్‌మికా ప్రజలు అనుభవిస్తున్నారు. ఉమర్ ఖాన్ గ్రామంలో 450 కుటుంబాలు నివశిస్తు న్నాయి. అందులో 400 ముస్లీం, 50 హిందూ కుటుంబాలున్నాయి. హిందూ, ముస్లీం కుటుంబాలన్నింటికి పాల ఉత్పత్తే ప్రధాన జీవనాధారం. కొన్ని కుంటుంబాలకు 50 నుంచి 100 వరకు ఆవులు, గేదెలు ఉన్నాయి. ఒక లీటర్ పాల ధర కేవలం రూ.20 ఉంది. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఇది అతితక్కువ ధర. పాల ద్వారా వచ్చిన మొత్తంలో ఎక్కువ శాతం పశువుల పెంపకానికి ఖర్చు అవుతుంది. మిగిలిన డబ్బుతో ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉందని స్థానికులు తెలిపారు. ఆ గ్రామాలను ప్రభుత్వం పట్టించుకోలేదని స్పష్టంగా కనబడుతున్నది. మరోవైపున అన్ని రాష్ట్రాల్లో వలెనే ఇక్కడ కూడా భూ ఆక్రమణలు సాగుతున్నాయి. మాఫియా రాబందులు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయి. 15 కిలోమీటర్ల పొడువున పెద్ద కొండ ఉంది. అక్కడ మాఫియా ఆధ్వర్యంలో క్వారీ సాగుతున్నది. కొండను పూర్తిగా తొలిచేశారు. స్థానిక బిజెపి ఎమ్మెల్యే అభివృద్ధి గురించి మాట్లాడరు. ఆయనకు క్వారీ మాఫియాలో వాటాలున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**పురుషాధిక్య సమాజం**

సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమైన ఈ రోజుల్లో కూడా ఆయా ప్రాంతాల్లో పురుషాధిక్యత కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. స్త్రీలు ఏ ఇతర మగవారితో మాట్లాడటానికి లేదు. సభలకు హాజరు కావడానికి లేదు. ఇళ్లవద్ద పనులు మాత్రమే చేయాలి. ఆవులకు దాణ పెట్టడం కూడా స్త్రీల పనే. కిసాన్‌సభ బృందం పర్యటించిన సందర్భంలో ఒక్క మహిళ కూడా అక్కడకు రాలేదు. చిన్న పిల్లలైన ఆడవారిని కూడా అక్కడకు రానీయలేదు. ప్రత్యేక అనుమతితో ఉమర్ ఖాన్ తల్లి చెందర్ బీ(70)ను కిసాన్ సభ బృందం కలిసింది. ముస్లీం కుటుంబాల్లోనే కాదు, హిందూ కుంటుబాల మహిళలు కూడా మగ వారికి ఆమడదూరంలో ఉంటారు. ఎదుటి వారు చూడకుండా తమ మొహాలను చీరతో కప్పుకుంటారు. కిసాన్‌సభ బృందం పర్యటనను పాత సినిమాల్లోలానే కిటికిల్లోంచి ఆడవారు చూసే ప్రయత్నం చేశారు. అభివృద్ధికి నోచుకోకపోవడమే వారు ఆ దుస్థితిలో ఉండటానికి ప్రధాన కారణం. సంఘపరివార్ కూడా ఇలానే ఉండాలనుకుంటుంది. బిజెపి, సంఘపరివార్ సిద్ధాంతమే అది. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!
**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

విశ్లేషణ

# వెనిజులా బొలివేరియన్ విప్లవం గుణపాఠాలు



రచయిత
పాత్రికేయులు

**స్టీవ్ ఎల్నర్**

రెండు దశాబ్దాలుగా సాంఘీకంగా, రాజకీయంగా పూర్తి భిన్నధృవాలుగా కేంద్రీకృత మయి, మితవాదుల విద్రోహాలు పెచ్చురిల్లు తున్న వెనిజులా అనుభవాలు వామపక్ష వాదు లకు గొప్ప గుణపాఠాలు. బొలివేరియన్ విప్లవం సాఫల్యాలను, వైఫల్యాలను, పోరాటాలను నిర్మా ణాత్మకంగా చర్చించుకునేందుకు ఇప్పుడు ప్రభు త్వం ఎదుర్కొంటున్న సంక్షోభం ఒక అవకాశం. చావెజ్ మద్దతుదారులు, సానుభూతిపరుల ఎత్తుగడలలో తప్పులను ఎత్తి చూపి నికోలస్ మదురో ప్రభుత్వం మితవాదుల నుండి, అతి వాదుల నుండి ఎదుర్కొంటున్న తీవ్రమయిన దాడుల నుండి తప్పించి, సరైన దారిలో పెట్ట వచ్చు. ఈ వ్యాసానికి రెండు లక్ష్యాలున్నాయి. ఛావెజ్ పరిపాలనలో నేర్చుకున్న కొన్ని గుణ పాఠాలను వెలుగులోకి తేవడం, ప్రభుత్వం యొక్క ప్రశ్నార్ధక చర్యలను సరైన చారిత్రక, రాజకీయ నేపథ్యంలో చూడడం. ప్రజాస్వామిక వ్యవస్థలో పనిచేస్తున్న ప్రభుత్వ పరిపాలన అసమర్ధమయినది అనే అవగాహన సోషలిజాన్ని ప్రజాతంత్రయుతంగా సాధించడంలోని సంక్లి ష్టతను పట్టించుకోక పోవడం అవుతుంది. ఈ ప్రక్రియలోని అపాయాలు, అవసరాలు ప్రభుత్వ నిర్ణయాలను మలిచాయి. ఈ సంక్లిష్టతలను అవ గాహన చేసుకున్నప్పుడే వెనిజులా ప్రస్తుత పరి స్థితిని, ఇటీవలి చరిత్రలోని కల్లోలాలను అర్ధం చేసుకోగలం.

**ఒకరి పక్షం వహించడం**

గత కొద్దిరోజులుగా దేశ రాజకీయాల తీవ్రత పెరుగుతుండడంతో వెనిజులాలోని మరియా సోషలిస్టు లాంటి వామపక్ష గ్రూపులు పాలక యునైటెడ్ సోషలిస్టు పార్టీ నుండి వైదొలి గాయి. విదేశీ పరిశీలకులు చావిస్తా క్యాంప్‌కు దూరంగా ఉన్నారు. ఇప్పుడు ఎక్కువమంది మిత వాదులను, మదురోను కూడా వ్యతిరేకించడాన్ని సమర్ధించుకుంటున్నారు. వారు లేవనెత్తిన కొన్ని అభ్యంతరాలు వాస్తవమయినప్పటికీ, మాజీ చావిస్తాలు ప్రభుత్వాన్ని, ప్రతిపక్షాన్ని ఒకేగాటన కట్టి విమర్శించడం అంటే మితవాదులు చేసే దాడిని అర్ధం చేసుకోకపోవటమే. ప్రభుత్వం నిరంతరంగా దాడులను ఎదుర్కొంటున్నందు వలన, కొన్ని అత్యవసర నిర్ణయాలు తీసుకో వలసిన పరిస్థితికి నెట్టబడటం, అవి దీర్ఘకాల ప్రయోజనాలకు భంగం కలిగించాయన్న నిజాన్ని అర్ధం చేసుకోకపోవడమే. అయితే ఈ దృగ్విషయం కొత్తదేం కాదు. హ్యూగో చావెజ్ మొదటిసారి అధికారం హస్తగతం చేసుకున్న 1999 నుండి చావెజ్ ప్రభుత్వం కూడా నిరం తరంగా దాడిని ఎదుర్కొంటూనేఉంది. ఎన్ని కయిన ప్రభుత్వాలు కొన్ని మాత్రమే ఈ మధ్యకాలంలో ఇంత తీక్షణమయిన ఎదురు దాడిని, ఇంత ఎక్కువ కాలం ఎదుర్కొన్నాయి. ఇంత వైవిధ్యమయిన, శక్తివంతమయిన శత్రువులను ఎదుర్కొన్నాయి. సాధారణంగా ఉండే రాజకీయ ప్రత్యర్ధులు కార్మికసంఘాలతో పాటు వెనిజులాలోని పెద్ద కార్పొరేషన్లు, వ్యాపా రులు, అమెరికా ప్రభుత్వం, అమెరికా ఖండం లోని దేశాల సంఘం, కాథలిక్ చర్చి మత గురువులు, విశ్వవిద్యాలయ అధికారులు, వార్తా ప్రచార మాధ్యమాలు కూడా ప్రత్యర్ధుల జాబితా లో చేరారు. ఇక 2002 లో అమెరికా అండతో వ్యాపార ప్రయోజనాల కొరకు జరిగిన ఆకస్మిక తిరుగుబాటు, 2002-2003 లో రెండు నెలలు కొనసాగిన జాతీయ లాకౌట్లు, 2002 నుండి నేటి వరకు అంచెలంచెలుగా కొనసాగుతున్న పట్టణ పారా మిలిటరీ హింస, అంతర్జాతీయ పరిశీలకులు ధ్రువీకరించినా, అధికారికంగా ప్రకటించబడిన ఎన్నికల ఫలితాలను ప్రతిపక్షం దాని మిత్రులు తిరస్కరించడం ఈ శత్రుత్వ చర్యలలో కొన్ని. చావెజ్ ఆకర్షణ మదురో నాయకత్వంలో లేనందువలన పోరాటాలు మరింత ఉధృతమయ్యాయి. ప్రస్తుత సంక్షోభ సమయంలో పెరుగుతున్న అప్పులు, అధిక ధరలు, చమురు ధరల తరుగుదల ప్రభుత్వాన్ని మరింతగా దెబ్బతీశాయి. 2013 ఏప్రిల్‌లో మదురో ఎన్నికైన రోజున, ఓడిపోబోతున్న అభ్యర్థి హెన్రిక్ కాప్రిల్ ప్రతీకారం తీర్చుకోమనితన మద్దతుదారులకు పిలుపునిచ్చాడు .ఫలితంగా ఒక పోలీస్‌తో సహా పదిమంది చావెజ్ మద్దతు దారులు హతులయ్యారు. 2003లో వెనిజులాలో జరిగిన పారామిలటరీ రాజకీయ హింసను అక్కడ ' గారింబ'గా పిలుస్తారు. ఈ హింస మదురో కాలంలో మరింత పెరిగింది. 2014 లో మూడు నెలలపాటు వీధులలో సాగిన నిర సనలలో సాయుధ ప్రైవేటు దళాలు పాల్గొన్నా యి. ఆ తరువాత ఇవి మరింత సైనికీకరించ బడ్డాయి. చావెజ్, మదురోలకు వ్యతిరేకంగా ఉన్న వాషింగ్టన్ విదేశాంగ విధానాన్ని గమనిస్తే రిపబ్లికన్లకు, డెమోక్రాట్లకు పెద్ద తేడా ఏమి లేదనిపిస్తుంది. 2002-03లో జరిగిన సాధా రణ సమ్మె, తిరుగుబాట్లను బుష్ ప్రభుత్వం మన స్ఫూర్తిగా సమర్ధించింది. ఒబామా అధికారానికి వచ్చిన కొత్తలో ఆయన ఛావెజ్‌ని కలిసి ఎదురదొ గలీనో వ్రాసిన 'ఓపెన్ వెయిన్స్ ఆఫ్ లాటిన్ అమెరికా ' పుస్తకాన్ని బహుకరించడంతో కొంత ఆశలు చిగురించాయి. కాని ఆయనే ఆ తరు వాత కాలంలో ఛావెజ్ ప్రభుత్వం వెనిజులా జాతి రక్షణకు ఒక 'అసాధారణ ముప్పు' అని రెండు సార్లు అధికారికంగా ప్రకటించాడు. ఇక ట్రంప్ అయితే మదురోకి వ్యతిరేకంగా 'సైన్యాన్ని ఉ పయోగించడాన్ని' గురించి చాలా సాధారణ విషయంగా మాట్లాడాడు. వెనిజులా ప్రభుత్వ మార్పిడి గురించి మెక్సికో, కొలంబియాలతో మాట్లాడినట్టు కొత్తగా నియమించబడిన సిఐఏ డైరెక్టర్ మైక్ పాంపియో ఒప్పుకున్నారు. ఈ బెదిరింపుల స్థాయి, పరిమాణం వెనిజులాను నేటి రాజ్యాంగబద్ధమైన ప్రజాతంత్ర దేశాలలో ప్రత్యేకంగా నిలుపుతాయి. కానీ వాటి నుండి నేర్చుకునే పాఠాలు మాత్రం సార్వజనీనం. చావె జ్ వెళ్లినంత దూరం వెళ్లగలిగితే అధికారంలో

> **"సామాజిక, రాజకీయ వాస్తవ పరిమితులను పక్కకుపెట్టి కేవలం సామాజిక ప్రజాతంత్ర విప్లవక్రమం సాధనను అంతిమ లక్ష్యంగా భావిస్తే దానిని సాధించటం కష్టసాధ్యమౌతుంది. ఛావెజ్ అభిమానులు వెనిజులలోగాని, బయటగాని ఉత్తమ లక్ష్యాలను, తక్షణ సవాళ్లకన్నా తక్షణ సవాళ్లను ముందుంచడం భ్రమలు వీడినట్లు అనుకో డానికి అవకాశం కల్పిస్తున్నది."**

ఉన్న వెనిజులా వామపక్షవాదులు ఎదుర్కొం టున్న సవాళ్ళనే సోషలిజానికి బద్ధులైన ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వమయినా ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ దృష్టితో చూసినట్లయితే ప్రజా స్వామ్య దేశాలలోని వామపక్షవాదులకు వెనిజు లా అనుభవం దాని విజయాలు, అపజయాలతో సహా, రష్యా చైనా క్యూబా విప్లవాలకన్నా ఎక్కువ గుణపాఠాలు నేర్పుతాయి. ఇంకా ముఖ్యమయిన విషయం ఏమిటంటే, వెనిజులా అనుభవం ఎన్నికల ద్వారా సోషలిజాన్ని సాధించాలనుకునే వారికి అది కత్తిమీద సామే అని ప్రత్యక్షంగా నిరూపిస్తున్నది. ఛావెజ్ ప్రభుత్వం వాస్తవికత పేరుతో క్రూరులైన శత్రువుల మధ్యనుంటూ వారికి కొన్ని రాయితీలు ఇవ్వక తప్పని పరిస్థితి, వ్యాపార వర్గంతో పొత్తులు పెట్టుకోవలసిన పరిస్థితి ఒకవైపు– వీరితో పొత్తులో సర్వ సాధా రణంగా వారి ప్రయోజనాలే నెరవేర్చబడతాయి – మరో వైపు జనరంజక విధానాలు అమలు పరచాలి. సామాజిక సంక్షేమ ఖర్చులకు వెను కాడకూడదు. వీటిలో కొన్నింటిలో అవినీతి చోటు చేసుకుంది. అమూల్యమయిన వనరులు వృధాగా ఖర్చయ్యాయి. మరోవైపు సామాజిక ఉద్యమాల ద్వారా మార్పును తెస్తామని, సామా జిక ఆదర్శాలను అమలు చేస్తామని పెద్ద సంఖ్య లో కార్యకర్తలను, మద్దతుదారులను చావెజ్ ప్రభుత్వం సమీకరించింది. ఇటువంటి పరిస్థితి లో చాలాసార్లు విప్లవం రెండో వైపు మళ్లడానికి బదులుగా మొదటి వైపుకే మళ్లిందని నేను ఋజువు చేయదలిచాను. అంటే వెనిజులా ప్రభుత్వం అవకాశవాదం ప్రదర్శించిందని గాని, తక్షణ లాభాలను అపేక్షించిందనిగాని కాదు. వెనిజులాలో వామపక్షాలకు ఎంపిక చేసుకునేం దుకు చాలా పరిమితమయిన దారులు మాత్రమే ఉన్నాయి. చావెజ్ గాని మదురోగాని పాలనలో తమకు చాలా అనుకూలంగా ఉన్న సందర్భా లలో మార్పుకు కావలసిన లక్ష్యాలను అత్యంత వేగంగా అమలుచేయాల్సిన పరిస్థితి. అమలు చేసే కాలం అత్యంత ప్రధాన మయినది. చావిస్తా ఉద్యమం ప్రస్తుతం చర్చిస్తున్న విషయా లన్నీ దీర్ఘకాల లక్ష్యాల సాధన గురించి కాదు. వాటినెలా సాధించాలన్నదాని పైనే. సామాజిక, రాజకీయ వాస్తవ పరిమితులను పక్కకుపెట్టి కేవలం సామాజిక ప్రజాతంత్ర విప్లవక్రమం సాధనను అంతిమ లక్ష్యంగా భావిస్తే దానిని సాదించటం కష్టసాధ్యమౌతుంది. ఛావెజ్ అభి మానులు వెనిజులలోగాని, బయటగాని ఉత్తమ లక్ష్యాలను కన్నా తక్షణ సవాళ్లను ముందుం చడం భ్రమలు వీడినట్లు అనుకోడానికి అవ కాశం కల్పిస్తున్నది. బొలివేరియన్ విప్లవశక్తి ఛావెజ్ యొక్క ఆకర్షణ శక్తిపైన, దృష్టిపైన ఆధార పడింది. దురదృష్టవశాత్తు చావెజ్ తన అను యాయులను తీవ్రమయిన మార్పుకు ఎంత గానో అవసరమయిన కష్టాలను, ముళ్ళతో నిండిన బాటలో ఎదురయే వైరుధ్యాలను ఎదు ర్కొనేందుకు, త్యాగాలు చేసేందుకు సిద్ధం చేయలేదు. ఈవిషయాలలోని సాధ్యాసాధ్యాలు, సమయాలను దృష్టిలో ఉ ంచుకుని విశ్లేషించడం జరుగుతుంది.

**బూర్జువాలలో వైరుధ్యాలు**

చావెజ్ చావిస్తా ఉద్యమం వాస్తవం, ఆదర్శాల సమ్మిళితం. 'ప్రతిఒక్కరికి వారి అవసరాలకు తగినట్టు' వెనిజులా సోషలిజం మౌలిక సూత్రం అని చావెజ్ ప్రకటించాడు. సోవియెట్ నాయకులు కూడా అంత దూరం వెళ్ళలేదు. మార్క్స్ లాగా వారు కూడా 'ప్రతి ఒక్కరికి వారు దోహదం చేసినంత లభిస్తుందనే దానితో ఆగిపోయారు. కానీ చావెజ్ తన సైనిక నేపథ్యం వలన వాస్తవ వాది, వ్యూహకర్తకూడా. 2002–03లో తన ప్రభుత్వాన్ని పడదోయ డానికి వ్యాపారులు ప్రోత్స హించిన రెండు నెలల లాకౌట్ తరువాత చావెజ్ దిగుమతుల కొరకు ఇచ్చే డాలర్ల మారకం రేటు తగ్గిస్తున్నట్టు ప్రకటించాడు. ఆ తరువాతి కాలంలో ఛావెజ్ రెండునెలలు జరిగిన లాకౌట్‌లో పాల్గొనని, అభివృద్ధి నిరోధక వ్యాపారస్తులను వ్యతిరేకించే వారికి ప్రత్యేకంగా మద్దత్తు నివ్వడం కొనసాగించాడు. ఆ విధంగా అభివృద్ధి నిరోధక వ్యాపారులు ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెట్టే ప్రయ త్నాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. అభివృద్ధి నిరోధక బూర్జువాలకు, ప్రభుత్వంతో స్నేహ పూర్వకంగా వ్యవహరించే బూర్జువాలతో వ్యవహరించే తీరులో తేడాను మదురో కాలం లోనూ కొనసాగించారు. వెనిజులా ఛాంబర్ ఆఫ్ కామర్స్ లోని ఫెడీకెమెరాస్ గ్రూప్‌లో మొదటి తరగతి వారు ప్రతిపక్షానికి దూరంగా ఉన్నారు. పాక్షిక పోరాటం నడుపుతున్నట్టు కనిపించ కుండా ఉండడానికి ప్రతిపక్షం ఒప్పుకోనప్పుడు కూడా మదురో ప్రభుత్వంతో చర్చించడానికి సిద్ధపడ్డారు. అయితే ఫెడీకెమెరాస్ ఎప్పుడూ పక్షపాతానికి అతీతంగా లేదు. జులైలోరాజ్యాంగ అసెంబ్లీకి ప్రభుత్వ డెలిగేట్లను ఎంపిక చేసే సమ యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షంతో కలవడమే కాదు. అంతకు ముందు వారాలలో ప్రతిపక్షం పిలుపు నిచ్చిన సాధారణ సమ్మెకు సహితం మద్దత్తు నిచ్చింది. ప్రతిపక్షానికి సంఘీ భావం తెలపడానికి ఫెడీకెమెరాస్ సభ్యులు తమ ఉద్యోగులు సమ్మెలో పాల్గొనేందుకు అవకాశం ఇచ్చారు. ఫెడీకెమెరాస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్నేహపూర్వక వ్యాపారులకు అనుకూలంగా ఉ ండడం చావిస్తా నాయకత్వానికి తప్పలేదు. ప్రభుత్వాన్ని పడదోసేవారికి ప్రభుత్వ నిధులతో కట్టే ప్రాజెక్టుల కాంట్రాక్టులు ఎందుకివ్వాలి? ఆర్థిక సంస్థలలో అంతర్గత జోక్యం 2009లో బ్యాంకింగ్ రంగంలో సంక్షోభానికి కారణ మయింది. చావెజ్ డజన్ల కొద్దీ వ్యాపారులను అరెస్ట్ చేయమని స్వయంగా ఆదేశించవలసి వచ్చింది. అత్యంత ధనికుడు, చావిస్తా మద్దతు దారుడు రికార్డో ఫెర్నాండెజ్, చావెజ్ కుడిభుజం వంటి వాని అన్న, 1992 నాటి విఫలమయిన తిరుగుబాటులో ప్రముఖుడు ఆర్నేచాకో మూడేళ్ళ జైలు శిక్ష అనుభవించ వలసి వచ్చింది. కానీ వెనిజులాలో అవినీతి, చట్టవ్యతిరేక కార్యకలా పాలు అంతం కాలేదు. చావెజ్‌కి ఎంతో నమ్మక మయిన మంత్రి జార్జి గిర్డని అనవసరమైన దిగుమతుల కోసం 20 బిలియన్ డాలర్లు చెల్లించినట్లు 2013లో ఒప్పుకున్నాడు. ఆ నేరానికి చర్యలు తీసుకుంటానని మదురో వాగ్దా నం చేసినా చర్యలేమి తీసుకోలేక పోయాడు. కానీ అతని అధ్యక్ష కాలంలోనే వేలెంటైనా నగర మేయర్, చవిస్తా గవర్నర్, ముఖ్యమయిన ఆ దేశ కంపెనీ అధ్యక్షుడు వివిధ ఆరోపణలపై అరెస్ట్ చేయబడ్డారు. ఉత్తర వెనిజులాలో దేశ

చమురు సంస్థల అధికారులు ఎందరినో అరెస్ట్ చేశారు. 2017లో మాజీ గవర్నర్ ఒకరికి 18 సంవత్సరాల జైలుశిక్ష పడింది. అయితే ఈ చర్యలేవి అవినీతికి అడ్డుకట్ట వేయలేక పోయాయి. అవినీతి సాధారణ విషయమయింది. నగ్నంగా కనిపించడం మొదలయింది.

**ప్రైవేటురంగంతో సంబంధాలు**

చావిస్తా ప్రభత్వంతో స్నేహ పూర్వకంగా వ్యవహరించే వ్యాపారులపై వామపక్షంలోని రెండు ప్రత్యర్థి గ్రూపులకు అభ్యంతరాలు ఉన్నాయి. వామపక్షవాదులలో కొందరు దీనిని చనిస్తా నాయకత్వం సరళంగా వ్యవహరించడం గాను, ఇంకా చెప్పాలంటే అమ్ముడు పోవడంగా చూస్తున్నారు. రెండు చావిస్తా ప్రభుత్వాల వ్యూహా త్మక స్నేహాన్ని, ఫెడీకెమెరాస్‌తో సంబంధాలను, సమావేశాలను లూయిా బిల్బావు అనే అర్జెంటీ నా రచయిత, చావెజ్ అభిమాని ఎంతో సందే హంతో చూశాడు. ముఖ్యంగా వెనిజులా కమ్యూ నిస్టు పార్టీ విధానాన్నే సందేహించాడు. మరోవైపు కొంతమంది వామపక్షవాదులు బూర్జువాలతో మరింత అనుబంధాన్ని కోరుకున్నారు. అంతకు ముందున్న ప్రాథమిక పరిశ్రమలు, గనుల మంత్రి విక్టర్ అల్వరెజ్ ప్రభుత్వ పరిమాణాన్ని తగ్గించడానికి, ప్రైవేటు భాగస్వామ్యం పెంచడా నికి దిగుమతులను తగ్గించడానికి అనుకూలం. మదురో 2016లో మిగుల్ పెర్జ్‌బాడ్‌ని వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రిగా తొలగించడాన్ని అల్వరెజ్ వ్యతిరేకించాడు. పెర్జ్‌బాడ్ మదురో క్యాబినెట్‌లోని ఒకే ఒక వ్యాపార వేత్త. ఇతనే నష్టాలలో ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించాలన్న ప్రతిపాదనను పెట్టాడు. ఇది చావిస్టా పిడివాదులను అసహనానికి గురి చేసింది. రెండువైపుల నుండి చేసిన వాదనలు సమర్ధనీయం కాదు. ప్రైవేటు రంగం అవసరమే. అయితే దీర్ఘకాలంలో దాని వలన వచ్చే నష్టాలను అంచనా వేయాలి. వాటిని అధిగమించే మార్గలను అన్వేషించాలి. మరోవైపు చావిస్తా ప్రభుత్వాలకు సహకరిస్తున్న పెట్టుబడిదారులలో కొంతమంది, దేశ ఆర్థిక స్వతంత్రతకు మద్దత్తునిస్తున్నట్టు చెప్పుకుంటున్న వారు, ఇంకా చెప్పాలంటే సామ్రాజ్యవాదులను వ్యతిరేకిస్తున్నట్టున్నవారు, పాత కొమింటో ప్రభుత్వ 'అభివృద్ధి కాముక బిల్లు' ప్రచారకులు. ప్రైవేట్‌రంగంతో ప్రభుత్వ సంబంధాలను వ్యూహాత్మకంగా పరిగణించకూడదు. మార్పు సాధించే క్రమంలో ఆ లక్ష్య సాధనకు అవసరమయిన ఆర్థిక, రాజకీయ స్థిరత్వం సాధించేందుకు ఒక ఎత్తుగడగా చూడాలి. అధికార మార్పు జరిగేందుకు అవకాశం ఉన్నట్టు తెలిసిన మరుక్షణంలో, ప్రభుత్వానికి అనుకూలంగా చెప్పుకుంటున్న వ్యాపార వర్గం చావిస్తా ప్రభుత్వాన్ని వదిలి వేస్తారని అనేకసార్లు హెచ్చరించడం జరిగింది. ఆ హెచ్చరికలు నిజమేనని ఈ మధ్య జరుగుతున్న సంఘటనలు నిరూపిస్తున్నాయి. చావెజ్‌కు అత్యంత నమ్మకస్తుడు, ఫెడీకెమెరాస్‌కు నాయకత్వం వహించినవాడు, పోర్క్ పరిశ్రమ అధిపతి అయిన అల్బెర్టో కాడిమాన్ ఇప్పుడు మదురోకి పచ్చి వ్యతిరేకి అయ్యాడు. అయితే వాస్తవ పరిస్థితులు ఒకేసారి పెట్టుబడిదారులందని వదిలించుకునేటట్టులేవు. ఎదిరించేటట్టూ లేవు. పెట్టుబడిదారీ విధానం వెనిజులాలో మరి కొన్నాళ్లు ఉంటుందనుకుంటే ప్రభుత్వం ముందు రెండే దారులున్నాయి. పెట్టుబడి దారులందరిని ఒకే గాటన కట్టడం, వారిలో తలెత్తే విబేధాలను తమకనువుగా మలుచుకోవడం. 1998 ఎన్నికలకు ముందే ఫెడీకెమెరాస్‌లో మార్పు వచ్చింది – రాజకీయంగా తటస్థంగా ఉండడం దగ్గరి నుండి పూర్తి చావెజ్ వ్యతిరేకిగా మార్పు – ఈ వ్యాపారుల సంఘం శత్రువైఖరిని వ్యతి రేకించే వారితో ప్రభుత్వం సంబంధాలు పెట్టు కోకపోవడం తెలివి తక్కువతనం అనిపిస్తుంది. మాజీమంత్రి పేరే ఆబాడ్ కాక, ఇప్పటి పెద్ద జాతీయ బ్యాంకు ఆధ్యక్షుడు ఆస్కార్ శామ్యూల్ మరో నమ్మకమయిన వ్యాపార మిత్రుడు. శామ్యూల్ ప్రముఖ పబ్లిక్ పోల్స్ నిర్వహించే సంస్థ అధిపతి. ఈయన సర్వేలనే చవిస్తా వారు ఎప్పుడు ఉటంకిస్తూ ఉంటారు. ఈయన 2017 జులై 30 న జరిగిన నేషనల్ కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీకి ప్రతినిధిగా ఎన్నుకోబడ్డాడు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ప్రభుత్వం ఎక్కువగా సబ్సిడీలను ఇస్తున్న కంపెనీలను అమ్మమని సలహా ఇచ్చినది ఈయనే. ఈ ప్రతిపాదన చావిస్తా సమర్ధకులకు కంటగింపుగా ఉండింది. వారు దీనిని చావిస్తా వారసత్వాన్ని దెబ్బతీసేదిగా చూశారు. 2017 ఆగస్టు 9 వతేదిన ఇచ్చిన ఒక ఉపన్యాసంలో శామ్యూల్ మార్కెట్ల ప్రాధాన్యతను గుర్తించామన్నాడు. ధరల పెంపుదలపై విధించిన ఆంక్షలను తొలగించామన్నాడు. ఇవి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడవు. ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా క్షిణించిపోయింది. అయితే వెనిజులా పెట్టుబడిదారీ విధానం అమలు చేస్తున్నందువలన శామ్యూల్ సూచించిన సలహాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయలేదు. వ్యాపారులతో సన్నిహిత సంబంధాలు ఎత్తుగడలలో భాగం కావచ్చు. కానీ వాటి వల్ల వచ్చే నష్టాలూ, అవినీతి, ఆశ్రిత పక్షపాతం ఉంటాయని గుర్తించాలి. వాటిని ఎదిరించాలి. వెనిజులా ఉదాహరణను చూస్తే ఇవి తప్పనిసరి అని స్పష్టమౌతుంది. ఉదాహరణకు ప్రజాపనుల కాంట్రాక్టులలో టెండర్లకు పారదర్శకతను అమలు చేయడం అంటే అధిక

**"మార్పు సాధించే క్రమంలో ఆ లక్ష్య సాధనకు అవసరమయిన ఆర్థిక, రాజకీయ స్థిరత్వం సాధించేందుకు ఒక ఎత్తుగడగా చూడాలి. అధికార మార్పు జరిగేందుకు అవకాశం ఉన్నట్టు తెలిసిన మరుక్షణంలో, ప్రభుత్వానికి అనుకూలంగా చెప్పుకుంటున్న వ్యాపారవర్గం చావిస్తా ప్రభుత్వాన్ని వదిలి వేస్తారని అనేకసార్లు హెచ్చరించడం జరిగింది."**


వెనిజులా విప్లవనేత హ్యూగో చావెజ్

> **"చావెజ్ నాటి ప్రజారంజక శక్తిని పునరుద్ధరించుకోడానికైనా, ఈమధ్యవచ్చే మితవాద ప్రతి ఘటనను ఎదుర్కోడానికయినా చావిస్తా కార్యక్రమాలకు అవకాశం కల్పించడం, పార్టీ యంత్రాంగానికి ఇంకా అంటిపెట్టుకుని ఉన్న నమ్మకమైన పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు అనుకూల పరిస్థితులు కల్పించడం తెలివైన వ్యూహమే."**

చెల్లింపులను అదుపు చేయడం. కానీ అది అమలు కాలేదు. సాంప్రదాయ వ్యాపారస్తులే ఈ కాంట్రాక్టులలో అధిక శాతం పొందుతున్నా రనేది చావిస్తాల వాదన. వారికున్న అనుభవం వలన, అధిక పెట్టుబడుల వలన వారే పొంద గలుగుతున్నారు. అందులోని భాగమే ఓడ్బ్రేక్ కాంట్రాక్ట్. వీరికి లులా డా సిల్వా వర్కర్స్ పార్టీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాల కారణంగా వర్కర్స్ పార్టీ కూడా ఇబ్బందులలో పడింది. అనేకమంది రాజకీయ నాయకులు ఇరుక్కున్నారు. ఇదంతా సమర్ధవంత మయిన సంస్థాగత మార్పులను చేపట్టాలని సూచిస్తున్నది.



వెనిజులా అధ్యక్షులు నికొలస్ మదురో

### పార్టీ –దేశం

2017 మొదటిలో చావెజ్ పిఎస్‌యువి ని నిర్మించాడు. దీనిలో వెంటనే 70 లక్షల మంది సభ్యులుగా చేరారు. దీనివలన 1999లో రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజలు పాల్గొనే ప్రజాస్వామ్యం అనే కొత్త రాజకీయ ఆకారం ఏర్పడుతుందని అనుకున్నారు. మితవాద శక్తులతో కూడుకున్న పాత రాజ్యాన్ని నెమ్మదిగా అహింస మార్గంలో కొత్త రాజ్యం వైపుకు మరల్చడానికి ప్రయత్నించేవారు పిఎస్‌యువి విప్లవకారులు. చావెజ్ విధానాలను, కార్యక్రమాలను అమలుచేయడంలో విఫల మయిన అధికారులను, తనపార్టీలో ఉన్న వారితో సహా, చావెజ్ తన అధ్యక్ష కాలమంతా దుయ్యబడుతూనే ఉన్నాడు. తన చివరి రోజులలో చావెజ్ అధికార యంత్రాంగం ఒక శాపంగా మారిందని, దానిని తీవ్రంగా వ్యతిరేకించాలని తన సన్నిహితులతో చెపుతుండేవాడు. "అవసర మయితే వంద లేదా అంతకంటే ఎక్కువ తనిఖీ బృందాలను తయారు చేయాలి.

ఎవరినయినా తీసివేయవలసి వస్తే వారిపై విచారణ జరిపించాలి అని మదురోతో అన్నాడు అయితే అధికారుల అలసత్వానికి బాధ్యత ఛావెజ్‌దే. దేశం ఉన్న పరిస్థితులలో ప్రభుత్వం సమర్ధవంతమయిన కట్టుబాట్లను ఏర్పరచలేక పోయింది. పిఎస్‌యువి స్వతంత్రంగా అసమ ర్ధతను, అవినీతిని ఎదుర్కొనేందుకు ప్రయ త్నం చేస్తున్నది. కానీ చావెజ్ మొదటి రోజు నుండి పార్టీని ప్రభుత్వానికి తోకగా తయారు చేశాడు. ప్రభుత్వంలో అనేక స్థానాలలో వారే చేరారు. పదేళ్ల తరువాత పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, 22 మంది జాతీయ కమిటీ సభ్యులు, దాదాపు అందరు మంత్రులు, గవర్నర్లు, శాసనసభ్యులు, ఇతరంగానూ ప్రభుత్వానికి సంబంధించిన వారే ఉన్నారు. 'ప్రజాస్వామ్యంలో పాల్గొనడాన్ని' మాటలలో చెపుతున్న పిఎస్‌యువి వాస్తవంలో విమర్శను ఆహ్వానించేది కాదు. 2017 జులై 30న జరిగిన జాతీయ శాసనసభ ఎన్నికలలో చూసినట్టే పిఎస్‌యువి నాయకత్వం కొంతమంది సభ్యుల కోసం తన వద్ద ఉన్న వనరులను, తన పరపతిని వినియోగించేది. చావిస్తా వ్యతిరేక సభ్యు లకు కూడా ప్రచార మాధ్యమాలలో, టి వి ఛానళ్లలో మాట్లాడడానికి మరిన్ని అవకాశాలు ఇచ్చివుంటే బాగుండేది. ఇటువంటి విమర్శకులలో ఒకడు ఏఎన్‌సి తరపున ఎన్నుకోబడిన జూలియా ఏకలోన. ఈయన 1960లలోని గెరిల్లా పోరాటంలో ప్రఖ్యాతి గాంచాడు. ఈయనే అవినీతి గురించిన ప్రశ్న లేవనెత్తి అన్యాయంగా సంపాదించిన ఆస్తులన్నీ జప్తుచేయాలని ప్రతిపాదించాడు. ఏకలోన పిఎస్‌యువి, ఏఎన్‌సి అధీనంలో ఉండడాన్ని వ్యతిరేకించాడు." ఏఎంసిలో ప్రభుత్వ ప్రాతినిధ్యం ఉంటుంది. అది న్యాయమే. ప్రభుత్వం, పిఎస్‌యూలు, ఏఎంసి ఆలోచనల ప్రవాహంలో కొట్టుకునిపోకూడదు." చావెజ్ నాటి ప్రజారంజక శక్తిని పునరుద్ధరించుకోడానికయినా, ఈమధ్యవచ్చే మితవాద ప్రతిఘటనను ఎదుర్కోడానికయినా చావిస్తా కార్యక్రమాలకు అవకాశం కల్పించడం, పార్టీ యంత్రాంగానికి ఇంకా అంటిపెట్టుకుని ఉన్న నమ్మకమయిన పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు అనుకూల పరిస్థితులు కల్పించడం తెలివయిన వ్యూహమే. ఈ భావంతో చావిస్మోను పునరుజ్జీవింప చేయడానికి కత్తిమీదసాము చేయాలి. వాస్తవ పరిస్థితులను సరిగ్గా అంచనా వేయాలి. శత్రువుల శక్తిని కూడా పరిగణనలోనికి తీసుకోవాలి.

### ప్రజాస్వామ్యం ప్రభుత్వం

చావిస్తాలు ఒక కొత్తరకమయిన ప్రజాస్వామ్యాన్ని ఊహించారు. ఇది అత్యధిక ప్రజలు ప్రతినిధులను ఎన్నుకునే పాత పద్ధతికి బదులు గా ప్రత్యక్షంగా పాల్గొంటారన్నదానిపై ఆధారపడి వుంది. చావిస్తా నాయకులు తమ సభ్యులను ఏఎంసి ఎన్నికలలో' ప్రత్యక్షంగా పాల్గొనడానికి ప్రోత్సహించడం మరో ఉదాహరణ. ఇదిపూర్తిగా సఫలం కాలేదు. 1999 రాజ్యాంగంలో చేర్చిన అంశాలు ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఉపయుక్తంగా చేయబడినవి అని మదురో సమర్థించుకున్నారు. ఈ పద్ధతి సామాజికంగా అంచులకు నెట్టివేయబడిన అనేకులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తుంది. ఇది వారికీ ఒక రకమయిన అధికారాన్ని ఇస్తుంది. కానీ దేశం మొత్తంగా చూసినప్పుడు వారి కార్యాచరణ తరతమ స్థాయిలలో ఉంది. వెనిజులాలో రాజకీయ వ్యవస్థ అధికార యంత్రాంగానికి ఎప్పుడూ అనువుగా ఉన్నందువలన, ముఖ్యంగా చావిస్తా ఆధ్వర్యంలో, యీ రకమయిన నియంత్రణ అవసరమే. అయితే ఇవి విఫలమయ్యాయి. అందుకే 2009లో చేసిన చట్టం జాతీయ సెన్సార్‌షిప్‌ను కమ్యూన్ల లెక్కలను చూడాలని ఆదేశించింది. అయితే ఇదీ జరగలేదు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం పూర్తిగా అమలు చెయ్యనంత కాలం పాత పద్ధతులను కొనసాగించాల్సి ఉ

ంది. వాటిని తమకనువుగా మార్పులు చేసుకోవాల్సిఉంది. అంతేగాని పూర్తిగా విడిచిపెట్ట కూడదు. ఉద్యమాల మూలాలకు, పాలనా వ్యవస్థలకు మధ్య సమన్వయంతో బేరీజులు వేసుకుంటూ వెళ్ళాలి. జార్జ్ చికారీల్లో మెహెర్ మాటల్లో చెప్పాలంటే ఈపని చావెజ్ సమర్ధ వంతంగా చేయగలిగాడు. పిఎస్‌యువి కి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఉండడం ఎంతో అవసరం. ఎంతగా మెరుగు పరిచిన పర్యవేక్షణలు అయినా దేశం లోపల సక్రమంగా పనిచే స్థాయని ఖచ్చితంగా చెప్పలేము.

> ❝ విధానాలు, ఎత్తుగడల రూపకల్పనలోనూ, వాటి అమలులో ఒక ముఖ్యమయిన సమస్య సామాజిక న్యాయం, సమానత్వంతో ముందుకునడవడం. చావిస్తా ఉద్యమానికి రెండూ మార్గదర్శకాలు. దేశంలోని అంచులకు నెట్టివేయబడిన వారిలోను, వెనకబడిన తరగతులలోను ప్రాచుర్యం పొందడానికి ఇవి కారణం కూడా. ఇందులో ఏ విభేధాలు లేవు. ❞

అవినీతిని నియంత్రించేందుకు పరిపాలించే పార్టీ అంతర్గ తంగా ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకొనేదిగా ఉండాలి. ప్రభుత్వంతో పాక్షిక స్వతంత్ర సంబంధాలు కలిగి ఉండాలి.

**విధేయత ఒంటెత్తుపోకడ**

2002-03 సాధారణ సమ్మె చావిస్తా నాయకత్వానికి విధేయత ప్రాముఖ్యాన్ని అర్థమయేలా చేసింది. అయితే ఇందులో నుండి అవసరానికి మించి నేర్చుకున్నారు. సమ్మె తరువాత చావెజ్ 17,000 మంది చమురు పరిశ్రమలోని సాంకేతిక, వృత్తి పరమయిన ఉద్యోగులను తొలగించాడు. వీరే చమురు ఉత్పత్తిని స్తంభింపచేసి పాలనలో మార్పుకి మూల మయ్యారు. ఈ నిపుణుల స్థానంలో వచ్చినవారికి నైపుణ్యం లేదు. అయినా ఉత్పత్తి కొనసాగిం చారు. ఈ అనుభవం చావిస్తా మద్దతుదారులకు నైపుణ్యం అదేవస్తుంది గాని విధేయత రాదన్న పాఠం నేర్పింది. చావెజ్, మదురోలు క్యాబినెట్ మంత్రులను తరచుగా మార్చేవారు. ఈ మంత్రులలో కొందరికి వారి శాఖల గురించిన అవగాహన ఏమాత్రం ఉండేదికాదు. వైపుణ్యం యెడల వారికున్న విముఖతకు ఇదే నిదర్శనం. విధేయతను బాగా నొక్కిచెప్పడంతో అసహనం, ఒంటెత్తు పోకడలు పెరిగాయి. ప్రభుభక్తి పరా యణుల నీడన అవినీతి పరులు తలదాచు కున్నారు. చావెజ్, మదురోల మంత్రం 'ఐక్యత ఐక్యత మరింత ఐక్యత' వారి అనుయాయుల లోని విభేధాలను పక్కకు పెట్టి శత్రువును ఎదుర్కొనేందుకు సిద్ధం చేసింది. చావిస్తా నాయకులు పిఎస్‌యువిని వదిలి వెళ్లడం చూస్తుంటే ఈ ఐక్యత పిలుపు,ఎంత సముచిత మో అర్థం అవుతున్నది. ఉదాహరణకి చావెజ్ మరణం తరువాత మదురోని తీవ్రంగా విమర్శిం చడం చూస్తున్నాము, అయితే చావెజ్ వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకి అయిన గోదానికి, వామ పక్ష విమర్శకులు,మద్దతుదారులు అయిన ఎదురదా సమన్ లాంటి మరియా సోషలిస్టులకు మధ్య తేడాని గమనించాలి. ఒకసారి చావెజ్ చేత మరోసారి మదురో చేత సమన్ తొలగించబడ్డాడు. తగినంత గుర్తింపు నివ్వని కారణంగా సమన్ తన గ్రూపు వీడి పాట్రియా పరతోడోస్ గ్రూపులో చేరాడు. అయినా గోదాని పార్టీని తీవ్రంగా ఖండించడాన్ని తీవ్రంగా విమర్శించాడు. చావెజ్ కన్నా మదురో మరింతగా విధేయతకు ప్రాధాన్యత నిచ్చాడు.

**సామాజిక న్యాయం, ఉత్పత్తి**

సామాజిక కార్యక్రమాలను, ఆర్థిక విధానాలను ప్రాధాన్యతల ఆధారంగా అమలు జరపడం చావెజ్ కి తన మొదటి ఎనిమిదేళ్లలో ఏంతో అవసరం అయింది. ఆలా చేయకుంటే కార్మిక వర్గం, దేశంలోని పేద ప్రజలు చావెజ్ ప్రభుత్వాన్ని 2002లో రెండుసార్లు పడదోసే ప్రయత్నం చేసినపుడు ఆయనకు మద్దత్తునిచ్చి, అయన వెంట ఉండేవారు కాదు. తరువాతి కాలంలో చావెజ్ ఆర్థిక విధానాలకు ప్రాధాన్యత నివ్వడం మొదలు పెట్టాడు. మదురో 2014 లో చేసినట్టే .వామపక్షం ప్రజా మూలాలను గట్టి పరచుకొని,



అమెరికా ప్రోద్భలంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాలు

రాజకీయంగా నష్టపోకుండా ఉండడానికి, మొదటిగా అధికారం స్థిరపరచుకోవాలి. సుస్థి రత సాధించాలి. అంటే సామాజిక అంశాలకు మొదట ప్రాధాన్యత నివ్వాలి. అయితే చావెజ్ మొదటి రోజులలో సామాజిక అంశాలకు ఇవ్వాల్సినంతకన్నా ఎక్కువే ప్రాధాన్యతనిచ్చారు. ఉదాహరణ 2007 లో పని గంటలను వారానికి 44 నుండి 36 గంటలకు కుదించడానికి రాజ్యాంగ సవరణ తీనుకు రావడం. ఇందు వలన అభివృద్ధి చెందుతున్న ఏదేశంలోనయినా జరిగేవిధంగానే వెనిజులా ఆర్థికంగా వెనుక బడింది. చావెజ్ ఊతపదాలయిన, "ఉప్పొంగే ఆనందం", సమానవత్వ సోషలిజం, వెనిజులా ప్రజలను కష్టాలకు సన్నద్ధులను చేయలేదు, ముఖ్యంగా చమురు ధరలు తగ్గడం మొదలయిన తరువాత.ఈ లోపం స్పష్టమైంది. చమురు ధరలపై దేశం ఎక్కువగా ఆధార పడకుండా ఉండడం చావెజ్ ప్రాధాన్యతలలో మొదటి రోజులలో లేదు. కానీ మొదటి నుండి ఈ సవాలును చావెజ్ ఎదుర్కోవలసి వచ్చింది. ఈ అనుభవంతో ఒక పాఠం నేర్చుకోవాలి. వివిధ స్థాయిలలో ప్రాధాన్యతలను కాలానుగుణంగా నిర్ధారించుకోవాలి. అదేసమయంలో భవిష్యత్తును సరిగా ఊహించగలగాలి. విధానాలు, ఎత్తుగడల రూపకల్పనలోనూ, వాటి అమలులో ఒక ముఖ్యమయిన సమస్య సామాజిక న్యాయం, సమానత్వంతో ముందుకు నడవడం. చావిస్తా ఉద్యమానికి రెండూ మార్గదర్శకాలు. దేశంలోని అంచులకు నెట్టివేయబడిన వారిలోను, వెనకబడిన తరగతులలోను ప్రాచుర్యం పొందడానికి ఇవి కారణం కూడా. ఇందులో ఏ విభేధాలు లేవు. కానీ అంతర్గతంగా చర్చలు ఎప్పుడూ క్రమ శిక్షణ ఆవశ్యకత, త్యాగాల చుట్టూ

> **"వెనిజులాలో సంప్రదాయకంగానే స్థానిక హక్కులు, సమానత్వం, పర్యావరణ న్యాయం వంటి సామాజిక ఉద్యమాలు బలహీనంగా ఉన్నాయి. ఇదే వెనిజులా, బొలీవియాల మధ్య తేడా. బొలీవియాలో ఇటువంటి ఉద్యమాల ద్వారా ఇవో మొరెల్స్ పార్టీ బలపడింది. వెనిజులాలో బలమయిన స్వతంత్ర పునాది లేకపోవడం వలన పార్టీయే మూలాధారం."**



బొలివేరియన్ విప్లవానికి మద్దతుగా నిలబడిన వెనిజులా సైన్యం

తిరిగేవి. లేదా అసమర్థ పరిపాలన మీద, దేశ ప్రభుత్వ రంగ నిర్వహణ మీద జరిగేవి. ఏ సోషలిస్టు ప్రభుత్వంలో నయినా సమర్థతకి, ఒకవైపు ఉత్పత్తికి, వేరొక వైపు కార్మికవర్గ క్రమశిక్షణకు మధ్య ఘర్షణ తలెత్తడం సహజం. ఈ రెండు లక్ష్యాలు ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉన్నవి. పరిష్కరించుకోగలవి కూడా. 1998 నుండి ఇంధన రంగంలోని పిడివిఎస్ఏలో కార్మికులు మూడు రెట్లు, 40,000 నుండి 1,50,000 కు పెరిగారు. సామాజిక న్యాయానికి, సామాజిక సమర్థతకి మధ్య ఉన్న ఒత్తిడి మిగిలిన రంగాలలోను కనిపించడం మొదలయింది. పేదలకు, కార్మికులకు చౌకగా సరుకులు సేవలు అందించడం అణగారిన వర్గా లకు చావిస్తా ప్రభుత్వం తీర్చుకునే సామాజిక ఋణం అనుకోవడం వలన ఒకవైపు ఇటువంటి సదుపాయాలను కల్పించవలసి ఉంది. అదే సమయంలో ఈ బాధ్యత నిత్యావసర సరుకుల కొరతకు, అవినీతికి కారణమయింది.

**ఎప్పుడు కార్యాచరణ చేపట్టాలి**

వెనిజులా ప్రతిపక్షం దాడులు ప్రభుత్వానికి మార్గాంతరాలు లేకుండా చేసిందని, రాయితీలు ఇవ్వాల్సిన పరిస్థితులు కల్పించిందని అనుకుంటే ఆ సమయంలోనే చావిస్థాలది పైచేయిగా ఉండింది. అభివృద్ధి జరిగింది. సంస్కరణలు అమలయ్యాయి. ఆర్థికంగా మార్పు, అవినీతి, అసమర్థ అధికారులపై పోరు, అంతర్గత ప్రజాస్వామ్యం, ప్రత్యర్థులను బలహీన పరచడం అన్న నాలుగు లక్ష్యాలు ఆ పరిస్థితులలోనే నెరవేరాయి. వీటిని చావెజ్ తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. 2006లో 63 శాతం ఓట్లతో గెలుపొందాడు. ఇది ఆధునిక వెనిజులా చరిత్రలోనే అత్యధికం. కీలక పరిశ్రమలను జాతీయం చేయడమే కాదు. పిఎస్‌యూవిని స్థాపించి తన మితవాద ప్రత్యర్థులను పెద్ద దెబ్బ కొట్టాడు. ఇందుకు వ్యతిరేకంగా ప్రతిపక్షం మూడు నెలల నిరసన కార్యక్రమాలు నిష్ఫలమయాయి. చావిస్తాలు మంచి స్థానంలో ఉన్నప్పుడు, మునిసిపల్ ఎన్నికలలో మంచి మెజారిటీతో గెలిచినప్పుడు మదురో 2014 మధ్యకాలంలో మంచి అవకాశాన్ని వదులుకున్నాడు. ఆ సమయంలో మదురో తన క్యాబినెట్‌లో విప్లవాత్మక మార్పును తెస్తానని వాగ్దానం చేసాడు. దానితో కొత్త విధానాలు వస్తాయని ఆశలు రేగాయి. కానీ ఆ మార్పులు వాయిదా పడుతూనే వచ్చాయి. ఆఖరుకు ఆ సెప్టెంబర్ రెండున క్యాబినెట్ మార్పు జరిగిన తరువాత చూస్తే ఉన్నవారిలోనే స్థానాల మార్పులు మాత్రమే జరిగాయి. దానికితోడు చమురుధరలు తగ్గుతూ వచ్చాయి. బంగారు అవకాశం కాస్త చేజారి పోయింది. ఏఎంసి సమావేశం ఏర్పాటు చావిస్టాలకు మరో మంచి అవకాశం. 2017 ఆగస్టు నాటికి ప్రతిపక్షం 2014లో చేసిన మూడు నెలల సమ్మె ప్రభావం నీరుగారిపోయింది. ప్రతిపక్షం మునిసిపల్, గవర్నర్ల ఎన్నికలలో ఎక్కడి నుంచి పోటీచేయాలన్న దానిపై విడిపోయి ఉన్నది. జాతీయ అసెంబ్లీలో 550 మంది సభ్యులు గల ఏఎంసికి వారి ప్రతినిధులను పార్టీ అదుపాజ్ఞలలో ఉంచుకోవడం సాధ్యపడే విషయం కాదు. అందువలన వారు అవినీతి అధికారులకు వ్యతిరేకంగా ఆర్థికరంగాన్ని పునరుజ్జీవింప చేసే చర్యలకు అనుకూలంగాను ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**ముగింపు**

మదురోని గద్దెదింపేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమవడానికి కారణం ఇప్పటికీ చావిస్టాలకు దేశ ప్రజలలోను, సైన్యంలోను మద్దత్తు ఉండడమే. 2014-17 మధ్య బాగా సంపద ఉన్న మున్సిపాలిటీలలో అల్లర్లు మొదలయితే తరువాత కాలంలో అవి పల్లెలకు పాకి సైనిక తిరుగుబాటు వస్తుందని ఊహించారు. కానీ అది జరగలేదు. ఆర్థికంగా అసంతృప్తులు ఉన్నప్పటికీ, పేదరికంతో నిండిన పట్టణాలలో రాజకీయ ప్రతిఘటన సంప్రదాయం ఉన్నప్పటికీ, కొద్దిచోట్ల మినహాయించి కార్మికులు కష్టజీవులు 'గరింబ'లో కలవడానికి సిద్ధపడలేదు. సైనికులకు సంబంధించిన ఎత్తుగడలలో లాటిన్ అమెరికాలో సైన్యంలో మితవాదులకున్న బలాన్ని ఎదుర్కోడానికి తగిన బలం సంపాదించలేని పురోగామి ప్రభుత్వాల అనుభవాన్ని చావెజ్ గుర్తించాడు. అందువలన 'బొలివారియన్ సైన్యాన్ని' తయారు చేశాడు. వీరు ఉద్యమంతో మమేకమై ఎదిగారు. అందువలన సైన్యం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సోషలిజానికి, చావిస్తాలకి అనుకూలంగా ఉంది. తన ప్రభుత్వాన్ని పడదోయాలని ప్రయత్నించినపుడు మదురో దృఢంగా వ్యవహరించాడు. ప్రతిపక్ష నాయకులు మొదలుపెట్టిన హింసను ఎదుర్కోడమేకాక తన అనుచరులతో వీధులలో అందుకు ప్రతిగా నిరసనలను మొదలుపెట్టాడు. లాటిన్ అమెరికాలో మితవాదుల తిరుగుబాట్లను అభివృద్ధి కాముక ప్రభుత్వాలు ఇదివరకు ఎదుర్కొన్నది లేదు. మదురో ఆ సంప్రదాయానికి భిన్నంగా నిలబడ్డ

(మిగతా 32వ పేజీలో)

# పెట్టుబడిదారులకోసం గుజరాత్ భూసేకరణ చట్టం

రిషిత్ నియోగి

డోలేరా స్మార్ట్‌సిటీ మరియు ఢిల్లీ, ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులను ముందుకు నెట్టాలన్న గుజరాత్ ప్రభుత్వం యొక్క ప్రయత్నాలు, ఎంచుకున్న విధానాల వలన చాలా సులభమైనది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో, అమలులో, వ్యవసాయదారులకు ఎలాంటి ప్రాధాన్యత లేదని నిరూపించాయి.

భారతదేశంలోని ఢిల్లీ మరియు ముంబై, రెండు పెద్ద నగరాలే కాక, కేవలం 15 వందల కిలోమీటర్ల దూరంలోనే కొలువై ఉన్నాయి. వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ (డి.ఎఫ్.సి.), రైల్వే ట్రాక్ ఢిల్లీకి దగ్గరలో ఉన్న దాద్రీ డ్రైపోర్ట్‌లో ప్రారంభమై, ముంబైలోని జవహర్ సీపోర్ట్ వద్ద ముగుస్తుంది. నిర్మాణంలో ఉన్న ఈ రైల్వేట్రాక్ ప్రధాన ఉద్దేశ్యం, కేవలం సరుకుల రవాణా మాత్రమే. 7 రాష్ట్రాలను కలుపుతూ వెళ్ళే ఈ మార్గంలో 23 ప్రాంతాలను మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్, అనగా ఉత్పత్తి కేంద్రాలుగా గుర్తించి సరుకు రవాణా కోసమే ఈ రైలు మార్గాన్ని ఉపయోగించాలన్న ఏర్పాటు జరిగింది. ఢిల్లీ, ముంబై ఇండస్ట్రియల్ కారిడార్‌గా నామకరణం జరిగిన ఈ రైలు మార్గంలో వాస్తవానికున్న 'ఉత్పత్తి కేంద్రాలు' నామమాత్రమే. అధికశాతం కేవలం పేపర్లపై మాత్రమే కనపడుతున్నాయి. ఈ మార్గంలో ఉత్పత్తి కేంద్రాలకన్నా, మైళ్లకొలది విస్తరించి ఉన్న వ్యవసాయ క్షేత్రాలే అధికం. పైపైన చూడటానికి ఈ ఆలోచన, పారిశ్రామిక ఉత్పత్తుల పెరుగుదల, జాతీయ స్థూల ఉత్పత్తులు పెంచి, ఉపాధి అవకాశాలు పెంచే ఏకీకృత గమ్యంగా అన్నట్లుగా కన్పించినా, వాస్తవానికిది, గోల్ఫ్‌ఆటను ప్రేమించే కోటీశ్వరుల కోసం సృష్టించబడింది. ప్రాథమికంగా ఏర్పాటు చేసిన ప్రణాళిక, పేపర్లు ఒకచోట నుండి మరోచోటుకు కదలటం జరిగినప్పటికీ, గతంలో ఢిల్లీ, ముంబై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వ్యవహరించి, ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ మరియు ప్రమోషన్‌కి కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న 'అమితాబ్ కాంత్' వాటిని మార్చి, ఈ ఫ్యాక్టరీలకన్నా ముందు నగరాల నిర్మాణం జరగాలని నిర్ణయించారు. తత్ఫలితంగా అధికార గణం దృష్టి అంతా ప్రస్తుతం నగరాల నిర్మాణంపై పడింది. పారిశ్రామిక ఉత్పత్తి అంటూ ఆరంభించిన వాక్చాతుర్యం అంతా మణిగొట్టుకుపోయింది. ఈ ప్రాజెక్టుల్లో భాగస్వాములైన అనేక వర్ధమాన దేశాల పెట్టుబడులు నూతనంగా కడుతున్న అనేక టౌన్‌షిప్‌లు, ఇండస్ట్రియల్ పార్కులలో రాళ్ళుగా కొట్టుకుపోతుండగా, డిఎంఐసి, భారతీయ సార్వభౌమాధికారాన్ని, ఆహార భద్రతను, అన్నింటికన్నా సమానత్వాలను ప్రత్యక్షంగా ఛాలెంజ్ చేస్తుంది. ఇది శోచనీయం.

ఇలాంటి ప్రాజెక్టులు ఏం మొదలుపెట్టినా, అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పేరుతో ప్రజానీకం నుండీ భూములను బలవంతంగా స్వాధీనపరచుకుంటుందని సగటు భారతీయులందరికీ సుస్పష్టంగా తెలిసిన విషయం. మంచి పంట రూపంలో ఫలితాలనిచ్చే 'ఏ'గ్రేడు వ్యవసాయ క్షేత్రాన్ని ఏ యజమాని కూడా వదులుకోడు. ఈ విషయం స్పష్టంగా తెలిసిన గుజరాత్ ప్రభుత్వం నూతనంగా ఎన్నికబడిన వెంటనే 'భూసేకరణ చట్టాన్ని' హడావుడిగా తేవడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. ఈ క్రమంలో ల్యాండ్ ఎక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ యాక్ట్ 2013 అనగా భూసేకరణ, పునరావాసం మరియు నష్టపరిహారం చట్టం జి13 ప్రకారం రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై స్పష్టతున్నప్పటికీ దానిని నొక్కిపట్టి, అన్యాయం చేసింది. ఈ సందర్భంగా గుజరాత్ ప్రభుత్వ వ్యవ హరిస్తున్న తీరు యొక్క చరిత్ర, భూసంబంధమైన చట్టాలు, మన దేశంలో ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం...

**ప్రత్యేక పెట్టుబడుల ప్రాంత చట్టం**

డి.ఎం.ఐ.పి.లో 38 శాతం గుజరాత్ రాష్ట్రంలోనే ఉంది. 90 బిలియన్ డాలర్ల పెట్టుబడులు తెస్తామంటూ హామీ ఇవ్వబడింది. కానీ 30 శాతం మాత్రమే పెట్టుబడి పెట్టబడింది. 2009 మార్చి 3వ తేదీన, ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఓ చట్టం చేసింది. అయితే ప్రైవేటు రంగంలో వ్యక్తుల ప్రయోజనాలను పరిరక్షించడానికి చట్టంలో లొసుగులు ఉండేలా చేసింది. 1976 లో ఏర్పాటు చేసిన గుజరాత్ టౌన్ ప్లానింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ యాక్ట్ ఉన్నప్పటికీ దానిని మార్చి, నవీనత పేరుతో 'ది గుజరాత్ స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ యాక్ట్ (ఎ.ఐ.ఆర్. యాక్ట్) అమలులోకి తెచ్చింది. దీని ప్రధాన లక్ష్యం భూసేకరణ. వ్యక్తిగతంగా ఉన్న భూములను స్వాధీనపరచుకొని ప్రభుత్వ ఆధీనంలో క్రొంగొత్త పట్టణాల నిర్మాణాన్ని చేపట్టడం. అందులో భాగంగా, భూములిచ్చిన వ్యక్తులకు, కట్టడాల నిర్మాణం ముగిసిన తర్వాత, తొలుతగా ఇచ్చిన భాగంలో, తిరిగి సగభాగం ఇవ్వడం. ఈ ఆలోచన నేపథ్యమేమనగా నిర్మాణం పూర్తయిన తర్వాత పెరిగే భూవిలువ వలన 50 శాతం లాభం వస్తుందని భూస్వంతదారులు భావిస్తారని. కానీ వాస్తవానికి అలా జరగలేదు. భూములిచ్చిన వ్యక్తులు మరింత 'ఉన్నతస్థాయి పరిహారాన్ని ఆశించారు. కానీ అలా జరగలేదు.

**భూ మార్పిడులు**

ఎస్.ఐ.ఆర్. యాక్ట్‌లో భాగంగా, 2009 జూన్ 4వ తేదీన, బర్వాలా మరియు ధండూకా జిల్లాల్లోని 22 గ్రామాలలో, భూసేకరణ నిమిత్తం ఒక ప్రకటన వెలువడింది. ధోలేరు స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌గా నామకరణం చేయబడిన ఈ ప్రాంతంలో మొత్తం 879.3377 చదరపు కిలోమీటర్ల భూమిని సేకరించాలని నిర్ణయించినట్లు నోటిఫికేషన్ వెలువడింది. అందులో 42 వేల హెక్టార్లు పంట భూములే. ఢిల్లీకన్నా రెండింతలు పెద్దగా, షాంఘై అంత విశాలమైన విస్తీర్ణంలో నగరాన్ని నిర్మిస్తున్నామని ప్రచారం చేశారు.

'ధోలే సర్' కోసం 'సీన్స్ కన్సల్‌టెంట్స్' అందించిన 'ది ఎన్విరాన్‌మెంటల్ ఇంఫాక్ట్ ఎసెస్‌మెంట్ నివేదిక ప్రకారం ఈ ప్రాంతంలో అధిక భాగం ప్రభుత్వ ఆధీనంలో ఉండడం వలన, పారిశ్రామిక ఉత్పత్తులకనుగుణంగానే ఉంది. కానీ 2011 ఆరంభంలోనే ప్రజాభిప్రాయ సేకరణగానీ, ప్రజల మనోవాంఛలను వినకుండానే గుజరాత్ ప్రభుత్వం ధోలేరా ప్రాంతంలోని సుమారు 2,600 హెక్టార్ల ప్రభుత్వ భూమిని అమ్మే ప్రయత్నం చేసింది. 'గ్రేటర్ ధోలేరా ఇన్‌ఫ్రా, హిందూస్తాన్ ఇన్‌స్ట్రక్షన్ కంపెనీ మరియు నానో వర్క్స్ డెవలపర్ గుజరాత్' అనే

> **"విడుదల చేసిన బ్రోచర్లలో, వీడియోలలో మాత్రం, 3డి గ్రాఫిక్స్, కామిక్ పుస్తకాలలోని బొమ్మల్లాగా గోచరిస్తున్నాయి. యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్‌లో 'స్కూల్ ఆఫ్ జాగ్రఫీలో పనిచేస్తున్న సీనియర్ లెక్చరర్ 'అయోనా దత్తా' మాటల్లో పట్టణీకరణను ప్రాంతీయ స్థాయినుంచి జాతీయస్థాయి వరకూ ఒక బిజినెస్ మోడల్‌గా మార్చే క్రమంలో గుజరాత్ ప్రభుత్వం చట్టం ద్వారా తన అధికార పరిధిని పెంచుకుంది."**

మూడు కంపెనీలు ప్రభుత్వంతో 927 కోట్ల రూపాయలతో, లక్ష కోట్ల రూపాయలను ధోలేరా సర్‌లో పెట్టుబడి పెట్టి, పరిసరాలలోని లక్ష మందికి ఉద్యోగాల ద్వారా ఉపాధి కలిగించే విధంగా, మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్' కుదుర్చుకున్నాయి. కానీ 2013 వరకూ ఒప్పందం అమలులోనికి రాని కారణంగా, కేటాయింపులు నిలిపివేయబడ్డాయి.

'ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్' నివేదిక సుస్పష్టంగా వ్యక్తీకరించిన విషయ మేమనగా' పచ్చిక బయళ్ళు' యథాతథంగా ఉంచాలని... వాటిని పారిశ్రామిక వాడలుగా మార్చకూడదని... కానీ ప్రభుత్వం, రికార్డులలో ఈ భూభాగంలో కేవలం 5 శాతం మాత్రమే పచ్చిక బయళ్ళుగా, మిగిలినదంతా, వృధా భూమిగా, వ్యవసాయానికనుగుణంగా ఉన్నట్లు చూపించింది. గుజరాత్‌లోని పచ్చిక బయళ్ళలో పశువులను మేపుకుంటూ జీవనం సాగించే 'మాల్దారీ' సామాజిక వర్గం సైతం, ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించింది. కారణంగా వీరి జీవనాధారం పచ్చిక బయళ్ళు మాత్రమే. వ్యక్తిగత భూములు ఈ సామాజిక వర్గానికి లేవు.

### స్మార్ట్ సిటీ

తొలుతగా 'ధోలేరా సర్'గా పేరు పెట్టబడిన ఈ ప్రాజెక్టు క్రమంగా 'ధోలేరా మెట్రో సిటీ'గా మారింది... అంతేగాక, అధికారి కంగా 'సిటీ'కి ముందు, సూపర్/టెక్/ఫ్యూచర్/డ్రీమ్/మెగా/గ్రీన్‌ఫీల్డ్" వగైరా పదాలను చేర్చుకుంటూ కొనసాగుతున్నది. దీనిలోనే 'గ్రీన్‌ఫీల్డ్ అనే మెగా ఎయిర్‌పోర్ట్' కూడా ఉంది... ఈ మొత్తం ప్రాజెక్టు 30 సంవత్సరాలలో వాస్తవ రూపం దాలుస్తుంది. కానీ విమర్శకుల ప్రకారం, ఈ ప్రాజెక్టు ఎప్పటికీ సాకారం కాదు... కనీసం ముందు చేర్చిన పదం 'మెగా'లో సగం కూడా సాధ్యం కాదు అంటున్నారు.



గుజరాత్‌లోని ధోలేరీ స్మార్ట్ సిటీ

విడుదల చేసిన బ్రోచర్లలో, వీడియోలలో మాత్రం, 3డి గ్రాఫిక్స్, కామిక్ పుస్తకాలలోని బొమ్మల్లాగా గోచరిస్తున్నాయి. యూనివర్శిటీ ఆఫ్ లీడ్స్‌లో 'స్కూల్ ఆఫ్ జాగ్రఫీలో పనిచేస్తున్న సీనియర్ లెక్చరర్ 'అయోనా దత్తా' మాటల్లో పట్టణీకరణను ప్రాంతీయ స్థాయినుంచి జాతీయస్థాయి వరకూ ఒక బిజినెస్ మోడల్‌గా మార్చే క్రమంలో గుజరాత్ ప్రభుత్వం చట్టం ద్వారా తన అధికార పరిధిని పెంచుకుంది... అదే ప్రసంగంలో ఆమె చెప్పిన మరో అంశం... ధోలేరా యొక్క భవిష్యత్తు పాలసీ పరిధులకు లోబడి పోయింది. 2007 ఆగస్టు మాసంలో భారత ప్రభుత్వం డి.ఎం.ఐ.సి. ప్రాజెక్టుకోసం కొన్ని పరిధులకు లోబడి అనుమతిని ఇచ్చింది. 2009లో సర్ చట్టం అమలులోనికి రాగానే, భూసేకరణ కోసం నోటిఫికేషన్ విడుదల అయ్యింది. 2010లో 'మాక్స్ కీన్స్' యొక్క అర్బన్ ఎవేకెనింగ్' నివేదిక వెలువడింది. ఈ నివేదికలో సుస్పష్టమైన అంశం... నగరాల నిర్మాణం, పల్లె ప్రాంతాల ప్రజలను పరాయి ప్రాంతాలకు తరలించడం అందులో ముఖ్యంగా ఈ నగరాలకు... పట్టణీకరణ పేరుతో ఏర్పడిన సదస్సులలో ఎంతో మంది ముక్తాయించిన అంశం... 2030 నాటికి 59.0 కోట్లమంది ప్రజలు ఈ స్మార్ట్ సిటీలలో నివాసముంటారని, ఈ లేఖ కేవలం... మెకిన్సీ గ్లోబల్ ఇన్స్టిట్యూట్ వారి 'అంతర్గత లెక్కలు మాత్రమే. 2010 అక్టోబర్ నాటికి ధోలేరా మాస్టర్ ప్లాన్, 2011 డిసెంబర్‌లో సర్ డ్రాఫ్ట్ డెవలప్‌మెంట్ ప్లాన్, ఏర్పడి, 2012 డిసెంబర్ నాటికి భూసేకరణ ముగిసింది.

### నేటి రాజకీయాలు

2013వ సంవత్సరం జూన్‌లో, గుజరాత్ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు నర్మదా నదీ ప్రవాహం అందనివ్వ కుండా మరో శరాఘాతానికి గురి చేసింది. సర్దార్ సరోవర్ డామ్ వచ్చి తమ దాహార్తిని తీరుస్తుందని ఆశించిన ప్రజా నీకం, దశాబ్దాల తరబడిన, తమ నిరీక్షణ ఫలించదని అర్థం చేసుకోవలసిన పరిస్థితి ప్రభుత్వం కల్పించింది. సర్‌లో ప్రకటించిన రీతిగా, గుజరాత్‌లోని భిన్న ప్రాంతాలలో సర్దార్ సరోవర్ నర్మదా నిగమ్ లిమిటెడ్ (ఎన్.ఎన్.ఎన్.ఎన్.ఎల్.) సుమారుగా 80,000 హెక్టార్ల పంట పొలాలకు నీరు ఇవ్వాలి. వాస్తవానికి దీనిపరిధిలో 18,40,000 హెక్టార్ల భూమి గుజరాత్ మొ త్తంలో వ్యాపించి ఉండగా, అందులో 30,000 హెక్టార్లు ధోలేరా ప్రాంతంలో ఉన్నాయి.

ముఖ్యమైన రైతాంగానికి, మరో దెబ్బ 2013 మార్చి 22న గుజరాత్ ప్రభుత్వం చేసిన మరో శాసనం... దీని ప్రకారం, భూమినుండీ నేరుగా రైతాంగం నీటిని తోడుకోవాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం నుండి లైసెన్స్ తీసుకోవాలంటూ 'ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ యాక్ట్'ను తెచ్చింది. ఈ చట్టం ప్రకారం, ప్రభుత్వ విధానాలను అతిక్రమించిన రైతులపై చర్యలు తీసుకునే అధికారాన్ని కెనాల్ ఆఫీసర్లకు కట్టబెట్టింది. ఎక్కడైనా అనుకోకుండా, నీరు లీకైనా, మరో రీతిలో ఉపయోగించబడినా, రైతులు చార్జీలతో పాటుగా, అపరాధ రుసుము కూడా అనివార్యంగా చెల్లించాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. దీనిలో భాగంగా రైతు 10 వేల రూపాయల నుండీ, 6 నెలల జైలుశిక్ష వరకూ, ఆయా సందర్భాలలో విధించిన శిక్షను అనుభవించాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించింది.

### పబ్లిక్ హియరింగ్స్

"ధోలేరా పర్యావరణ నివేదిక స్పష్టీకరిం

**❝ భూములు కోల్పోతున్న రైతుల అంగీకారం తప్పని సరి అన్న నిబంధనను తుంగలో తొక్కింది. ప్రాజెక్టుల వలన సమాజానికి జరగబోతున్న నష్టాలను, ఎల్ఎఆర్ఆర్ యాక్ట్‌ని ఉల్లంఘిస్తున్న అధికారులను, న్యాయ సిబ్బందిని చూసీ చూడ నట్లుగా వదిలేస్తూ వ్యవహరించింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఎల్.ఎ.ఆర్.ఆర్. చట్టాన్ని నిర్వీర్యం చేసింది.❞**

చిన అంశం ఏమనగా 'సర్ అభివృద్ధి పట్ల రైతుల, గ్రామస్తుల దృక్పథం సానుకూలంగా ఉంది. కానీ వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది... తమ ప్రాంతాలలోకి అధికార గణం రాకూడ దని, వారి రాకను నిషేధిస్తూ గ్రామాలలో ప్రజలు నోటీసు బోర్డులు పెట్టారు. 2014 జనవరి 3వ తేదీన అహ్మదాబాద్ జిల్లా మేజి స్ట్రేట్ అధ్యక్షతన, గుజరాత్ కాలుష్య నివారణ బోర్డు / గుజరాత్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్వహించిన ఎన్విరాన్‌మెంటల్ పబ్లిక్ హియ రింగ్‌లో, రెండువేల మంది ప్రజలు, సామాజిక కార్యకర్తలు హాజరై, ఈ ప్రాజెక్టు పట్ల తమకున్న వ్యతిరేకతను, అభ్యంతరాలను స్పష్టీకరించారు. పరీవాహక ప్రాంత పరిరక్షణను ప్రభుత్వం ఉ ల్లంఘిస్తున్నదని 2011 గణాంకాలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ 2001 గణాంకాలపై ఆధారపడటాన్ని అనేకమంది తూర్పారబట్టారు.

ప్రణాళికలో చూపబడిన భూభాగంలో కొంతభాగం సముద్రతీరంలో ఉండగా, అక్కడ ప్రతి సంవత్సరం ఒక సెంటీమీటరు చొప్పున కుదించుకుపోతూ, కోసుకుపోవడాన్ని సైతం ఎత్తిచూపారు. అంతేగాక జలాల పెంపకంలో ధోలేరా సర్‌లో స్పష్టత లేకపోవడం కూడా కమిటీ దృష్టికి తెచ్చారు. ఇందులో భాగస్వామ్య మున్న 'కల్పసార్ ప్రాజెక్టు' కూడా వివాదాలలో కూరుకొని ఉండడం, సముద్ర తీరాన, పర్యావర ణంపై ప్రభుత్వం విధానం మొదలగు విషయా లను కూడా విస్తృతంగా చర్చించారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ కార్యకర్తలు, ఛిద్రమైపో బోతున్న అటవీ జంతువుల జీవితాన్ని, కోల్పోబో తున్న జీవరాశుల గూర్చి అభ్యంతరాలు వ్యక్తీక రించారు. మానవాభివృద్ధి పేరిట, జంతుహ ననం తగదని వారించారు. సర్ యొక్క పరిది నుండి బ్లాక్‌బక్ నేషనల్ పార్క్ కేవలం 600 మీటర్ల దూరంలోనే ఉంది. భారతదేశంలోని అత్యధిక కార్మికులు ఇక్కడే నివసిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అత్యల్ప సంఖ్యలో ఉ న్న 'దాల్మా థియన్ పెలికాన్స్' ఇంపీరియల్ ఈగిల్', 'హేబారా బస్టర్డ్స్' మరియు 'స్టోలోక్ఝూ బుస్క్యూట్' మొదలగు జంతు సమూహం ఈ పార్క్ పరిధిలోనే నివసిస్తున్నాయి. ఆసియా ఖండానికి, శీతాకాలంలో వలస వచ్చే పక్షుల సమూహానికి సైతం ఈ ప్రాజెక్టు హాని కలిగిస్తుం ది. ఈ విధంగా వచ్చే వాటిని, ఈ ప్రాజెక్టు నిర్మాణం ద్వారా నిరోధించడం చట్టం వ్యతి రేకం. ముంబైకి చెందిన 'ది ఇండియన్ బర్డ్ కన్జర్వేషన్ నెట్‌వర్క్' అనే 'నేచురల్ హిస్టరీ సొసై టీ' ఈ ప్రాంతాన్ని 'ప్రత్యేక పక్షుల ఆవాసం'గా గుర్తించింది. అంతేగాక 1,536 హెక్టార్ల దట్టమైన అటవీ ప్రాంతం సైతం కనుమరు గవుతుంది. ఎన్నో సాంకేతిక అవరోధాలను గుర్తించింది. ప్రజల వాదనలు వినాల్సిన సమ యాన్ని అర్ధాంతరంగా ముగించి, నిర్ణీత సమ యానికి ముందే అధికారగణం వెళ్ళిపోయారు. అంతేగాక అభ్యంతరాలు వ్యక్తీకరిస్తున్న ప్రజా నీకం మాటలకు అడ్డుపడుతూ, వారి వద్దనున్న మైకులను కూడా సర్‌కి అనుకూలమైన అధి కారులు లాగేశారు. కేవలం ఈ ప్రాంతంలోనే గాక, ఇలాంటి సంఘటనలే 'దహేజ్ పెట్రోల్' బారూచ్‌లోని కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ ఇన్‌వెస్ట్‌మెంట్ రీజియన్'లో కూడా పునరావృత మయ్యాయి. ప్రజలు తమ అభ్యంతరాలను, ఫిర్యాదులను ఒకరి తర్వాత ఒకరు వ్యక్తీకరిస్తున్న ప్పటికీ, సాయంకాలం ఆరుగంటలయ్యింది, సమయం ముగిసిపోయిందని, జిల్లా కలెక్టరు సైతం సభలు ముగించి, ఇతర అభ్యంతరాలుం టే లిఖిత పూర్వకంగా తన ఆఫీసులో అందించా లని ఆదేశించి వెళ్ళిపోయారు.

**సామాజిక, పర్యావరణ పరమైన నష్టాలు**

రైతుల వ్యక్తిగత ప్రయోజనాలను, పర్యా వరణాన్ని సహజ వనరులను, శ్రామికశక్తిని చట్ట పరిధిలో రక్షించాల్సి ఉండగా, ప్రాంతీయ ప్రభు త్వంలోని అధికారగణం తద్భిన్నంగా వ్యవహ రిస్తూ, ప్రజానీకాన్ని బెదిరింపులకు లోను చేసింది. భూములు కోల్పోతున్న రైతుల అంగీ కారం తప్పనిసరి అన్న నిబంధనను తుంగలో తొక్కింది. ప్రాజెక్టుల వలన సమాజానికి జరగబో తున్న నష్టాలను, ఎల్.ఎ.ఆర్.ఆర్. యాక్ట్‌ని ఉ ల్లంఘిస్తున్న అధికారులను, న్యాయ సిబ్బందిని చూసీ చూడనట్లుగా వదిలేస్తూ వ్యవహరించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎల్.ఎ.ఆర్.ఆర్. చట్టాన్ని నిర్వీర్యం చేసింది. పర్యావరణ పరిరక్షణ ప్రధాన బాధ్యులైన పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తమ బాధ్యతలను నీరుగార్చి, పట్టణాభి వృద్ధికై పరుగులు పెడుతూ, ఏ పనికై తాము నియమింపబడ్డారో ఆ బాధ్యతను గాలికొది లేశారు. నూతన ప్రాజెక్టులకు అనుమతులివ్వ డంలో ఉత్సాహం ప్రదర్శిస్తున్న ఈ మంత్రిత్వ శాఖలో చట్టాలను పునఃవ్యవస్థీకృతం చేయడం కోసం ఓ కమిటీ ఏర్పడడం కూడా జరిగింది.

జలాలు, గాలి, అటవీ చట్టాలపై సమీక్ష జరిపి, అతికొద్దికాలంలోనే హెచ్.ఎల్.సి. ప్రభు త్వానికి నివేదికను సమర్పించింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలతోగానీ, స్థానిక వర్గాలతోటి గానీ ఎలాంటి సంప్రదింపులు జరుపలేదు. సల హాలు స్వీకరించలేదు. బెంగళూరులో పర్యావర ణవేత్తలతో, ప్రజానీకంతో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఎదురైన ప్రశ్నలకు సమాధానమివ్వలేక, తనవద్ద సరైన జవాబులు లేక, కమిటీ ఛైర్మన్ టి.ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం మధ్యలోనే లేచి వెళ్ళిపోయారు. హెచ్.ఎల్.సి. సిఫార్సులలో ప్రధానంగా 70 శాతం కన్నా అధికంగా ఉన్న దట్టమైన అడవుల ను మాత్రమే 'ప్రవేశించడానికి వీలులేని 'నో-గో జోన్‌గా ప్రకటించాలని, పరిగణలోనికి తీసుకో వాల్సిన వివిధ రకాల సమస్యలపై కొన్ని అస్పష్ట మైన సిఫార్సులను చేసింది.

ఈ నివేదిక భారతదేశ పర్యావరణ సమతు ల్యతను ప్రమాదంలోకి నెట్టేస్తుంది. గత చరిత్రను దృష్టిలో ఉంచుకోకుండా ప్రభుత్వం హఠాత్తుగా మరెన్నో మార్పులు చేర్పులు తీసుకొచ్చే ప్రమా దం సైతం పొంచి ఉంది. పర్యావరణం పట్ల శ్రద్ధ, ఆసక్తి పచ్చటి పంట పొలాల పరిరక్షణ పట్ల ఆసక్తిగల సమస్త ప్రజానీకం ఈ ప్రాజెక్టు పట్ల వ్యతిరేకతను భిన్న రూపాలలో ప్రకటిస్తు న్నారు. అమ్ముడుపోయిన కొన్ని పత్రికలు సమస్త సమాచారాన్ని వడకట్టేసి, వార్తలను ప్రచురిస్తు న్నాయి. ఈ మొత్తం పోరాట ప్రక్రియ కేవలం భూముల రక్షణకోసం, పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమే కాదు. ఈ విధానాలకు వ్యతి రేకంగా పోరాడకపోతే భారత ప్రజాస్వామ్యానికే ప్రమాదకరంగా పరిణమిస్తాయి.

అనువాదం : డాక్టర్ శమంతకమణి

# అస్తిత్వవాదమా? విముక్తి మార్గమా?

**ఎస్.వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

*అస్తిత్వవాదంతో విముక్తి సాధించలేమా?*

*అస్తిత్వవాదానికి పునాది ఏమిటి?*

*పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో సామాజిక న్యాయం సాధ్యమా?*

*కులం పరిధిలో విశ్లేషణ విముక్తి సాధనకు మార్గమవుతుందా?*

ఇలాంటివే అనేక ప్రశ్నలు. సామాజిక న్యాయం కోసం, సమగ్రాభివృద్ధి కోసం పోరాడే క్రమంలో ఇవన్నీ సహజమైన ప్రశ్నలే. పోరాటం ఉధృతమయ్యేకొద్దీ ఇలాంటివే మరికొన్ని ప్రశ్నలు ముందుకొస్తూనే ఉంటాయి. సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవలిసిందే. ఉద్యమం ముందుకు సాగవలసిందే. పార్టీ శ్రేణు లలో గందరగోళం ఏర్పడేందుకు అవకాశం ఉన్న సమస్యలే ఇవి. అయినా ఆందోళన చెందవలసిన ప్రశ్నలు కాదు. స్పష్టతనేర్పరుచు కుంటూ ముందుకు సాగడమే మార్గం. చిక్కుముడి విప్పవలసినప్పుడు ఇబ్బందిగానే ఉంటుంది. అయినా ఓర్పుతో, సహనంతో చిక్కుముడులు విప్పుకుంటూ, దారులు సుగమం చేసుకోవటమే కమ్యూనిస్టుల పని. రెడీమేడ్ దారులేవీ సిద్ధంగా ఉండవు.

### సామాజిక చైతన్యం

ఒక కులం ఉన్నంతకాలం మరో కులం కూడా ఉంటుంది. కులవ్యవస్థ కొనసాగుతుంది. ఏ కులమూ ఉండకూడదు అనుకున్నప్పుడే కులవ్యవస్థ బలహీనపడుతుంది. కులాన్ని కాపాడే చర్యలు కులవ్యవస్థ దుర్లక్షణాలన్నీ కొనసాగడానికే తోడ్పడతాయి. కులం అస్తిత్వం, కులానికి గుర్తింపు వంటి నినాదాలు కుల వ్యవస్థను కాపాడతాయి. ఆధునిక సమాజంలో అస్తిత్వం, గుర్తింపు వంటి నినాదాలు ముందుకొచ్చాయి. బ్రాహ్మణులకు తప్ప ఇతరులకు చదువుకునే అవకాశం లేకపోవటం, దళితులకూ, శూద్రులకూ ఆస్తిహక్కు నిరాకరించటం, మరో వైపు పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి కాని నేపథ్యంలో మనువాద భావజాలానికి తల వంచారు. కానీ పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించటం, స్వాతంత్ర్యానంతరం చదువుకునే హక్కు, ఆస్తిహక్కు రాజ్యాంగబద్ధం కావటంతో అందరికీ చదువుకునే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇది స్వాతంత్ర్యోద్యమ ఫలితం. అంబేద్కర్ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాట ఫలితంగా వచ్చిన రిజర్వేషన్లు మరిన్ని అవకాశాలు కల్పించాయి. ఫలితంగా దళితులు, వెనకబడిన తరగతుల నుండి గణనీయమైన సంఖ్యలో చదువుకున్నవారు, ఉద్యోగాలు పొందినవారి సంఖ్య పెరిగింది. ప్రజాస్వామ్య వాంఛ బలపడింది. నూతన చైతన్యం పొందగలిగారు. అందుకే కులవివక్ష, అణచివేత, అవమానాలను సహించడానికి సిద్ధంగా లేరు. రకరకాల రూపాలలో ప్రతిఘటించడం మొదలైంది. ఈ ప్రజాస్వామిక ప్రతిస్పందనకు అగ్రవర్ణ పెత్తందారీతనం తట్టుకోలేకపోతున్నది. మనువాద భావజాలం తోకతొక్కిన పాములా బుసలు కొడుతున్నది. కులదురహంకార దాడులకు, హత్యలకు పాల్పడుతున్నది. అణగారిన తరగతులలో ఇది మరింత ఆవేశానికి దారితీస్తున్నది. చదువుకున్నవారిలో పరిపరి విధాల ఆలోచనకు దారితీస్తున్నది. పరిష్కార మార్గం కోసం పరితపిస్తున్నారు. ఈ క్రమంలోనే విముక్తి మార్గం కోసం వెతుకులాడుతున్నారు. అస్తిత్వాన్ని చాటుకోవటం, గుర్తింపు కోసం పోరాడటమే మార్గమని పొరపాటు పడుతున్నారు. ఈ బుద్ధిజీవుల మేధోమథనంలో మార్క్సిస్టుల జోక్యం ద్వారానే విముక్తి మార్గాన్ని ఎంచుకోవటం సాధ్యపడుతుంది. సామాజిక న్యాయం కోసం, కులవివక్షకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలవడం ద్వారానే ఇది సాధ్యం.

### కులసంఘాల మీద పాలకులకెందుకు ఈ ప్రేమ?

దళిత, గిరిజన, వెనకబడిన తరగతుల లోని చదువుకున్నవారు అనేకమంది అస్తిత్వవాదమే విముక్తి మార్గమని నమ్మటం వల్లనే ఆ బాటలో నడుస్తున్నారు. అది విముక్తి మార్గం కాదని అర్థమయినప్పుడు, సరైన దారి దొరికినప్పుడు ఉద్యమం ఊపందుకుంటుంది. కుల వివక్షను, కులవ్యవస్థను విమర్శిస్తూనే ఆచరణలో కులాన్ని కాపాడేదే అస్తిత్వవాదం. కులం అస్తిత్వాన్ని ప్రశ్నించకుండా, కులవ్యవస్థను ధ్వంసం చేయకుండా దళితులకు, వెనకబడిన తరగతు లకు విముక్తి సాధ్యం కాదు. అంతేకాదు, అస్తిత్వ వాదం దోపిడీవ్యవస్థను కాపాడుతుంది. కుల వివక్ష వ్యతిరేక పోరాటం, కులవ్యవస్థ మీద ఎక్కుపెట్టిన పోరాటం, కులం రూపుమాపటం కోసం సాగే యుద్ధం దోపిడీ వ్యవస్థను అంతం చేసేందుకు తోడ్పడుతుంది. శ్రామికవర్గ పోరాటాన్ని ఉధృతం చేస్తుంది. విస్తృతపరుస్తుంది. దీన్ని నివారించేందుకే అస్తిత్వవాదం పట్ల పాలక వర్గాలకు అమితమైన ప్రేమ. కులసంఘాల మీద పాలకులు ఒలకబోసే ప్రేమ మర్మం ఇదే.

### పాలకవర్గాల ఎత్తుగడలు

స్వాతంత్ర్యానంతరం రిజర్వేషన్ సౌకర్యాలతో పాటు పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ రాజ్యం పేరుతో ప్రభు త్వాలు ప్రకటించిన పథకాలు కొందరికి వెసులు బాటు కల్పించాయి. చిన్న చిన్న కాంట్రాక్టర్లు, వ్యాపారులు, పెట్టుబడిదారులుగా కొందరు ఎదగడానికి అవకాశం వచ్చింది. ఆయా తరగ తుల నుండి చదువుకున్నవారిలో ఇది కొత్త ఆశలకు బాటలు వేయటం సహజం. అణగారిన తరగతుల నుండి అక్షరజ్ఞానం పొందినవారు, మేధావులు తమ సామాజిక

"మరోవైపు సామాజిక న్యాయం కోసం జరిగే ఈ కృషి కులాన్ని బలహీనపర్చదు, కొనసాగిస్తుంది. పాలక వర్గాల ప్రయోజనాలకు ఇది ఆటంకం కాదు. ఈ బల హీనతను కూడా అర్థం చేసుకోవాలి. కమ్యూనిస్టులు సామాజిక న్యాయం కోసం మాత్రమే కాకుండా కులవివక్ష మీద తిరుగుబాటుకూ, కుల నిర్మూలనకూ కృషి చేస్తారు. అందుకే కమ్యూనిస్టుల లక్ష్యం మరింత గొప్పది."



కులాల పేరుతో సమీకరణలు

విముక్తి కోసం ఆలోచించకుండా, తమ సహచరులైన గ్రామీణ పేదలకు న్యాయం కోసం పనిచేయకుండా, కొద్దిమందికి ఆశలు చూపి లోబర్చుకోవటమే పాలకవర్గాల ఎత్తుగడగా ఉన్నది. అందుకే విముక్తి మార్గం వైపు దృష్టి సారించకుండా అస్తిత్వ భావజాలంలో కొట్టుమిట్టాడేటట్టు చేయటమే పాలకవర్గాల లక్ష్యం. అందుకోసమే ప్రేమ ఒలకబోస్తారు. కొద్దిమందికి పదవులు, ఆర్థిక ప్రయోజనాలు ఎరవేసి లోబర్చుకుంటారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన అశేష ప్రజానీకాన్ని మాత్రం మనుషులుగా చూడరు. ఆర్థికరంగంలో కొనుగోలుదారులుగానూ, రాజకీయ రంగంలో ఓటర్లుగానూ మాత్రమే చూస్తారు. పౌరులుగా చూడ నిరాకరిస్తారు. పౌరహక్కులు తిరస్కరిస్తారు. సంక్షేమ పథకాలతో ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తారు. ఈ సందర్భంగానే ఒక అనుభవాన్ని పరిశీలించాలి. అనేక సంవత్సరాల పాటు బడుగు, బలహీన వర్గాల గురుకుల పాఠశాలల్లో ఎస్‌ఎఫ్‌ఐ చురు కుగా పనిచేసింది. దళితులు, గిరిజనుల నుండి మెరికల్లాంటి చురుకైన విద్యార్థినీ విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ నినాదాన్ని అందిపుచ్చుకున్నారు. దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు జెండా ఎగరవేశారు. ఇది గమనించిన పాలకవర్గాలు గురుకుల పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థు లను, అక్కడ విద్యాభ్యాసం పూర్తిచేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉన్నవారినీ కలుపుకుని వారికోసమే ప్రత్యేక సంఘం ప్రారంభించారు. ఉన్నతాధికారులే సూత్రధారులుగా వ్యవహరిస్తు న్నారు. క్రమంగా ఆ సంఘం నాయకత్వ స్థానాల నుండి ఎస్‌ఎఫ్‌ఐ వాసనలున్నవారిని పక్కన పెట్టారు. ఇప్పుడు గురుకుల పాఠశాలల్లో ఎస్ ఎఫ్ఐ అడుగుపెట్టకుండా ఆంక్షలు విధించారు. "ఏమైనా చేయండి..ఎదగండి" అనే నినాదం ఇస్తున్నారు. దళితులు అభివృద్ధి చెందాలనే పేరుతో, సంపాదించాలనే పేరుతో, పరస్పరం సహకరించుకోవాలనే పేరుతో నీతి, అవినీతిని పక్కన పెట్టాలనీ, సంపాదించడమే పరమావధిగా సాగాలనీ బోధిస్తున్నారు. దోపిడీ వ్యవస్థ మీద పోరాటం కాదు, దోపిడీ చేసయినా ఎదగాలంటున్నారు. అస్తిత్వ భావజాలం అంటిస్తున్నారు. బడుగు బలహీన వర్గాలలోని ప్రజాస్వామిక వాంఛలను ఆసరా చేసుకుని పబ్బం గడుపుకునేందుకు పాలకవర్గాలు విసురుతున్న పాచికలివి. ఈ ప్రజాస్వామిక వాంఛలు, హక్కుల కోసం పడే ఆరాటం దోపిడీ వ్యవస్థ మీద పోరాటానికి దారి తీయకుండా పాలక వర్గాలు పన్నుతున్న పన్నాగమిది.

**వర్గ సమాజంలో సామాజిక న్యాయం సాధ్యమా?**

పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో సామాజిక న్యాయం సాధించడానికి ఉన్న అవకాశాలేమిటి అన్నది ఒక సమస్య. అది సాధ్యపడుతుందను కున్నప్పటికీ బడుగు బలహీన వర్గాలలోని అత్యధికులకు దానివల్ల జరిగే మేలు ఎంత అన్నది మరో ప్రశ్న. రిజర్వేషన్లు, వాటా, గుర్తింపు, గౌరవం వంటివి ప్రజాస్వామిక వాంఛలే. ఆయా తరగతులలోని కొంతమందికైనా కొంతమేరకు మేలు చేకూర్చవచ్చు. ఆ మేరకైనా ప్రయోజనం కోసం పోరాడటం తప్పు కాదు. కొంతమందయినా కాంట్రాక్టర్లుగానో, చిన్న చిన్న పారిశ్రామికవేత్తలుగానో తయారయ్యేందుకు అవకాశాలు ఉండవచ్చు. సరళీకృత ఆర్థిక విధా నాల పర్యవసానంగా ఉద్యోగావకాశాలు మాత్రం కుదించుకుపోతున్నాయి. మరోవైపు సామాజిక న్యాయం కోసం జరిగే ఈ కృషి కులాన్ని బలహీనపర్చదు, కొనసాగిస్తుంది. పాల కవర్గాల ప్రయోజనాలకు ఇది ఆటంకం కాదు. ఈ బలహీనతను కూడా అర్థం చేసుకోవాలి. కమ్యూనిస్టులు సామాజిక న్యాయం కోసం మాత్రమే కాకుండా కులవివక్ష మీద తిరుగు బాటుకూ, కుల నిర్మూలనకూ కృషి చేస్తారు. అందుకే కమ్యూనిస్టుల లక్ష్యం మరింత గొప్పది.

అన్ని కులాలూ సమానమేననీ, అన్ని రంగాలలోనూ తమ వాటా పొందటం, సమ భావం, సమాన గౌరవం పొందటమే సామాజిక న్యాయమనీ, దానికోసమే పోరాడాలన్న వాదన ఉన్నది. ఇది సాధ్యపడుతుందని కాసేపు నమ్మినా, ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలలో వాటా పొందేందుకు, కొద్దిమంది పెట్టుబడిదారులుగా, కాంట్రాక్టర్లుగా తమ వాటా సంపాదించుకునే మేరకు తోడ్పడుతుందేమో తప్ప అందరికీ ఉపాధి పొందేందుకు గానీ, సామర్థ్యానికి తగిన అవకాశాలను అందుకునేందుకు గానీ ఉపయోగపడదు. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో ఇది సాధ్యం కాదుగదా. అంతేకాదు, కులం ఉన్న తరువాత కులాల మధ్య సమానత్వం నేతిబీరకాయలో నెయ్యి వంటిదే. కులం ఉండట

మంటేనే అది నిచ్చెనమెట్ల కులవ్యవస్థగానే ఉంటుంది. సమభావానికీ, సమాన గౌరవానికీ స్థానం లేదు. అది సాధ్యపడితే పెట్టుబడిదారులకేమీ ప్రయోజనం లేదు. కులాల పేరుతో శ్రామి కులను విభజించి పోరాటాలను అణచివేయటమే వారి లక్ష్యం. కులాల కుమ్ములాటలుంటేనే, కులవివక్ష కొనసాగితేనే పెట్టుబడిదారీ వర్గానికి ప్రయోజనం. అస్తిత్వవాదాన్నీ, కుల సంఘాలనూ పాలకవర్గాలు పెంచి పోషించేది ఇందుకోసమే. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో సామాజిక న్యాయం మేరకైనా సాధించగలుగుతామనుకోవటం కూడా ఊహాజనితమే. వర్గ సమాజంలో సమభావం, సమన్యాయం సాధ్యం కాదు. ఒకవైపు కులదురహంకార దాడులకు, హత్యలకు పాలకవర్గాలు అండగా నిలుస్తాయి. మరోవైపు దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులను అగ్రకులాలపై పోరాటం పేరుతో ఎగదోస్తారు. అంతిమంగా వారికి కావలసింది కుల కొట్లాటలే. కుల కొట్లాటలు లేకపోతే వర్గ పోరాటానికి దారి తీస్తాయి. వర్గ పోరాటాన్ని విచ్ఛిన్నం చేయాలంటే కుల కొట్లాటలను ప్రోత్సహించాలి. ఇప్పుడు పాలకవర్గాలు చేస్తున్న ప్రయత్నమదే. మరోవైపు కులవివక్ష మీద పోరాటం, కుల నిర్మూలన కోసం జరిగే కృషి, కుల వ్యవస్థను ధ్వంసంచేసే లక్ష్యం ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలన్నింటిలోనూ విముక్తికి బాటలు వేస్తుం ది. అందుకే కమ్యూనిస్టుల లక్ష్యం ఉన్నతమైనది.

**కులమే కులతత్వానికి పునాది**

కులం పరిధిలో చేసే ఏ విశ్లేషణ అయినా, ఏ నినాదం అయినా కులాన్ని కాపాడుతుంది. కానీ వివక్ష అంతం కావాలంటే కులాన్ని ధ్వంసం చేయాలి. మార్పుకు దోహదం చేయాలి. కుల వ్యవస్థ నాశనం కావాలి. కులం చట్రం బద్దలు కావాలి. అందుకే కులం పరిధి దాటి ఆలోచించాలి. కుల పీడన మీద తిరగబడాలి. మాట్లాడినా, రాసినా, పోరాడినా ఈ దిశలోనే సాగాలి. కులం మీద పోరాటం వేరు, కొన్ని కులాల మీద పోరాటం వేరు. కులం మీద పోరాటం కుల నిర్మూలనకు బాటలు వేస్తుంది. కొన్ని కులాల మీద పోరాటం కుల కొట్లాటలకు దారితీస్తుంది. మనం వేసే ప్రతి అడుగూ కులాన్ని బలహీనపర్చేందుకే ఉపయోగపడాలి. అన్ని కులాలలోని మిత్రులను కూడగట్టేందుకు తోడ్పడాలి. అగ్రకులాలను విమర్శించటం సులభం. ఆ నినాదాలతో అణగారిన కులాలను ఆకర్షించటం సులభం. తరతరాల అణచివేతకు గురయిన ఫలితంగా సులభంగా ఆకర్షితులవు తారు. కానీ ఆధిపత్యం మీద పోరాటం చాలా కష్టం. కుల నిర్మూలన కోసం జరిగే కృషి చాలా కష్టం. అందుకే దగ్గరదారి వెతుక్కునే ప్రయత్నం లో తప్పటడుగులు పడుతుంటాయి. ఆధిపత్యం చెలాయించే కులమయినా, ఆధిపత్యానికి గురయ్యే కులమయినా ఒక కులంగా దాని లక్షణం ఒక్కటే. ఐక్యం కాకుండా విభజించడమే దాని లక్షణం. కులం అస్తిత్వాన్ని సమర్థించడం అంటే అది కులతత్వమే. ఎందుకంటే ఒక కులం ఉన్న తరువాత మరో కులం కూడా ఉంటుంది. కులం ఉండటమంటే కులతత్వం ఉంటుంది. అందుకే బడుగు బలహీన వర్గాలలో సైతం కులతత్వాన్ని నిర్మూలించవలసిందే. దళితులు, వెనకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులలో సైతం పరస్పరం బద్ధ విరుద్ధంగా వ్యవహరించే కులతత్వాన్ని మనం గమనిస్తాం. చదువుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్న దళిత యువకుడు, బీసీ లేదా అగ్రకులాలకు చెందిన నిరుపేద యువతిని పెండ్లి చేసుకోవడానికి సిద్ధ పడినప్పటికీ అమ్మాయి దొరకడం కష్టమయిన అనుభవాలున్నాయి. అగ్రకులం లేదా బీసీ కులాలకు చెందిన ఆర్థికంగా ఇబ్బందులు లేని యువకులు కూడా దళిత అమ్మాయిని పెండ్లి చేసుకోవడానికి సిద్ధపడినప్పటికీ ఎవరూ ముందుకురాని సంద ర్భాలున్నాయి.

వీటికి అడ్డుగోడలుగా పనిచేస్తు న్నది కులతత్వమే. (ప్రేమించి పెండ్లి చేసుకున్న సందర్భాలు ఇందుకు మినహాయింపు). అందువల్ల కులతత్వం, ఛాందసత్వం కొన్ని కులాల్లోనే ఉంటాయనుకోవటం పొరపాటు. కులం అస్తిత్వమే కులతత్వానికి పునాది. అందుకే కులం అస్తిత్వాన్నే ప్రశ్నించాలి. కులవివక్షను ప్రతిఘటించాలి. కులవ్యవస్థ మీద పోరాడాలి.

❊

## వెనిజులా బొలివేరియన్ విప్లవం గుణపాఠాలు

(26వ పేజీ తరువాయి)

మొదటి వ్యక్తి. ఉదాహరణకు 1948లో వెని జులాలో రోమిలో గాలెగోస్, 1954లో గ్వాటె మాలాలో జాకోబ్ అర్బెంజ్, 1955లో అర్జెం టైనాలో జాన్ డొమింగో పెరోన్, 1964లో బ్రెజిల్‌లో జవావో గోలర్ట్, 1973లో చిలీలో సాల్వడార్ అలెండీలను చెప్పుకోవచ్చు. మదురో చావెజ్ నుంచి ఈ వారసత్వాన్ని పొందాడు. చావెజ్ అధ్యక్ష ఎన్నికలలో తాను గెలవక ముందు నుంచి సోషలిజం కోసం జరిగే పోరాటంలో రాజ్యాధికారం ఏంతో కీలకం అన్న విషయాన్ని గుర్తించాడు. అందువలన దానిని సాధించడం మిగిలిన వాటన్నిటి కంటే ముఖ్యం అనుకున్నాడు. అందువలననే కొంతమంది. ప్రభుత్వానికి ఇప్పుడు మద్దత్తు యాభై శాతం కన్నా తక్కువ ఉంది. కాబట్టి అధికారాన్ని వది లేయాలని కొందరు చావిస్తాలు అంటే మదురో ఒప్పుకోలేదు.

అయితే అధికారాన్ని పొందడం, నిలుపుకో వడమే విప్లవానికి సరిపోదు. చావిస్తా అవగా హన ప్రకారం పాత రాజ్యం, కొత్త రాజ్యం కొన్ని రోజులు కలిసే పనిచేస్తాయి . ఇది లెనిన్ ప్రాచీన 'ద్వికేంద్ర అధికార' ఎత్తుగడకు విరుద్ధం. లెనిన్ పాత రాజ్యాన్ని శత్రువుగా చూడాలన్న విధానాన్ని అనుసరించాడు. అయితే వామపక్ష వాదులు పాత రాజ్యంలో పనిచేయవలసి రావ డం న్యాయమే కానీ అందువలన దాని అవినీతి ప్రభావాలు పడతాయని చెప్పారు . వెనిజులాలో సంప్రదాయకంగానే స్థానిక హక్కులు, సమా నత్వం, పర్యావరణ న్యాయం వంటి సామాజిక ఉద్యమాలు బలహీనంగా ఉన్నాయి. ఇదే వెని జులా, బొలీవియాల మధ్య తేడా. బొలీవియా లో ఇటువంటి ఉద్యమాల ద్వారా ఇవో మొరెల్స్ పార్టీ బలపడింది. వెనిజులాలో బలమయిన స్వతంత్ర పునాది లేకపోవడం వలన పార్టీయే మూలాధారం. దేశంలో ఉద్యోగస్వామ్యం, అవి నీతి, అసమర్థత తగ్గాలంటే, అంతర్గత ప్రజాస్వామ్యం బలపడాలంటే పిఎస్‌యూవి మరింత స్వతంత్రంగా ఉండాలి. విధేయులైన, విషయా లను కూలంకషంగా తెలిసిన సభ్యులు మరింత నిర్ణయాధికారం, అంతర్గత భాగస్వా మ్యం కోరుకుంటున్న సందర్భంలో పాలక పార్టీ ఎదుట రెండు సవాళ్లున్నాయి. మొదటిది బూర్జువావర్గ ప్రభావానికి అడ్డుకట్ట వేయకపోతే బూర్జువాలతో ప్రభుత్వ బంధాలు బలపడతాయి. సోషలిజం పట్ల నాయకత్వ యొక్క నిబద్ధత తగ్గుతుంది. రెండవది ఎత్తుగడల రీత్యా రెండు వర్గాల మధ్య పనిచేయ వలసి వస్తే, వామపక్షం రక్షణలో పడిన ప్పుడు ప్రజల భావాలను సరిగ్గా తెలుసుకోగల సాన్నిహిత్యం ఉండాలి. నిర్ణయా లు చేయడం అధ్యక్షుని ఆంతరంగికుల లేదా కేవలం పార్టీ కేంద్ర నాయకత్వం హక్కు కాకూ దదు. సూత్ర బద్ధ వైఖరి కోసమే కాక, విప్లవం కొనసాగాలన్నా వెనిజులాలో ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకుపోవటం ఎంతైనా అవసరం.

**అనువాదం : కె. ఉషారాణి**

# టాటూ వీరులు

(2వ పేజీ తరువాయి)

వారి నాయకులతో సంప్రదింపులు ప్రారంభిం చాడు. యుద్ధప్రభువులైనా లియూ సియాంగ్, లియూ వెన్ హుయిలంటేనూ, కొమింటాగ్ అంటేనూ లోలో ప్రజలకు పడదనీ, కమ్యూ నిస్టులు కూడా వారికి వ్యతిరేకమని ఆయన చెప్పాడు. తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని లోలోప్రజలు వాంఛిస్తున్నారు. చైనాలోని మైనారిటి జాతులన్నింటికీ స్వతంత్ర ప్రతిపత్తి వుండాలని కమ్యూనిస్టుల విధానం. చైనీయులు తమను పీడిస్తున్నారని వారంటే లోలో ప్రజలకు ద్వేషం, అయితే లోలో ప్రజల్లో "తెల్లవారు" నల్లవారు" ఉన్నట్టుగానే చైనీయుల్లో గూడా "తెల్లవారు" "ఎర్రవారు" ఉన్నారు. లోలో ప్రజల్ని ఎల్లప్పుడూ చంపివేస్తూ పీడిస్తుండేవారు తెల్లచైనీయులు. ఎర్రచైనీయులు, నల్లలోలోలు తమ ఉమ్మడి శత్రువులైన తెల్ల చైనీయులకు వ్యతిరేకంగా ఎందుకు ఐక్యం కాకూడదు? ఈ విషయాన్ని లోలో ప్రజలు ఆసక్తిదాయకంగా విన్నారు. తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొ నటానికి ఆయుధాలు, తూటాలు ఇమ్మని నేర్పు గా అడిగారు. తెల్లచైనీయులతో పోరాడటానికి ఎర్రచైనీయులకు సహాయపడతామని చెప్పారు. వారికి ఆశ్చర్యం కలిగించే విధంగా ఆ రెంటినీ వారికిచ్చారు.

ఆ విధంగా వేగంగా వెళ్లటానికే కాకుండా రాజకీయంగా వుపయోగకరమైన మార్గం కూడా ఏర్పడింది. ఉమ్మడి శత్రువుతో పోరాడటానికి టాటూ నది వద్దకు వెళ్లటానికి 'ఎర్ర' చైనీయు లతోపాటు వందలాది లోలో ప్రజలు ముందు కొచ్చారు. కొంతమంది లోలో ప్రజలు వాయువ్యానికి పోవటానిక్కూడా సిద్ధమయ్యారు. లియూ పో చెంగ్ లోలో ప్రజల ముఖ్య నాయకుడి ఎదుట అప్పుడే చంపిన ఒక కోడి రక్తాన్ని తాగాడు. ఆ లోలో నాయకుడు కూడా అలాగే తాగాడు. ఆ విధంగా ఇద్దరూ కొండ జాతి ప్రజల సాంప్రదాయం ప్రకారం రక్త సంబంధమైన సోదరత్వాన్ని నిలుపుకోవాలని ప్రమాణాలు చేసుకొన్నారు. తమ ఒప్పందంలోని షరతుల్ని ఎవరు ఉల్లంఘించినా కొండ కోడిపెట్ట లాంటి బలహీనులుగానూ, పిరికివాళ్లుగానూ చూడబడాలని కమ్యూనిస్టులు ప్రమాణం చేశారు.

ఆ విధంగా ప్రథమ సైనిక కోర్‌కు చెందిన ఒక అగ్రగామి డివిజన్ లిన్‌పియావో నాయక త్వాన టాటూ హోకు చేరుకున్నది. తమ ప్రయాణంలో చివరి రోజున లోలో రాజ్యంలోని అడ వుల నుండి బయటకు వచ్చి ఎవరికీ తెలియ కుండా లోగ చౌపింగ్ కోట, పట్టణానికీ చేరుకున్నట్లుగానే ఇప్పుడు నది ఒడ్డున వున్న ఆన్‌జెన్ చాంగ్‌పట్టణానికి ఆకస్మాత్తుగా చేరుకొన్నారు. అడవుల్లో వున్నప్పుడు వారెక్కడ వున్నదీ నాన్‌కింగ్ ప్రభుత్వ పైలెట్లకి అంతుచిక్కలేదు. లోలో ప్రజలు దారిచూపిస్తూ వుండగా ఇరుకైన కొండదారుల గుండా అగ్రగామి దళం నెమ్మదిగా పాకుతూ ప్రయాణం చేసి ఆ చిన్న పట్టణానికి చేరుకొన్నది. ఎత్తయిన ప్రదేశం నుండి నది ఒడ్డుకు తేరిపారి చూసింది. నదికి దక్షిణపు ఒడ్డున మూడు ఫెర్రీ బోట్లు (బల్లకట్టు పడవలు) ప్రయాణం చేయ టాన్నివారు ఆశ్చర్యంగానూ సంతోషంగానూ గమనించారు. మరోసారి అదృష్టం వాళ్లకి మిత్రుడుగా పనిచేసింది.

అదెలా జరిగింది? అవతలి ఒడ్డున సెచు వాన్ రాష్ట్రానికి సహనియంత అయిన జనరల్ లియూ వెన్ హుయికి చెందిన ఒక రెజిమెంట్ సైన్యం మాత్రమే వుంది. సెచువాన్ సైన్యాలు నాన్‌కింగ్ ప్రభుత్వం పంపిన అదనపు సైనిక బలగాలు టాటూ నది వైపుకు తీరిగ్గా ప్రయాణం చేస్తున్నాయి. ఈలోగా ఒక్క రెజిమెంటు అక్కడ వుంటే సరిపోతుందని భావించారు. పడవలన్నిం టినీ ఉత్తరం వైపుకి తెప్పించారు.



లాంగ్‌మార్చ్‌లో మంచుపర్వతాలను అధిగమిస్తున్న రెడార్మీ

గనుక ఒక దళమైనా సరిపోతుందని అనుకున్నారు. కాని ఆ రెజిమెంట్ కమాండర్ అదే జిల్లాకు చెందిన వాడు. కమ్యూనిస్టులు ప్రయాణం చేయవలసిన ప్రదేశాన్నీ గురించీ, నది వద్దకు చొచ్చుకు రావాలంటే పట్టేకాలాన్ని గురించీ అతనికి తెలుసు. అక్కడికి రావాలంటే కమ్యూనిస్టులకు చాలా రోజులు పడుతుందని తన మనుషుల కతడు చెప్పి వున్నాడు. అతని భార్య ఆన్‌జెన్ చాంగ్‌పట్టణవాసి. కాబట్టి తన బంధువుల్ని, మిత్రుల్ని చూసి వారితో కలిసి విందారగిం చాలంటే అతను నది దక్షిణపు ఒడ్డుకు రావలసి వుంది. ఈ సందర్భంలో కమ్యూనిస్టులు పట్టణా న్ని ఆకస్మాత్తుగా స్వాధీనం చేసుకొని కమాండర్ని, అతను పడవని పట్టుకున్నారు. ఉత్తరం వైపుకు వారు ప్రయాణం చేస్తున్న మార్గాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.

మొదటి పడవలో అవతలి ఒడ్డుకు ప్రయా ణం చేసి మిగిలిన పడవల్ని తీసుకరావటానికి అయిదు కంపెనీల నుండి 16 మంది చొప్పున వెళ్లటానికి ముందుకొచ్చారు. నదికి దక్షిణపు ఒడ్డుకు ఎత్తయిన కొండ ప్రదేశాల మీద కమ్యూ నిస్టులు మరతుపాకుల్ని అమర్చి వున్నారు. బహిర్గతమైన శతృవు స్థానాల మీద కాల్పుల వర్షం కురిపించటానికి నదికి ఇవతలి వైపు నుండి రక్షణశక్తిని కేంద్రీకరించి వున్నారు. అది మే నెల, కొండలమీద నుండి వరదలు వచ్చిపడి పోతున్నాయి. నది చాలా వేగంగా ప్రవహిస్తు న్నది. యాంగ్సీ నదికన్నా చాలా వెడల్పుగా వున్నది. పడవ ప్రవాహం ఎగువభాగంనుండి ప్రారంభించి పట్టణానికి సరిగ్గా ఎదురుగా వున్న ప్రదేశానికి చేరుకోవటానికి రెండు గంటలు పట్టింది. దక్షిణపు ఒడ్డునుండి ఆన్‌జెన్ చాంగ్ ప్రజలు నిట్టూర్పువిడువకుండా ఇదంతా గమనిస్తున్నారు. వారిని మొత్తంగా తుడిచిపెట్టి వేస్తారా? వేచి చూడవలసి వుంది. పడవలో వెళ్లిన ప్రయాణీకులు శత్రువు తుపాకులకు దాదా పు దగ్గర్లోకి చేరుకున్నారు. దక్షిణపు ఒడ్డు నుండి కమ్యూనిస్టుల మరతుపాకులు గర్జించాయి. ఆ



శత్రువు తుపాకీ గుళ్ళ వర్షంకురిపిస్తుండగా టాటూహో నదిని దాటుతున్న రెడార్మీ యోధులు

చిన్నదళం ఒడ్డుకు ఎక్కుతూ, రక్షణ తీసుకుంటూ శత్రువు స్థానాలకు పైగా వున్న ఒక ఎత్తయిన ప్రదేశాన్ని మెల్లగా చేరుకొన్నారు. అక్కడ వారు తమ మర తుపాకుల్ని నెలకొల్పుతున్నారు. నదికి దగ్గరలో వున్న శత్రువుల పైకి తూటాలను, చేతి బాంబులను వర్షంలా కురిపించారు.

ఆకస్మాత్తుగా తెల్లసైనికులు కాల్పులు విరమించారు. తమ మొదటిస్థానాల నుండి పారిపోయి రెండవ రక్షణ శ్రేణికి వెనక్కి తగ్గారు. దక్షిణపు ఒడ్డునుండి పెద్ద గుసగుసలు బయలు దేరాయి. పడవలు నిలిచే ప్రదేశాన్ని ఈ చిన్నదళం స్వాధీనం చేసుకొనే సరికి ఇవతలి ఒడ్డునుండి "హో! హో!" అంటూ పెద్ద అరుపులు వినిపించాయి. ఈ లోగా మొదటి పడవ మరో రెంటిని తీసుకొని దక్షిణపు ఒడ్డుకు తిరిగి వచ్చింది. ఈ సారి రెండవదఫా ప్రయాణంలో ఒక్కొక్క దానిలో 80 మంది ప్రయాణం చేశారు. శత్రువు పారిపోయాడు. ఆ రోజు, ఆ రాత్రి, ఆ తర్వాత మళ్ళీ మరునాడు ఈ మూడు పడవలు ఆన్‌జెన్ చాంగ్ నుండి అటూ ఇటూ ప్రయాణం చేసి దాదాపు ఒక డివిజన్ సైన్యాన్ని ఉత్తరపు ఒడ్డుకు చేర్చింది.

అయితే అది మరింత వేగంగా ప్రవహిం చనారంభించింది. నదిని దాటటం మరింత కష్టంగా తయారైంది. ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు వెళ్లటానికి మూడోనాడు ఒక్కొక్క బోటు మనుష్యులకి నాలుగు గంటలకాలం పట్టింది. ఈ రేటు ప్రకారం సాగితే మొత్తం సైన్యమూ, దాని జంతువులు, దాని సప్లయిలు అవతలి ఒడ్డుకు చేరాలంటే వారాల తరబడి పడుతుంది. ఈ పనంతా పూర్తవటానికి చాలా ముందుగానే వాళ్లు చుట్టుముట్టబడతారు. ప్రథమ సైనిక కోర్ ఇప్పుడు ఆన్‌జెన్ చాంగ్‌లో వుంది. దాని వెనుక: పక్కవాటు పోరాట సైనిక కాలమ్స్, రవాణా దళాలు, చివరి కాపలా దళాలు వున్నాయి. ఈ ప్రదేశాన్ని చియాంగ్‌కై షేక్ విమానాలు కనిపెట్టి ముమ్మరంగా బాంబుదాడులు చేస్తున్నాయి. శతృసైనికులు ఆగ్నేయవైపు నుండి పరిగెత్తుకొస్తు న్నారు. మరికొన్ని సైన్యాలు ఉత్తరం వైపు నుండి తరలివస్తున్నాయి. అత్యవసరమైన సైనిక సమా వేశాన్ని లిన్ పియావో ఏర్పాటు చేశాడు. ఈ సమయానికల్లా ఛూటే, మావో సే- టుంగ్, చౌ ఎన్-లై, పెంగ్ టూ - హుయే నది వద్దకు చేరుకున్నారు. వారొక నిర్ణయాన్ని తీసుకొని వెం టనే అమలు జరపడం ప్రారంభించారు.

ఆన్‌జెన్ చాంగ్‌కు పశ్చిమంగా సుమారు 400 లీల దూరంలో, నదికి అటూ ఇటూ ఎత్తయిన సన్నని త్రోవగుండా ఆ నది చాలా లోతుగా, వేగంగా ప్రవహించే స్థలం వుంది: అక్కడ ఇనుపగొలుసులతో కూడిన సస్పెన్షన్ బ్రిడ్జి (అవసరం అనుకున్నప్పుడే అమర్చి, లేద నుకున్నప్పుడు తీసివేయటానికి వీలైన వంతెన) వుంది: ఈ వంతెనను లియూ అనే అతను బిగిం పజేసాడు. గనుక దానికి లియూ టింగ్ చియావో అని పేరు వచ్చింది. టిబెట్టుకి తూర్పున టాటూ నదిని దాటటానికి అదే చివరి అనువైన ప్రదేశం. దానివైపుగా కమ్యూనిష్టులిప్పుడు వొట్టికాళ్లతో ప్రయాణం సాగించారు. ఎత్తయిన కొండల మధ్య ఇరుకైన ప్రదేశాల గుండా వెళ్లేదారి అది. కొన్ని సందర్భాల్లో అనేక వేల అడుగుల ఎత్తు ఎక్కవలసి వుంటుంది. అక్కడక్కడ గుండెల ఎత్తు బురదలో ఈడ్చుకొంటూ పోవలసి వచ్చింది. లియూ టింగ్ చియావోను వశపర్చుకోగలిగి నట్లయితే యావత్తు సైన్యమూ మధ్య సెచువాన్ లోకి ప్రవేశించవచ్చు. అందులో గనుక విఫలమయితే వారు మళ్లీ వెనక్కి వెళ్లి లోలో రాజ్యం గుండా ప్రయాణం చేసి తిరిగి యూనాన్ లోకి ప్రవేశించవలసి వుంటుంది. అక్కడనుండి పడమరగా వెళ్లి టిబెట్టు సరిహద్దున గల లికియాంగ్‌కు తమ మార్గాన్నిపోరాడి సాధించు కోవలసివుంటుంది. ఇదంతా ప్రయాణం చెయ్యాలంటే వెయ్యి లీలకు పైగా నడపవలసి వుంటుంది. ఆ తరువాత బతికిబయటపడేది చాలా కొద్దిమంది మాత్రమే.

దక్షిణపు ఒడ్డు వెంట ప్రధాన బలగాలు పశ్చిమ దిక్కుగా ప్రయాణం చేస్తూ వుండగా అప్పటికే ఉత్తరపు ఒడ్డుకు చేరుకొన్న కమ్యూనిస్టు సైనిక డివిజన్ కూడా ప్రయాణం సాగించింది. కొన్నిసందర్భాల్లో ఆ నది ఇరుకుదారి ఎంత సన్నగా వుందంటే అటూ ఇటూ రెండు ఒడ్డుల వెంట ప్రయాణం చేస్తున్న రెండు కమ్యూనిస్టు శ్రేణులు ప్రవాహం మీదుగా ఒకరితో ఒకరు పెద్దగా అరిచి మాట్లాడుకోవచ్చు. మరికొన్ని సందర్భాల్లో నది ప్రవాహం వెడల్పు చాలా ఎక్కు వై తమని ఈ అగాధం శాశ్వతంగా వేరు చేస్తుందేమోనన్నంతగా వాళ్లు భయపడి, మరింత వేగంగా నడక సాగించేవారు. రాత్రిపూట భయంకరమైన ఎత్తయిన ప్రదేశాల గుండా ప్రయాణం చేస్తున్నప్పుడు వారివద్దనున్న పదివేల టార్చిలైట్ల ఈ అగ్రగామి దళాలు రెట్టింపు వేగంతో నడిచారు: పదినిమిషాల విశ్రాంతి కోసం, ఆహారం తీసుకోనటం కోసం తమ రాజకీయ కార్యకర్తలు చేసే ప్రసంగాలు వినటం కోసం మాత్రమే వారు ఆగేవారు. అలసిపోయి వున్న రాజకీయ కార్యకర్తల ప్రసంగాన్ని సైనికులు వినేవారు. ఈ ఒక్క చర్యకు గల ప్రాముఖ్యతను వారు పదేపదే వివరించేవారు. తమ ముందున్న పరీక్షలో నిలబడటానికి ప్రతి ఒక్కరు తమ చివరి శ్వాసను కూడా ఇవ్వాలని, తమకున్న చివరి అత్యవసర బలాన్ని వినియోగించాలని ఉద్బోధిం చేవారు. నడక వేగంలో సడలింపుగానీ, అర్థ మనస్సుతో వ్యవహరించటం గానీ, అలసట గానీ పనికిరాదు. విజయమే జీవితం, ఓటమి అంటే తప్పకుండా మరణమే" అని పెంగ్ టే హుయే చెప్పాడు. రెండో రోజున కుడి ఒడ్డున నడుస్తున్న అగ్రగామి దళం వెనకబడిపోయింది. దారిలో సెచువాన్ సైన్యాలు తమ తమస్థానాల్లో నిలిచి వున్నాయి. సంఘర్షణలు జరిగాయి. దక్షిణపు ఒడ్డున ప్రయాణం చేస్తున్నవారు మరింత ముభావంగా నడుస్తున్నారు. ఇప్పుడు అవతలి ఒడ్డున కొత్త సైన్యాలు కనిపించాయి. ఫీల్డుగ్లాసుల ద్వారా చూసి అదనపు తెల్లసైనిక

బలగాలు లియూ నిర్మించిన వంతెన వైపుకి వేగంగా ప్రయాణం చేస్తున్నట్లు కమ్యూనిస్టులు గ్రహించారు. ఒక రోజంతా ప్రవాహానికి అటూ ఇటూ ఒకరితో ఒకరు పోటీపడి నడిచారు. అయితే ఎర్రసైన్యం నుండి ఏరికోరి రూపొందించబడిన ఎర్రసైనిక అగ్రగామి దళం క్రమంగా అలసి పోయిన శతృసైనికుల్ని వెనుకపడేసింది. శతృ సైనికుల విశ్రాంతి కాలం చాలా హెచ్చుగా వుండేది. మరింత తరచుగా ఉండేది. వాళ్లశక్తి అంతా అయిపోయినట్లుంది. ఒక వంతెన కోసం తమ ప్రాణాలర్పించటానికి వాళ్లు ఏమంత ఆతురతగా ఉన్నట్టు లేరు.



లాంగ్‌మార్చ్‌లో రెడార్మీ సైనికులు

లియూ చేత బిగింపబడిన వంతెన శతాబ్దాలనాటిది. పశ్చిమచైనాలో లోతైన నదులపైన నిర్మించే అన్ని వంతెనల లాగానే ఇదీ నిర్మించబడింది. ఒక్కొక్క ఇనుపగొలుసు పొడవు నూరు గజాలు, అంతకుమించి వున్నటువంటి 16 గొలుసులు నదికడ్డంగా అమర్చబడి ఉన్నాయి. ఆ గొలుసుల కొనలు రాతి స్తంభాలమీద నిర్మించిన పెద్ద పెద్ద సిమెంటు దిమ్మెల్లో ఇరు వైపులా బిగించబడి వున్నాయి. ఆ గొలుసులపైన అమర్చిన బల్లలు ఆ వంతెనకు రోడ్డు అయితే కమ్యూనిస్టులు వచ్చి చూసేసరికి సగందారిలో ఆ చెక్కలు తొలగింపబడి వున్నాయి. ప్రవాహం మధ్యలో సగం దూరానికి వట్టి ఇనుప గొలుసులు మాత్రమే వేళ్లాడుతున్నాయి. వంతెనకి ఉత్తరపు అంచు నుండి శతృవుకి సంబంధించిన ఒక మరతుపాకి కమ్యూనిస్టులపైకి ఎక్కుపెట్టబడి వుంది. వారివెనుక తెల్లసైన్యానికి చెందిన ఒక రెజిమెంటు సైనికులు తమ తమ స్థానాల్లో నిలిచి వున్నారు. అసలు వంతెన నాశనం చేసి వుండే వాళ్లు. కానీ తమకున్న కొద్ది వంతెనలపట్ల సెచువానీయులకు అభిమానం మెండు. తిరిగి నిర్మించాలంటే అంత తేలికైన విషయమేమీ కాదు. అందుకు చాలా ఖర్చవుతుంది. "ఎనిమిది రాష్ట్రాల సంపదను ఖర్చుపెట్టి దాన్ని నిర్మించాడు" అని లియూని గురించి చెప్పుకుంటుండే వారు. అంతేగాక వొట్టి గొలుసుల ఆధారంతోనే నదిని దాటటానికి కమ్యూనిస్టులు ప్రయత్నిస్తారని ఎవరూహించారు? కాని వాళ్లు చేసింది సరిగ్గా అదే. కాలాన్నెంత మాత్రమూ పోగొట్టుకో కూడదు. 'అదనపు శత్రు బలగాలు వచ్చేలోగా వంతెనను స్వాధీనం చేసుకోవాలి. అందుకొరకు వాలంటీర్లు ముందుకు రావలసిందిగా కోరారు. తమ ప్రాణాల్ని వొడ్డటానికి ఎర్రసైనికులు ఒకరివెంట ఒకరు ముందుకు వచ్చారు. అలా ముందుకు వచ్చిన వారిలో 30 మందిని ఎన్నుకొన్నారు. చేతిబాంబులు, మౌజర్లు (తుపాకులు) వీపులకు కట్టుకున్నారు. నురగలు కక్కుతున్న నదిపైన గల గొలుసులు కేంద్రాలపైన కమ్యూనిస్టుల మర తుపాకులు కాల్పులు సాగించాయి. వంతెనకి అవతలివైపు స్థానాల మీద తూటాల వర్షం కురిపించారు. శత్రువు కూడా తన మరతుపాకులతో సమాధానమిచ్చాడు. నీటి మట్టానికిపైన వ్రేళ్లాడుతూ మెల్లగా తమవైపుకు వస్తున్న కమ్యూనిస్టులపైన గురిచూసి కాల్పులు జరపటం మొదలెట్టారు. మొట్టమొదట యోధుడు తూటాదెబ్బకి గుర్రై ప్రవహిస్తున్న నీటిలో పడిపోయాడు. అయితే మిగిలినవారు వంతెనమధ్యకి వెళ్లేకొలదీ ఆ వంతెనమీదలగల చెక్కతో నిర్మించిన దారి చావటానికైనా సిద్ధపడిన ఈ సాహస వీరులకు కొంతమేరకు రక్షణగా సహాయపడింది. శతృవు పేల్చిన తూటాల్లో హెచ్చుభాగం వీరిమీదుగా వెళ్లిపోయాయి. లేదా అవతల ఒడ్డున వున్న కొండలకు తగిలాయి.


ఇటువంటి యోధులను, సైనికులుగా వుండటమంటే ఒక పళ్లెం తిండి తినటంగాక విజయం సాధించటానికై ఆత్మహత్యకైనా సిద్ధపడే యువకులను సెచువానీయులు బహుశా ఇంతకు ముందెన్నడూ చూసివుండలేదు. వాళ్లు మానవ మాత్రులా లేక పిచ్చివాళ్లా, లేక దేవత లా? లేకపోతే తమ మనోనిబ్బరమే దెబ్బతిన్నదా? వాళ్లని చంపటానికై అసలు కాల్పులు జరుపనే లేదా? ఈ మనుషులు తమ ప్రయత్నంలో విజయం పొందాలని తమలో కొందరు దేవుణ్ణి ప్రార్థించారా? చివరికి ఒక కమ్యూనిస్టు వంతెన దారి మీదకి వచ్చి ఒక చేతిబాంబు పిన్ను నోటితో లాగి శతృ సైనిక కేంద్రంపైన సరిగ్గా గురిచూసి విసిరాడు. వంతెనలో మిగిలిన సగం చెక్కల్ని గూడా లాగిపార వేయవలసిందని జాతీయ వాద సైనిక ఆఫీసర్లు వుత్తర్వులు జారీచేశారు. అయితే, అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. మరింత మంది కమ్యూనిస్టులు వచ్చేస్తున్నారు. చెక్కలపైన పారాఫిన్ నూనె పోశారు. వంతెన తగులబడటం ప్రారంభమైంది. ఆ సమయానికల్లా దాదాపు 20 మంది కమ్యూనిస్టులు చేతులతోను, మోకాళ్లతోను పాకుకుంటూ ముందుకు వస్తున్నారు. శత్రువు మరతుపాకి వున్న గూటి మీదికి చేతి బాంబులను ఒకదాని తర్వాత ఒకటి విసురుతున్నారు.

దక్షిణపు ఒడ్డున తమ కామ్రేడ్సు పరమానందంతో పెద్దగా అరవటం మొదలెట్టారు. "ఎర్రసైన్యం వర్ధిల్లాలి! విప్లవం వర్ధిల్లాలి! టాటూ హో వీరులు వర్ధిల్లాలి!" అనే నినాదాలు చేవారు. ఎందుకంటే శతృవు గందరగోళంగా పలాయనం చేస్తూ ఉపసంహరించుకుంటున్నాడు. తమ మీదికి లేస్తూ వున్న మంటల్లో గుండా వాళ్లు వంతెనలపైన మిగిలిన చెక్కల మీదుగా శక్తి వున్నంత వేగంతో పరిగెత్తారు. శత్రువు అమర్చి వున్న మరతుపాకిని స్వాధీనం చేసుకొని దాన్ని ఒడ్డు మీదకి తిప్పారు. గొలుసుల మీదుగనే మరికొంతమంది కమ్యూనిస్టులు ఇప్పుడక్కడికి చేరుకున్నారు. మంటలనార్పి చెక్కల్ని తిరిగి అమర్చటంలో సహాయపడ్డారు. ఆ తరువాత కొద్ది సమాయానికే ఆన్‌జెన్ చెంగ్ వద్ద నదిని దాటిన ఎర్ర సైనిక డివిజన్ కనబడింది. మిగిలిన శత్రుస్థానాలపైన పక్కవాటు దాడి ప్రారంభించింది. కొద్దిసేపట్లోనే తెల్లసైన్యాలు పూర్తిగా పలాయనం చిత్తగించాయి. పలాయనం సాగిస్తూ వున్న వారిలో ఒక వందమంది సెచువాన్ సైనికులు తమ రైఫిళ్లను క్రిందపెట్టి తమను వెంబడిస్తున్న ఎర్రసైనికులతో చేరిపోయారు. ఒకటి రెండు గంటల్లో ఎర్రసైన్యంఅంతా టాటూ నదిమీదుగా సెచువాన్‌లోకి ఆనందంతో పాటలు పాడుకుంటూ నడక సాగిస్తున్నది. వాళ్ల తలల మీద చాలా ఎత్తున చియాంగ్‌కై షేక్‌కు చెందిన విమానాలు కోపంతో, నిస్సారంగా కాల్పులు సాగిస్తున్నాయి. కమ్యూనిస్టులు అందుకు సవాలుగా గర్జన చేస్తున్నారు. విశిష్టమైన ధైర్యసాహసాలను ప్రదర్శించినందుకు ఆన్‌జెన్ చింగ్ వీరులకు, లియూ టింగ్ చియావో (టాటూ వంతెన) వీరులకు చైనా ఎర్రసైన్యంలో అత్యంత విలువైన అలంకరణగా భావించే "బంగారు నక్షత్రాన్ని" బహూకరించారు.

**(ఈ వ్యాసం ఎడ్గార్‌స్నో రచించిన 'చైనాలో అరుణతార' గ్రంథంనుండి తీసుకోబడింది)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-12-2017 (36 pages) Postal Regd. No VJ/172/2015-17

# చారిత్రక పరిణామాలకు నాంది పలికిన ఆర్యుల వలస



**డి డి కోశాంబి**

“భరతఖండంలోని సింధులోయ నగరాలను నాశనం చేసిన ఆర్యులు క్రీస్తు పూర్వం రెండో సహస్రాబ్దం మొదట్లో ఇక్కడికి వచ్చారు. రెండో సహస్రాబ్దం మధ్య కాలానికి మధ్యధరా తూర్పు ప్రాంతంలో ఆర్యబృందాలు స్థిరనివాసాలు ఏర్పరచుకున్నాయి. వీరు సుమేరియన్, సెమెటిక్ నాగరికత వారసత్వాన్ని సొంతం చేసుకున్నారు. వీరికి 'పశుపాలక రాజులు' అని అర్థం వచ్చే పేరు ఉండేది. భరత ఖండాన్ని జయించిన ఆర్యులకు కూడా ఈ పేరు సరిపోతుంది. 22వ, 23వ వంశాల ఈజిప్టు రాజులలో షషాంక్ అనే పేరు తరచు వినిపిస్తుంది. శశాంక అనే ఆర్య శబ్దానికి దీనికి దగ్గర సంబంధం ఉందని అనిపిస్తుంది. ఈ రాజవంశాల మూలపురుషులు ఎక్కడి నుంచో వలస వచ్చినవారే, టిర్రేనియన్, సార్డీనియన్ మొదలైన వీరి తెగలు ఆర్య సంబంధమైనవే. “ఇండో యూరోపియన్ బృందంలోని కొన్ని తెగల ప్రజలు తాము ఆర్యులమని చెప్పుకోవడమేగాక, తమది ఒక జాతి అని కూడా అభిప్రాయ పడేవారు. పర్షియా రాజు ఒకటో డేరియస్ తన సమాధి శాసనంలో 'పార్సు, పార్సహ్యా పుత్ర, ఆర్య, ఆర్యచిత్ర” అని రాయించుకున్నాడు. నేను “పార్సీని, పార్సీపుత్రుడను, ఆర్యుడను, ఆర్యవంశుజుడను” అని మాటలను అనువదించవచ్చు. అలెగ్జాండర్ దండయాత్రకాలంలో అరియోయ్ అనే ప్రజలు ఉండేవారు. ఇరాన్ (అరియానా)లో కొంతభాగం, ఆఫ్ఘనిస్తాన్ నుంచి సింధులోయ వరకు కొన్ని ప్రాంతాలు, సింధులోయ పొడుగునా విస్తరించిన అరియనోయ్ ప్రాంతం ఈ అరియోయ్ ప్రజల అధీనంలో ఉండేది. జర్మన్లలో 'అరి' అనే ఒక తెగ గురించి టాసిటస్ పేర్కొన్నాడు. వీరు పరాక్రమవంతులు. ఇతర్లపై పెత్తనం చేయడం ఇష్టం ఉండేది కాదు. కాని, బరిలో దిగితే శతృభయంకరులేనని టాసిటస్ వర్ణించాడు .వీటన్నింటిని బట్టి అర్థమయ్యేది ఏమిటి? 'ఆర్య' శబ్దం ఒకానొక జీవన విధానానికి, ఒక భాషా బృందానికి సంకేతంగా భావించవచ్చు.

“చరిత్రలో పలుమిశ్రమ జాతుల రూపంలో ఆర్యులు రాజ్యాలేలారు. కస్సైట్లు, హిటైట్లు, గ్రీకులు మొదలైన వారు ఈ కోవకు చెందినవారే. చరిత్రపూర్వ యుగంలో వీరు యుద్ధవీరులుగా, బహుముఖ ప్రజ్ఞాశాలురుగా, కంచుయుగానికి చెందిన పితృస్వామిక తెగలుగా, ప్రధానంగా పశుపాలనపై ఆధారపడి జీవించిన బృందాలుగా కనిపిస్తారు. మొదట వీరే ఇనుము ఉపయోగాన్ని అర్థం చేసుకుని వ్యాప్తిచేశారు. మొదట గుర్రాన్ని విస్తృతంగా వాడిందికూడా వీరే. గుర్రాన్ని స్వారీకి కాకుండా, రథాలు లాగించడానికి ఉపయోగించారు. ఆర్యులు కాక మిగతా వారు యుద్ధాలలో గుర్రాలను ఉపయోగించడం చాలా కాలానికి గాని జరగలేదు. ఆనాటికి అస్సీరియన్ అశ్వికదళమే అత్యుత్తమైనది. గుర్రాలతో నాగలి లాగించే పద్ధతిని మొట్టమొదట ఉత్తర ఐరోపాలోనే కనుగొన్నారు. యుద్ధాలలో గుర్రాలను విపరీతంగా ఉపయోగించడం ఆనాటి సమాజం మీద చెరగని ముద్రవేసింది. సమాజంలో ఒక కొత్త వర్గమే పుట్టుకొచ్చింది. గుర్రాలు పెంచడం ఉపయోగించడం వీరి ప్రత్యేక హక్కు. నగర జీవితం నుంచి “నాగరికత” అనే మాట ఏర్పడినట్లే గుర్రాల ద్వారా “రౌతు”, “అశ్వికదళం” లాంటి మాటలు తయారయ్యాయి. “ఇరానియన్లు, ఇండో ఆర్యన్ల పేర్లలో, ఆచారాలలో బలమైన సారూప్యం కనిపిస్తుంది. ఒకేరకం ఉత్పత్తి సాధనాలతో జీవించిన వారి మధ్య ఒకేరకం ఆచారాలు రూపొందించడం మామూలే. కాని, పేర్లు కూడా ఒకేరకంగా ఉన్నాయంటే, వారి మధ్య నిత్య సంబంధాలేవో ఉండి ఉండాలి. మృతశరీరాలను దహనం చేసే ఆచారం మొదట ఆర్యులలోనే బాగా విస్తరించింది. లోహయుగానికి ముందు ఈ ఆచారం ఉండినా, ఇంత విస్తృతంగా వ్యాపించడం అసాధ్యం. మొత్తానికి, ఆర్యుల మధ్య ఎన్ని సామాన్య లక్షణాలున్నప్పటికీ, వివిధ ఆర్య బృందాల మధ్య తేడాలు కూడా బాగానే కనిపిస్తున్నాయి. భారత ఉపఖండానికి వచ్చిన రెండు ఆర్య బృందాల మూల స్థానాన్ని చాలావరకూ నిర్దిష్టంగానే నిరూపించవచ్చు. ఖోరెజమ్ ప్రాంతం నుంచి ఆర్యులు రెండు బృందాలుగా వలస వచ్చారు. మొదటి బృందం క్రీస్తుపూర్వం రెండవ సహస్రాబ్ది మొదట్లోనే బయల్దేరింది. ఆ సహస్రాబ్దం చివర్లో మరో బృందం ఇటువైపు పయనం కట్టింది. ఇంతకూ ఇక్కడి నుంచి ఆర్యులు వలసపోవడం ఎందుకో స్పష్టంగా తెలియదు. భయంకరమైన వైపరీత్యమేదీ జరిగినట్లు ఆధారాలు లేవు. జనాభా బాగా పెరగడమే వలసకు దారితీసి ఉండొచ్చు. ఖరోజమ్ నుంచి కొన్ని పశుపాలక బృందాలు వెళ్లి రష్యా గడ్డి భూములను ఆక్రమించినట్లు తెలుస్తోంది. మరి కొందరు క్యాస్పియన్ సముద్రం చుట్టూ తిరిగి ఆసియా మైనర్ చేరారు. ఇంకో బృందం దనుబే లోయకు, ఉత్తర ఐరోపాకు వెళ్లారు. చరిత్రకెక్కిన గండ్ర గొడ్డలి (బ్యాటిల్ ఏక్స్) ప్రజలకు మూల పురుషులు వీరే. కొత్త విషయాలు నేర్చుకొని, సొంతం చేసుకోవడం ఆర్యుల ప్రత్యేకత. ప్రధానంగా ఎగువ పంజాబ్ ప్రాంతం రుగ్వేదానికి రంగభూమి. రుగ్వేదార్యులు వంద తెడ్లతో నడిచే ఓడను నడిపారు. ఏక బిగిని మూడు రోజులపాటు నీటిలో ప్రయాణం చేశారు. (రుగ్వేదం 1,116.4-5)

“ఆర్య బృందాల మధ్య ఎన్ని తేడాలైన ఉండొచ్చు. తాము కాలుమోపిన ప్రతిచోటా అద్భుత చారిత్రక పరిణామాలకు నాందిపలికారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజలు వేర్వేరు అదిమ విశ్వాసాలతో, పాత పనిముట్లతో కుంచించుకుపోయారు. ఆర్యులు వచ్చి వీరి మధ్య అడ్డుగోడలను ధ్వంసం చేశారు. రెండు సహస్రాబ్దాల తరువాత, విభిన్న చారిత్రక నేపథ్యంలో అరబ్బులు దాదాపు అదేపాత్ర నిర్వహించారు”.

***(డిడి కోశాంబి రచించిన “భారతదేశ చరిత్ర పరిచయ వ్యాసాలు” గ్రంథం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)***

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490099275. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.12, No.8. Published on December 1, 2017